ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 01.08.2026 | సంపుటి : 13 సంచిక : 12 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370


హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

## పొడిగింపు..


### 'సర్' గడువు ఆగస్టు 10 వరకు..

కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం



### ఎల్ఆర్ఎస్ నవంబర్ 30 వరకు..

ఛార్జీల్లో 25 % రాయితీ కొనసాగింపు



### రేషన్‌కార్డు ఈ-కేవైసీ ఆగస్టు 31 వరకు..



వివరాలు లోపలి పేజీల్లో..

# రైజింగ్ తెలంగాణ ప్రపంచపెట్టుబడులకు సేఫ్

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

- 2037 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా ముందుకెళుతున్నాం
- తెలంగాణకు రండి..పెట్టుబడులు పెట్టండి
- పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం
- ఫార్చున్ 500 కంపెనీలు ఫ్యూచర్ సిటీకి రావాలనేదే లక్ష్యం
- రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదు
- సీఐఐ ఉత్తర భారత ప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్

"బిల్‌గేట్స్, బిల్‌క్లింటన్ వంటి దిగ్గజాలను చంద్రబాబు హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ అభివృద్ధి చెందాయి. ఫార్మా, ఐటీ రంగాలు మరింత అభివృద్ధి దిశగా వెళ్లాయి. గత పాలకుల మంచి విధానాలను మేము కొనసాగిస్తున్నాం. నాయకులెవరైనా.. పార్టీ ఏదైనా.. మంచి ఉంటే కొనసాగిస్తాం. ఉత్పత్తి రంగంలో చైనా, జపాన్, జర్మనీతో పోటీ పడుతున్నాం.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి బ్యూరో): తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన, సురక్షితమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన తెలంగాణ అభివృద్ధి దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. తెలంగాణకు పెట్టుబడిదారులకు పూర్తి భద్రత, పారదర్శక విధానాలు, వేగవంతమైన అనుమతులు, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. దేశ జీడీపీలో ప్రస్తుతం తెలంగాణ వాటా 5 శాతం ఉండగా, 2047 నాటికి దానిని 10 శాతానికి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అలాగే 2037 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలే నేడు భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలబెట్టాయని కొనియాడారు. గత ప్రభుత్వాల మంచి విధానాలను కొనసాగిస్తూనే కొత్త విధానాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని, తెలంగాణలో "పాలసీ పారాలసిస్" అనే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని మిగతా 2లో..

### ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్దపీట

2లో..

- టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత
- డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ
- స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

# బెదిరింపులతో జెన్‌జీ నోరు మూయించలేరు

## నిరసనకారులపై మోదీ సర్కార్‌వి కక్షసాధింపు చర్యలు

కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే అమిత్ షాతో రాజీనామా చేయించండి

ప్రధాని మోదీ, అమిత్ షాపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే విమర్శలు

సోషల్‌మీడియా ఖాతాలు తొలగిస్తూ, యువతపై ఎఫ్ఐఆర్‌లు, పాల్పడుతున్నారని ఆరోపణ

న్యూఢిల్లీ(జనంసాక్షి): నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. యువతను, ముఖ్యంగా జెన్-జీని బెదిరింపులతో నోరు మూయించలేరని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. అలాగే విద్యార్థులపై కేసుల నమోదు చేస్తూ కేంద్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. కేసుల పేరుతో విద్యార్థులు, జెన్‌జీ యువతను ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బెదిరిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నీట్ ప్రశ్న పత్రం లీకేజీకి వ్యతిరేకంగా పోరాడిన యువతపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తూ, వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగిస్తున్నారని తెలిపారు. తొలుత నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీఛార్జి చేసి ఎముకల విరిగొట్టారని, ఇప్పుడు కేసుల పేరుతో బెదిరింపులకు మిగతా 2లో..

### మోదీ రాజకీయాలు వదిలి ఇన్‌ఫ్లూయెన్సర్‌కావాలి

ఆయన చర్మం ఇండియా భవిష్యత్తు కన్నా ప్రకాశవంతంగా ఉంది

మోదీ సెల్ఫీ వీడియోపై అభిజీత్ దీప్కే సెటైర్లు

2లో..

### అయోధ్య విరాళాల చోరీపై కళ్లకు కట్టినట్టు నాటకం

పార్లమెంట్ ముందు ప్రతిపక్ష ఎంపీల మాక్ విన్యాసం

స్కిట్‌లో అతిథి పాత్రలో రాహుల్



2లో..

'ఇ20'తో ఇంజిన్ దెబ్బతినదు.. కానీ

### మైలేజ్ తగ్గొచ్చు

కేంద్రం కీలక ప్రకటన

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఇ20 పెట్రోల్ వల్ల వాహనాల ఇంజిన్లు త్వరగా దెబ్బతింటాయా? తుప్పు పట్టి వాహనాల ఆయుష్షు తగ్గుతుందా? ఇటీవలి కాలంలో ఈ అంశంపై సోషల్ మీడియాలో, వాహనదారుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ వేదికగా దీనిపై స్పష్టత ఇచ్చింది. ఈ20 ఇంధనం వల్ల ఇంజిన్ భాగాలు అరిగిపోవడం, తుప్పు పట్టడం లేదా వాహనం కాల పరిమితి తగ్గడం వంటి సమస్యలేవీ తలెత్తడం లేదని మిగతా 2లో..



బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది

# కన్నుమూత

- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
- ముఖ్యమంత్రి రేవంత్ సంతాపం
- ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా: కేసీఆర్

వరంగల్ ప్రతినిధి /నర్సంపేట, జూలై 31 (జనంసాక్షి): కేసీఆర్ ప్రధాన అనుచరుడు నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం మిగతా 2లో..





# ప్రాజెక్టులకు జలకళ

- శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద ఉధృతి
- జూరాలకు భారీగా చేరుకుంటున్న వరద
- ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

### భద్రాచలం వద్ద గోదావరికి ఒకటో నంబర్ హెచ్చరిక జారీ

హైదరాబాద్,జూలై31(జనంసాక్షి): రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఆయా ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరడంతో కళకళలాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి జలాశయంలోకి 74,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1069.20 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 21.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు తరలివస్తుంది . ఎగువ నుంచి 1,46,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు 28 గేట్లను ఎత్తి దిగువకు 1,33,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు కడెం జలాశయం గేట్లు ఎత్తడంతో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,21,354 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లోలో 1,08,493 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.45 టీఎంసీల నీరు మిగతా 2లో..

### శభాష్ పోలీస్ ..

గోదావరిలో చిక్కుకున్న 44 మందిని సురక్షితంగా రక్షించిన చర్ల పోలీసులు



2లో..

### పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు

# పొడిగింపు





- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి
- పథకానికి రూ.3.15 లక్షల కోట్లు కేటాయింపు
- ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36,441 కోట్లు
- రూ.4.51లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉద్దేశించిన పలు కీలక ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన దాదాపు రూ.4.51 లక్షల కోట్ల భారీ వ్యయంతో కూడిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేంద్ర మంత్రిమండలి పచ్చ జెండా ఊపింది. దేశంలోని రైతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించే పీఎం-కిసాన్ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.3,15,614 కోట్ల నిధులను కేటాయించినట్లు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.


**రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం**

2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మిగతా 2లో..

### ఒడిశాలో పీజీ ప్రశ్నాపత్రం లీక్!

వాట్సాప్ గ్రూపుల్లో ప్రశ్న పత్రం ఫోటోలు వైరల్

భువనేశ్వర్(జనంసాక్షి): నీట్ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా యువత ఆందోళనకు దిగడం, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026' పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం వంటి పరిణామాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ వ్యవహారం చర్చనీయంగా మారింది. "ఆల్ ఒడిశా మెడికల్ పీజీ ఎగ్జామినేషన్ ప్రశ్న పత్రం ఫోటోలు ఈ నెల 27న సోషల్ మీడియాలో ఫార్వార్డ్ అయ్యాయని అధికారులు చెప్పారు. 2023 - 26 బ్యాచ్ పీజీ విద్యార్థుల థియరీ ఎగ్జామ్ జరుగుతుండగానే ఇది జరిగిందని తెలిపారు" అని పీటీఐ రిపోర్ట్ చేసింది. అయితే, దీనిని ప్రశ్న పత్రం లీక్ అనలేమని బెర్హంపూర్‌లోని ఎంకేసీజీ మిగతా 2లో..



### చల్లారని ఉద్రిక్తతలు

హర్మూజ్‌లో నౌకల్ని అడ్డుకున్నామన్న ఐఆర్‌జీసీ.. స్పందించని అమెరికా

టెహ్రాన్(జనంసాక్షి): హర్మూజ్‌లో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. ఈ జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించగా.. ప్రపంచ వాణిజ్యానికి హర్మూజ్ తెరిచే ఉందని అమెరికా చెబుతోంది. ఈ క్రమంలో యూఎస్ మద్దతుతో హర్మూజ్ దాటేందుకు ప్రయత్నించిన రెండు నౌకల్ని అడ్డుకున్నట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. ఈ ఘటన తర్వాత మరో నాలుగు నౌకలు మిగతా 2లో..



### నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్

ఫార్ములా ఈ రేస్ కేసు తదుపరి విచారణ 25కు వాయిదా

హైదరాబాద్,జూలై31(జనంసాక్షి): ఫార్ములా-ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ విచారణకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఏసీబీ కోర్టు నోటీసులతో తొలిసారిగా మిగతా 2లో..



## తెలంగాణలో 'సర్' గడువు పొడిగింపు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ గడువును మరోసారి పొడిగించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించారు. ఆగస్టు 3న ముగియాల్సిన గడువును 10వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

## మరోసారి ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంపు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) గడువును మరోసారి పొడిగించారు. నవంబర్ 30 వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు గడువు పొడిగించారు. ఛార్జీల్లో 25 శాతం రాయితీని కొనసాగించారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఎప్పటికప్పుడు గడువు పెంచుకుంటూ వస్తున్నప్పటికీ ప్రజల నుంచి ఆశించిన స్పందన రావడంలేదు. వచ్చిన దరఖాస్తులే పరిష్కారం కాకపోవడంతో కొత్తవారు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ గడువు మరోసారి పెంచడం ఆసక్తికరంగా మారింది.గత ప్రభుత్వ హయాంలోనే ఎల్‌ఆర్‌ఎస్ పథకం ప్రకటించగా.. రాష్ట్రవ్యాప్తంగా 25.70 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్న సంగతి తెలిసిందే.

## రేషన్ కార్డు ఈ-కేవైసీ గడువు పొడిగింపు

హైదరాబాద్(జనంసాక్షి):జాతీయ ఆహార భద్రత చట్టం కింది రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. రాష్ట్రంలో రేషన్ కార్డుల ఈ-కేవైసీ గడువు నేటితో ముగియనుండగా, దాన్ని ఆగస్టు 31 వరకు పొడిగించింది. రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ, రేపటి నుంచి ఆగస్టుతో పాటు సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన ప్రజా పంపిణీకి రంగం సిద్ధమైన దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని జిల్లాల పౌర సరఫరాల శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాజా నిర్ణయం రీత్యా అర్హులైన ప్రతి ఆహార భద్రత కార్డుదారులు రేపటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రేషన్ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడంతో పాటు మూడు నెలల రేషన్ సరకులు పొందవచ్చు.

## బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే 'పెద్ది' కన్నుమూత

సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 12 గంటల 51 నిమిషాలకు కన్నుమూశారు. తెలంగాణ ఉద్యమ కారుడు బిఆరెస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందారని వార్త శుక్రవారం తెల్లవారుజామున వరంగల్ జిల్లా ప్రజలకు తెలియడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి శోకసముద్రంలో మునిగింది.ఈనెల 26 ఉదయం గుండె సంబంధిత సమస్యలతో యశోద హాస్పటల్ చేరిన పెద్ది సుదర్శన్ రెడ్డి శుక్రవారం తెల్లవారుజామున అర్ధరాత్రి 12 గంటల 51 నిమిషాలకు మృతిచెందారు. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. వరంగల్ జిల్లాలో పాటు నర్సంపేట నియోజకవర్గంలో పలు మండలాలలో పెద్ది సుదర్శన్ రెడ్డికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన సందర్భంలో పరిచయాలు ఉండడంతో ఒక్కసారిగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేలు నర్సంపేట బాట పట్టి పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొని ఘన నివాళులర్పించారు. వరంగల్ జిల్లాలోని అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించి ఉదయమే నర్సంపేటకు చేరుకుంటుందనుకున్న అంతిమయాత్ర మధ్యాహ్నం 12 గంటల వరకు చేరుకోవడంతో వేలాదిమంది కార్యకర్తలు పార్టీ అభిమానులు ఇతర పార్టీల వారు వరంగల్ రూరల్ నర్సంపేట అయ్యప్ప టెంపుల్ వద్దకు విచ్చేసి పెద్ది అంతిమయాత్రలో పాల్గొనేందుకు విచ్చేసి "పెద్ది" అందించిన సేవలను కొనియాడుతూ విషాద వదనంతో బరువెక్కిన హృదయంతో పెద్ది సేవలను గుర్తు చేసుకున్నారు.

**పెద్దిరెడ్డి మృతికి సిఎం రేవంత్ సంతాపం**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

**ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా: కేసీఆర్**

పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు.

నిబద్ధత కలిగిన ఉద్యమనాయకుడు పెద్ది: కేటీఆర్

తెలంగాణ ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తనను తీవ్ర విషాదానికి గురిచేసిందని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశాం.. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కేటీఆర్ అన్నారు. ఉద్యమ ఆశయాలను జీవితాంతం నమ్మి, ప్రజల పక్షాన నిలబడి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికి కూడా తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. ఆయన చూపిన నిబద్ధత, సేవా తపన, ఉద్యమ స్ఫూర్తి పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కేటీఆర్ ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు.

## ప్రాజెక్టులకు జలకళ

నిల్వ ఉంది. గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 10.30 గంటల వరకు గోదావరి ప్రవాహం 43 అడుగులకు చేరింది. కల్యాణ కట్ట, స్నానఘట్టాలు వరద నీటిలో ఉన్నాయి. ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ములుగు జిల్లాలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. మేడిగడ్డ నుంచి 8.35లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో తుపాకులగూడెంలోని సమ్మక్క బ్యారేజీ 59 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. వాజేడు మండలం టేకులగూడెం వద్ద రహదారిపైకి వరద నీరు చేరింది. వరద నీటితో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపురం మండలం బోదాపురం వంతెనపైకి వరదనీరు చేరడంతో వెంకటాపురం-భద్రాచలం మధ్య రాకపోకలకు అంతరాయమేర్పడింది.

# 'రైజింగ్ తెలంగాణ' ప్రపంచపెట్టుబడులకు సేఫ్

మూడు జోన్లుగా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ లోపలి ప్రాంతాన్ని ఆఖీఇగా అభివృద్ధి చేసి సేవారంగానికి కేటాయిస్తుండగా, ఔటర్ రింగ్ రోడ్ వెలుపలి ప్రాంతాన్ని ఖజఖీఇగా అభివృద్ధి చేసి తయారీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్‌కు అవతల ప్రాంతాన్ని కోర్‌గా అభివృద్ధి చేసి వ్యవసాయం, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నామని, రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో తెలంగాణను పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. "చైనా ప్లస్ వన్" వ్యూహంలో తెలంగాణ కీలక పాత్ర పోషించబోతోందని అన్నారు.వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్రం అనుమతులు ఇచ్చిందని, శంషాబాద్?చెన్నై, శంషాబాద్?పుణే, శంషాబాద్?బెంగళూరు మార్గాల్లో బుల్లెట్ రైళ్లు రానున్నాయని తెలిపారు.కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంతో ఉద్యోగాల స్వరూపం మారుతోందని, అందుకే నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. పబ్లిక్?ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ దేశంలోనే అత్యుత్తమ నైపుణ్య విద్యా కేంద్రంగా రూపుదిద్దుకుంటోందన్నారు.

పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను తయారు చేసే విధంగా కోర్సులు రూపొందిస్తున్నామని వివరించారు.రాష్ట్రంలో ఇప్పటికే 200 గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు (జీసీసీలు) పెట్టుబడులకు ముందుకు వచ్చాయని, అమెజాన్ లక్ష కోట్ల రూపాయలతో డేటా సెంటర్లు, అదానీ గ్రూప్ రూ.35 వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీకి ప్రపంచంలోని టాప్-500 కంపెనీలను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు."టోక్యో, న్యూయార్క్ వంటి ప్రపంచ నగరాలతో పోటీ పడుతున్నాం. తెలంగాణను మీ సొంత రాష్ట్రంగా భావించి పెట్టుబడులు పెట్టండి. ముందుకు రండి. మీరు ఎంత పెట్టుబడి పెడతారో, ఎంతమందికి ఉద్యోగాలు కల్పిస్తారో చెప్పండి... మిగతాదంతా మా ప్రభుత్వం చూసుకుంటుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు.

### ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్దపీట

హైదరాబాద్,జూలై31(జనంసాక్షి): టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శభాష్ పోలీస్ ..

చర్ల, జూలై 31 (జనంసాక్షి):చర్ల పోలీసులు సాహసం చేసి గోదావరి నడుమ చిక్కుకున్న 44 మందిని రక్షించి ప్రజలచే శభాష్ అని ప్రశంసలు అందుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని వీరాపురం ఇసుక ర్యాంపు వద్ద గోదావరిలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గోదావరి పాయ అవతల ఉన్న ఇసుక డంపింగ్ వద్దకు రోజు మాదిరిగా పనికి వెళ్ళిన 44 మంది కూలీలకు ఊహించని విధంగా చుట్టు ముట్టిన గోదావరి వరద షాక్ ఇచ్చింది. చూస్తుండగా పెరుగుతున్న వరదని చూసి వణికిపోయిన వాళ్ళంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాపాడమంటూ ఫోన్ ద్వారా గ్రామస్థులకు సమాచారం అందించారు. గోదావరిలో చిక్కుకొని ప్రాణభయంతో వణికిపోతున్న వారి ఆర్తనాదాలను గ్రామస్థులు అధికారులకు చేరవేశారు. విషయం తెలిసిన వెంటనే క్షణం ఆలస్యం చేయకుండా చర్ల తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడివో ఈదయ్య, సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డిలు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్నారు. గోదావరి వరద వేగంగా పెరుగుతుండటంతో నీటి నడుమ చిక్కుకున్న వారి ప్రాణాలకు ముప్పు కలుగుతుందని భావించిన చర్ల సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డిలు ప్రాణాలకు తెగించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చి రక్షించారు. అధికారుల బృందం సేవలను జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పివోలు అభినందించగా, ప్రజలు వేనోళ్ళ పొగడుతున్నారు.

## రంగనాథ్‌ను త్వరగా బదిలీ చేయాలి

**- సీఎస్‌కు హైకోర్టు ఆదేశాలు**

హైదరాబాద్(జనంసాక్షి): హైడ్రా శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. లోతుకుంట భూముల వ్యవహారంలో ఇటీవల ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తప్పించాలని సీఎస్‌ను హైకోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నది సుస్పష్టమని హైకోర్టు అందులో పేర్కొంది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని తెలిపింది. రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని సీఎస్‌కు సూచించింది. టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఈ సందర్భంగా ఉదహరించింది. చట్టపాలన మాత్రమే కొనసాగాలని.. వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి మరణ శాసనం అవుతుందని పేర్కొంది.

## నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్

విచారణకు కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కార్ రేస్‌తో ఊఓఆంకు రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని చార్జ్‌షీట్‌లో ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్‌ఎన్ రెడ్డి, ఈఇక్ష కంపెనీని నిందితులుగా ఏసీబీ అధికారులు ఈ కేసులో చేర్చారు.

## 'ఇ20'తో ఇంజిన్ దెబ్బతినదు కానీ మైలేజ్ తగ్గొచ్చు

ప్రభుత్వం సమర్థించుకుంది. ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం భారత్‌కు ఇంధన భద్రతను అందించడంతో పాటు అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం నుంచి సామాన్య వినియోగదారుల్ని కాపాడుతుందని పేర్కొంది. లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నీతి ఆయోగ్, వాహన తయారుదారులు, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలు , ఇతర సాంకేతిక సంస్థల సలహాలతో దశలవారీగా, శాస్త్రీయంగా ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్‌లు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విస్తృత ప్రయోగాలు, ఫీల్డ్ ట్రయల్స్‌లో ఇ20 ఇంధనం వాహనాలకు పూర్తి సురక్షితమని నిరూపితమైంది

## పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు

మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది.పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032-33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది.సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

## మోదీ రాజకీయాలు వదిలి ఇన్‌ఫ్లూయెన్సర్‌కావాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంట్‌లో యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ విడుదల చేసిన సెల్ఫీ స్టైల్ వీడియోపై, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. "దేశ భవిష్యత్తు కంటే ప్రధాని మోదీ చర్మం చాలా ప్రకాశవంతంగా ఉంది" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇంతకీ ఏమైందంటే పార్లమెంట్‌లో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ అమెండ్‌మెంట్ బిల్లు, 2026 ఆమోదం పొందింది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సెల్ఫీ స్టైల్ వీడియో విడుదల చేశారు. అందులో కొత్తగా వచ్చిన ఈ చట్టం పరీక్షల విధానాన్ని నిష్పక్షపాతంగా, నమ్మదగినదిగా మార్చడానికి ఒక ముఖ్యమైన అడుగు అని అన్నారు. ఈ చట్టం ద్వారా పేపర్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతికత, కఠినమైన చట్టాల ద్వారా పరీక్షల ప్రక్రియను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. పేపర్ లీకేజీ అంశంపై ప్రధాని మోదీ విడుదల చేసిన నాలుగో సెల్ఫీ వీడియో ఇది. దీనిపైనే అభిజీత్ దీప్కే తాజాగా విమర్శలు గుప్పించారు."దేశ భవిష్యత్తు కంటే ప్రధాని మోదీ చర్మం చాలా ప్రకాశవంతంగా ఉంది. మోదీ రాజకీయాలు వదిలేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలని నేను అనుకుంటున్నాను. ఆయన అందులో చాలా బాగా రాణిస్తున్నారు. ఆయన ప్రధానమంత్రి కుర్చీ వదిలి, ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాలి. ప్రధానమంత్రి పనిని వేరొకరికి వదిలేయాలి" అని అభిజీత్ దీప్కే అన్నారు. బుధవారం మహారాష్ట్రలోని తన స్వగ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే "నరేంద్ర మోదీ 3 రోజు క్రితం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో ప్రజలు చాలా సంతోషించారు. కానీ ఏం జరిగింది? సీబీఐ తరఫు న్యాయవాది హాజరు కాకపోవడంతో మొదటి విచారణే వాయిదా పడింది. కాబట్టి మీరు ఎలాంటి చట్టాలనైనా చేయవచ్చు. కానీ వాటిని అమలు చేసే వ్యక్తులు మంచివారు కానంత వరకు ఆ చట్టాల వల్ల ప్రయోజనం ఏమిటి?" అని అభిజీత్ దీప్కే ప్రశ్నించారు. ఇంతకు ముందు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా ప్రధాని మోదీపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. పార్లమెంట్?లో ఆమె మాట్లాడుతూ, "కొత్త యాంగిల్స్ నుంచి వీడియోలు చేయడం ద్వారా మీరు జెన్-జీ మద్దతు పొందలేరు. ప్రధాని తన కెమెరా యాంగిల్?ను కాదు, తన హృదయం యాంగిల్ మార్చుకోవాలి" అని అన్నారు. పదే పదే జరుగుతున్న పేపర్ లీకేజీలపై రాజకీయ పోరు నడుస్తున్న తరుణంలో ఆమె ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## చల్లారని ఉద్రిక్తతలు

తిరుగుముఖం పట్టాయని తెలిపింది. ఈ మేరకు ఇరాన్ అధికార మీడియా ప్రెస్ టీవీ పేర్కొంది.తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు హర్మూజ్ మూసే ఉంటుందని ఈ సందర్భంగా ఐఆర్‌జీసీ స్పష్టం చేసింది. ఇరాన్ నేవీ అనుమతి లేకుండా జలసంధిని దాటేందుకు ప్రయత్నిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించింది. అయితే, నౌకల అడ్డగింతపై అమెరికా సెంట్రల్ కమాండ్‌గానీ, అంతర్జాతీయ షిప్పింగ్ ఏజెన్సీగానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

# అయోధ్య విరాళాల చోరీపై కళ్లకట్టినట్టు నాటకం

న్యూఢిల్లీ,జూలై31(జనంసాక్షి):దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన అయోధ్య రామాలయం విరాళాల చోరీ విషయంలో విపక్షాలు ఆందోళనలను తీవ్రం చేస్తున్నాయి. ఈ నిరసనల్లో భాగంగానే స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ (పప్పు యాదవ్) పార్లమెంట్ ఆవరణలో వినూత్న స్కిట్ ప్రదర్శించారు. సన్యాసి వేషంలో వచ్చిన ఆయన.. పార్లమెంట్ పరిసరాల్లో కూర్చొని విరాళాలు సేకరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు రుచి వీరా (మొరదాబాద్), అవధేశ్ ప్రసాద్ (అయోధ్య) కూడా ఈ స్కిట్‌లో భాగం పంచుకున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అతిథి పాత్రలో కనిపించారు. ఆయన కొంత మొత్తాన్ని హుండీలో వేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ కూడా తమ వంతుగా విరాళాలు ఇచ్చారు. అలా పలువురు ఎంపీలు ఇచ్చిన విరాళాలతో ఆ సన్యాసి ఉడాయిస్తాడు. అది గమనించిన ఎంపీలు అతడిని పట్టుకొన్ని దేహశుద్ధి చేసినట్లు నటిస్తారు. అక్కడితో స్కిట్ ముగుస్తుంది.దీనిపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ.." ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ జరిగింది. దీనిపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లూ నీట్ పేపర్ లీక్ అంశంపై ఉభయసభల్లోనూ ఆందోళనలు రేగడంతో ఈ విషయం చర్చకు రాలేదు. దీనిపై చర్చ చేపట్టాలని నేను కూడా పార్లమెంట్ ప్రారంభమైన రోజు నుంచి నోటీసులు ఇస్తూనే ఉన్నాను. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అందుకే, పప్పు యాదవ్ ఆలోచనతో ఈ స్కిట్ చేశాం" అని అన్నారు. లోక్‌సభలో పప్పు యాదవ్ కాషాయ వస్త్రధారణ అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సభకు ఇలా రావడం సరికాదన్నారు. ఆయన పేరు ప్రస్తావించకుండానే 'సభకు విభిన్న వేషధారణలతో వచ్చే సభ్యులకు..' అంటూ మందలించారు.

### బెదిరింపులతో జెన్‌జీ నోరు మూయించలేరు

పాల్పడుతున్నారని రాహుల్ తెలిపారు. మోదీ, అమిత్ షాలు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా జెన్‌జీ నోళ్లను మూయించలేరని అన్నారు. విద్యార్థులను దేశ భవిష్యత్తుగా, మోదీని గతంగా అభివర్ణించిన రాహుల్ వారితో జాగ్రత్తగా వ్యవహరించాలని కేంద్రానికి సూచించారు.

**మోదీపై ఖర్గే విమర్శలు**

మల్లికార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులపై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారని ఆరోపించారు. బలవంతపు నిర్బంధాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జులై 20న నిర్వహించిన సంసద్ చలో కార్యక్రమంలో భద్రతా బలగాలు లాఠీలు, పెల్లెట్? గన్స్ ఉపయోగించి విద్యార్థులపై దాడి చేశాయని ఆయన ఆరోపించారు. అనంతరం విద్యార్థులు నిరసన విరమించిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటను బీజేపీ ప్రభుత్వాలు నిలబెట్టుకోలేదని విమర్శించారు.

'అమిత్ షాతో రాజీనామా చేయించండి'

యువత సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేస్తున్నారని, మహిళల వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంలో జవాబుదారీతనం వహించాల్సిన హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లోని రాకపోవడం, ప్రకటన చేయకుండా ఉండటం ఆయన అహంకారానికి నిదర్శమని విమర్శించారు. ఇలాంటి చర్యలతో నిజాన్ని దాచలేరని, యువత మీ అసలు స్వరూపాన్ని గుర్తించిందన అన్నారు. మీలో కొంచెమైనా నైతిక బాధ్యత మిగిలి ఉంటే అమిత్ షాతో వెంటనే రాజీనామా చేయించాలని ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి ఖర్గే డిమాండ్ చేశారు.

**సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు కోరిన రాహుల్**

ఇదిలా ఉండగా జులై 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు అతిగా బలప్రయోగం చేశారనే ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర ఉన్నత స్థాయి కమిటీతో దర్యాప్తు జరిపించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరగాలంటే ఈ ఘటనపై నిష్పాక్షిక విచారణ అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేస్తున్నట్లు, జాతీయ జెండా పట్టుకున్న ఓ విద్యార్థిని సివిల్ దుస్తుల్లో ఉన్న వ్యక్తి రోడ్డుపైకి బలంగా నెట్టివేస్తున్నట్లు కనిపించే వీడియోను కూడా రాహుల్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. విద్యార్థులపై జరిగినట్లు ఆరోపిస్తున్న పోలీసు చర్యలకు నిరసనగా, అలాగే అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల వినియోగంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఇండియా కూటమికి చెందిన ఎంపీలు గురువారం పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద నిరసన చేపట్టారు. పలు పార్టీలకు చెందిన ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, జులై 20న జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై బలప్రయోగానికి ఆదేశాలు ఇచ్చింది ఎవరో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగినట్లు ఆరోపిస్తున్న బలప్రయోగంపై జవాబుదారీతనం నిర్ధారించాలని నినాదాలు చేశారు.

## ఒడిశాలో పీజీ ప్రశ్నాపత్రం లీక్..

మెడికల్ కాలేజ్ డీన్ హరేకృష్ణ దలాయ్ పేర్కొన్నారు. ఆయన ఏఎన్ఐతో మాట్లాడుతూ, పరీక్ష ప్రారంభానికి ముందే ప్రశ్న పత్రం బయటకు వచ్చి విద్యార్థులకు చేరితే మాత్రమే పేపర్ లీక్ అనగలమని ఆయన అన్నారు.ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఓయూహెచ్‌ఎస్) నిర్వహించిన మెడికల్ పీజీ పరీక్ష ఫోటో సోషల్ మీడియాలో షేర్ అయినట్లు ఇండియన్స్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రచురించింది.ఎంఎస్/ఎండీ జనరల్ సర్జరీ కోర్స్ 2023-26 బ్యాచ్ పీజీ విద్యార్థుల రెండో ప్రశ్న పత్రం ఫోటోలు కొందరు పీజీ విద్యార్థులు క్రియేట్ చేసిన వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ అయినట్లు ఆరోపణలున్నాయి."పరీక్ష ప్రారంభమైన కొద్దినిమిషాల్లోనే ప్రశ్న పత్రం ఫోటోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమైనట్లు చెబుతున్నారు.పరీక్ష జరుగుతుండగానే ప్రశ్న పత్రం ఫోటోలు సోషల్ మీడియాలో కనిపించడంతో ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఓయూహెచ్‌ఎస్) అంతర్గత విచారణకు ఆదేశించింది" అని పీటీఐ రిపోర్ట్ చేసింది.పరీక్ష జరుగుతున్న సమయంలోనే కొన్ని ఫోన్ నంబర్ల నుంచి కొన్ని ప్రశ్నలకు సమాధానాలు కూడా సర్క్యులేట్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయని అధికారులు పేర్కొన్నట్లు పీటీఐ తెలిపింది.పరీక్ష హాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాన్ని రహస్యంగా తీసుకెళ్లి, ప్రశ్న పత్రం ఫోటోలు తీసి వాట్సాప్‌లో పంపినట్లు అధికారులు అనుమానిస్తున్నట్లు హిందుస్థాన్ టైమ్స్ రాసింది.

## పీవోకేలో పాక్ ఆరాచకాలు

### అక్కడి పౌరులపై దాడులు తీవ్రంగా ఖండించిన భారత్



న్యూఢిల్లీ(జనంసాక్షి):పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని పౌరులపై పాక్ ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని భారత్ మండిపడింది. దీనిని అంతర్జాతీయ సమాజం గమనించి.. పాక్‌ను జవాబుదారీ చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మాట్లాడారు. పీవోకేలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జులై 27 నుంచి జరుగుతున్న సైన్యం దాడుల్లో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దీనిపై జయస్వాల్ తీవ్ర స్థాయిలో స్పందించారు. సామాన్య పౌరుల పట్ల పాక్ సైన్యం నిరంకుశంగా ప్రవర్తిస్తోందని ఆక్షేపించారు. పీవోకేలోని ప్రజలను పాక్ రక్షణశాఖ మంత్రి శత్రువులుగా అభివర్ణించారని, ఆ తర్వాతే వారిపై సైన్యం దాడుల్ని తీవ్రం చేసిందని అన్నారు. మరోవైపు భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ గతంలో ముజాహిదీన్లకు శిక్షణ ఇచ్చి, ఆయుధాలు సమకూర్చిందని జయస్వాల్ అన్నారు. వారే ఇప్పుడు తమ తుపాకులను సొంతం దేశంపై గురిపెట్టారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. హింస పేట్రేగిపోవడంతో అంతర్జాతీయ సంస్థలు స్వతంత్ర దర్యాప్తు చేయాలని అక్కడి ప్రజలే కోరుకుంటున్నారని చెప్పారు. జీవన వ్యయాలు పెరగడం, పరిపాలనపరమైన సమస్యలు, మైనార్టీలపై రాజకీయ వివక్ష తదితర అంశాలకు నిరసనగా గత నెల నుంచి పీవోకేలో ఆందోళనలు మిన్నంటుతున్న సంగతి తెలిసిదే. ది జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) దీనికి నాయకత్వం వహిస్తోంది.

# హైటెక్స్‌లో 'దీప్ మేళా' ప్రారంభం

- ప్రారంభించిన ముఖ్య అతిథి దీపికా రెడ్డి



హైదరాబాద్, జూలై 31 (జనంసాక్షి) : హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని హాల్ నెంబర్ 3లో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న దీప్ మేళా నేడు ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత దీపికా రెడ్డి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీప్‌శిఖ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల మేళా ఆగస్టు 2 వరకు జరుగనుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మహిళా సేవా సంస్థ అయిన దీప్‌శిఖ మహిళా క్లబ్ 62 సంవత్సరాలుగా సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటోంది. మహిళా సాధికారత, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంపై ఈ క్లబ్ ప్రధానంగా దృష్టి సారించింది. 1987 నుండి, ఈ సంస్థ కన్యా గురుకుల్ హైస్కూల్‌ను నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఇందులో సుమారు 1,700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన దీపికా రెడ్డి, దీప్‌శిఖ మహిళా క్లబ్ 60 సంవత్సరాలుగా సమాజ సేవలో చూపిస్తున్న అంకితభావాన్ని ప్రశంసించారు. పేద పిల్లలకు విద్యనందించడం, సమాజాన్ని ఉద్ధరించడంలో వారి కృషిని కొనియాడుతూ, ఇది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఉందని అభిప్రాయపడ్డారు. నూతన అధ్యక్షురాలు సంగీతా జైన్ నాయకత్వంలో క్లబ్ సభ్యులు దీప్ మేళా 2026ను ఘనవిజయవంతం చేసేందుకు ఉత్సాహంగా కృషి చేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా ఏటా నిర్వహిస్తున్న ఈ మేళా, సామాజిక కార్యక్రమాలకు నిధులు సేకరించడంతో పాటు స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించే మూడు రోజుల నిధుల సేకరణ ప్రదర్శనగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా లక్నో, ముంబై, ఢిల్లీ, వారణాసి, జైపూర్, కోల్‌కతా, వడోదర, బెంగళూరు, గుర్గావ్, నాగ్‌పూర్, గుజరాత్, ఇండోర్ వంటి ప్రముఖ కేంద్రాల నుండి సేకరించిన ఉత్పత్తులతో 228కి పైగా స్టాళ్లు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.

# ఉరుస్తున్న కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

- సీఎం ప్రజావాణిలో లబ్ధిదారుల మొర
- హౌసింగ్ సంస్థ ఎండీతో మాట్లాడిన చిన్నారెడ్డి
- సీఎం ప్రజావాణిలో 288 దరఖాస్తులు



హైదరాబాద్ (జనంసాక్షి) : వర్షాలు వస్తుండడంతో కొల్లూరులో గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన నాసిరకం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కురుస్తున్నాయని, ఆ ఇళ్లను మరమ్మతులు చేయించి ఆదుకోవాలని లబ్ధిదారులు సీఎం ప్రజావాణిలో ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డితో మొరపెట్టుకున్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన 243వ సీఎం ప్రజావాణి కార్యక్రమానికి కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు తరలివచ్చారు. చిన్నపాటి వర్షాలకే కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కురుస్తున్నాయని, ఇళ్లన్నీ జలమయమై ఆ ఇళ్లల్లో నివాసం ఉండలేక పోతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంగణంలో మెయింటినెన్స్ కూడా సరిగా లేదని రవాణా సౌకర్యం కూడా లేదని లబ్ధిదారులు చిన్నారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాలు నాసిరకంగా జరగడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతోందని వారన్నారు. వెంటనే స్పందించిన చిన్నారెడ్డి హౌసింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ తో ఫోన్లో మాట్లాడి ఈ సమస్యలను వివరించి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులను కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ప్రాంగణానికి పంపించి ఇళ్లను మరమ్మత్తులు చేయించే ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తామని హౌసింగ్ ఎండి గౌతమ్ తెలిపారు.

243వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 288 ధరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్ – గ్రామీణ అభివృద్ధి శాఖకు 136, రెవెన్యూ శాఖకు 40, మున్సిపల్ శాఖకు 21, ప్రవాసి ప్రజావాణికి 02, ఇతర శాఖలకు 89 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్మెంట్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరంగల్ పోరుబిడ్డ 'పెద్ది'

**తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్**

హైదరాబాద్ (జనంసాక్షి) : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూయడం పట్ల తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారాన్ని వ్యక్తం చేశారు. ఆయన మృతి తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా ఓరుగల్లు పోరాట రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వరంగల్ పోరుబిడ్డగా పేరుగాంచిన పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలంగాణ మలిదశ ఉద్యమంలో వీరోచిత పాత్ర పోషించారని కొనియాడారు. చారిత్రాత్మక తెలంగాణ 'సింహగర్జన' సభకు వేదికను నిర్మించడంలోనూ, ఉద్యమ ఘట్టాలను ముందండి నడిపించడంలోనూ ఆయన చూపిన తెగువ, పోరాట పటిమ ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు. తెలంగాణ సిద్ధించే వరకు వివాహం చేసుకోనని శపథం పూని, ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసిన నిజమైన కర్మయోగి సుదర్శన్ రెడ్డి అని కొనియాడారు. ఏవరంగల్ నేల కన్న వీర పుత్రుడు, ప్రజల మనిషి సుదర్శన్‌రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోవడం తీవ్ర బాధాకరం" అని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, ఆయన అభిమానులకు, నర్సంపేట ప్రజానీకానికి జూలూరు గౌరీశంకర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మాట్లాడుకుందామని పిలిచి దాడి!

- ఐదుగురి నుంచి ప్రాణాలతో తప్పించుకుని పోలీస్ స్టేషన్ కు చేరిన బాధితుడు
- ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స..

కాజీపేట జూలై 31(జనం సాక్షి) : కాజీపేట మండలం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడిపై జరిగిన దాడి స్థానికంగా కలకలం రేపింది. బాధితుడు పల్లపు అశోక్ (తండ్రి: కుమారస్వామి), మడికొండ రొట్టెబండ కాలనీకి చెందిన వ్యక్తి ప్రాథమిక సమాచారం, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, జులై 30 రాత్రి వ్యక్తిగత పని ముగించుకుని తిరిగి వస్తున్న అశోక్‌ను ఎత్తరి జానీ, వల్లెపు సంపత్, వల్లెపు వంశీతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు మాట్లాడాలని పిలిచారు. అనంతరం ముందస్తు ప్రణాళిక ప్రకారం అతడిపై దాడికి పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాడి నుంచి ఎలాగోలా తప్పించుకున్న అశోక్ నేరుగా మడికొండ పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులు అతడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనతో మడికొండ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇటీవల వరంగల్ నగరంలో చోటుచేసుకున్న వరుస దాడుల నేపథ్యంలో మరోసారి ఇలాంటి ఘటన జరగడం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కాగా, రెండు రోజుల క్రితమే స్థానిక సీఐ రౌడీషీటర్లు, పాత నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అయినప్పటికీ ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది . దాడికి గల కారణాలు, బాధితుడు చేసిన ఆరోపణలపై వాస్తవాలు పోలీసు విచారణలో తేలాల్సి ఉంది.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల దక్షిణాఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖ ప్రగాఢ సంతాపం



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణవార్త ఎంతో బాధాకరమని దక్షిణాఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖ తరఫున నాయకుడు నాగరాజు గుర్రాల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజా నాయకుడిగా ఎదిగి, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి గారు నిబద్ధత కలిగిన నాయకుడిగా అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన పేర్కొన్నారు. ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ, సరళత, ఉద్యమస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల ప్రచార సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి గారిని వ్యక్తిగతంగా కలిసి, ఆయనతో కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందని నాగరాజు గుర్రాల గుర్తు చేసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన చూపిన ఆప్యాయత, కార్యకర్తలను ప్రోత్సహించే తీరు, అందరినీ కలుపుకొని ముందుకు సాగే నాయకత్వం తనపై చెరగని ముద్ర వేసిందని పేర్కొన్నారు. అదే ప్రచార సమయంలో దక్షిణాఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖ సభ్యులు శివారెడ్డి, ఉపేందర్ రెడ్డిలు కూడా కొద్ది రోజుల పాటు పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి పనిచేసే అవకాశం పొందారని, ఆయన నాయకత్వా న్ని, కార్యకర్తల పట్ల ఉన్న ప్రేమాభిమా నాలను దగ్గర నుంచి చూసే అదృష్టం వారికి దక్కిందని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తెలంగాణ రాజకీయాలకు, బీఆర్ ఎస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని పేర్కొ న్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని నాగరాజు గుర్రాల ప్రార్థించారు.

# త్రివేణి సంగమానికి జలకళ

- గోదావరి, ప్రాణహిత పరవళ్లు
- ప్రమాద హెచ్చరికకు చేరువలో నీటి మట్టం



కాళేశ్వరం, జూలై 31 (జనంసాక్షి) : తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద వరద ప్రవాహం భారీగా పెరుగుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం సంగమం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నది. తెలంగాణ, మహారాష్ట్రలలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద జలకళ సంతరించుకొని గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ప్రాణహిత, గోదావరి నడుమ వరద ప్రవాహం భారీగా పెరిగి, నీటిమట్టం క్రమంగా గరిష్ట స్థాయికి చేరుకుంటోంది. మహారాష్ట్ర, తెలంగాణ ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద వస్తోంది. కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం 11 లక్షల క్యూసెక్కులకు చేరింది. నదుల ఉధృతితో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. కాళేశ్వర గ్రామ పంచాయతీ పరిధిలో పూసుకుపల్లి ప్రాంతం లో దాదాపు ఐదు ఎకరాల పత్తి నీట మునిగినట్లు స్థానిక రైతులు తెలిపారు. స్థానిక వ్యవసాయ అధికారిని ఈ విషయంపై ఫోన్లో సంప్రదించగా శనివారం ఉదయం ఆయా ప్రాంతాలను సందర్శించి పంట నష్టాన్ని అంచనావేసి అధికారులకు నివేదిస్తామని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గోదావరి నీటి మట్టం 12.5 మీటర్లుగా నమోదైనట్లు కాళేశ్వరం వద్ద గల సెంట్రల్ వాటర్ కమిషన్ కేంద్రం తెలిపింది. కాళేశ్వరం వద్ద హెచ్చరిక స్థాయి 12.210 మీటర్లు, ప్రమాద స్థాయి 13.460 మీటర్లుగా ఉండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. స్థానిక పోలీస్ సిబ్బంది గోదావరిలోకి ఎవరు వెళ్లకుండా ప్రత్యేకంగా కాపలా ఉంటున్నారు. నది తీరంలోని స్థానిక చిరు వ్యాపారులను ఖాళీ చేయాల్సిందిగా పోలీసులు సూచించారు. పుష్కరాల సమయంలో భక్తులు దుస్తులు మార్చుకునే విధంగా రేకు డబ్బాలను ఏర్పాటు చేయగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరద నీటిలోనే మునిగిపోయాయి. వరద నీటికి అవి ఉంటాయా కొట్టుకుపోతాయా అని స్థానికులు భావిస్తున్నారు. ఎల్లంపల్లి, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో కాళేశ్వరం వద్ద గోదావరి నదికి వరద పోటెత్తింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరి మహోగ్ర రూపం దాల్చింది. గోదావరి నదిపై నిర్మించిన ప్రాజెక్టులలో భారీగా వరదనీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఇదే పరిస్థితి రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో నెలకొంది. గోదావరి పరివాహక ప్రాంతాలు వరద నీటిలోకి జారుకుంటున్నాయి. అధికారులు ఆ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రాజెక్టుల వద్దకు ప్రజలు ఎవరూ వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సరస్వతి, సాధారణ పుష్కర ఘాట్ల మెట్లపై నుంచి వరద ప్రవహిస్తోంది. సరస్వతి పుష్కర ఘాటు వద్ద పుష్కర సమయంలో ఏర్పాటు చేసిన తాళపత్ర ,దీప నిర్మాణాలు వరద నీటిలో మునిగాయి. పుష్కర ఘాట్లపై గోదావరి, ప్రాణహిత నదులు పరవళ్లు తొక్కుతున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి వరద పెరిగింది. భారీ వర్షాలతో గోదావరికి ఎగువ నుంచి ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి 11 లక్షల క్యూసెక్కుల మేర ప్రవాహం వస్తుండటంతో 85 గేట్లు ఎత్తి దిగువకు అంతే మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం వరకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి వచ్చే వరదనీరు తగ్గడంతో కాళేశ్వరం వద్ద కూడా నీటిమట్టం స్వల్పంగా తగ్గుతుంది. శుక్రవారం సాయంత్రం వరకు నీటిమట్టం 12.12 మీటర్లుగా నమోదైనట్టు స్థానిక సి డబ్ల్యూ సి సిబ్బంది తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఒక వైపు చిరు జల్లు మరో వైపు ఆకాశంలో ఇంద్రధనుస్సు చూపరులను ఆకట్టుకుంది.

## ఉధృతంగా ప్రవహిస్తున్న మేడిగడ్డ గోదావరి



మహదేవపూర్, జూలై 31(జనంసాక్షి): ఎడతెరిపి లేకుండా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలవల్ల కాళేశ్వరం ప్రణాహిత త్రివేణి సంగమ గోదావరి నది నిండుకుండలా ప్రవహిస్తుంది. మేడిగడ్డ బ్యారేజీ లో భారీగా వరదనీరు చేరింది. శుక్రవారం సాయంత్రం 6-00 గంటల సమయానికి 10, 62,2 40 క్యూసెక్కుల నీరు నమోదు కావడంతో ప్రస్తుతం బ్యారేజీ గేట్లను ఎత్తి వచ్చిన వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నీటిమట్టం 97,70 మీటర్లు. పూర్తి నీటి సామ్యార్థం 100 మీటర్లు. రోజు రోజు గోదావరి ఉధృతి పెరుగుతుండడంతో నీటి పారుదల శాఖ అధికారులు స్థానిక యంత్రాంగం అప్రమత్తమయ్యారు. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలుగాని పశువుల, గొర్రెల కాపారులు. రైతులు. అప్రమత్తంగా ఉండాలని ప్రవాహంలోకి వెళ్లకూడదని అధికారు హెచ్చరిక జారీచేశారు.

# పంచాయతీ భవనంలోకి బడి పిల్లలు


- 'జనంసాక్షి' కథనంతో కదిలిన అధికార యంత్రాంగం
- మూడు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు




రంగారెడ్డి బ్యూరో (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లాలాపేట ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొని పాఠశాల తరగతి గదిలోకి వర్షపు నీరు వస్తుండడంతో గమనించిన ఉపాధ్యాయులు పాఠశాల భవనం పై ప్లాస్టిక్ కవర్ కప్పి కొనసాగిస్తున్న వైనాన్ని జనంసాక్షి అధికారులతో, పాటు ప్రజలకు, కళ్ళకు కట్టినట్టు చూపించింది జనంసాక్షి కథనాలతో స్పందించిన విద్యాశాఖ అధికారులు, డైరెక్ట ర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, (ఐఏఎస్) రంగారెడ్డి జిల్లా డీఈవో వెంక టేశ్వర్లు, పాఠ శాల తరగతి గదులు నిర్మిం చేందుకు పంచాయతీ రాజ్ ఏఈ తో పాటు మండల విద్యాధి కారులను ఆదేశించారు ఎన్ని తరగతి గదులు అవసరమో ఎంత బడ్జెట్ అవుతుందో రిపోర్టు పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూడు తరగతి గదుల నిర్మాణానికి విద్యాశాఖకు ఏఈ ఎస్టిమేషన్ పంపారు.

**పంచాయతీ భవనంలోకి విద్యార్థులు**

వర్షాకాలం కావడంతో విద్యార్థులు ప్రమాదల బారిన పడకుండా నూతన భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు గ్రామపంచాయతీలో విద్యార్థులకు విద్యను బోధించాలని ఆదేశించడంతో గ్రామపంచాయతీలోకి వెళ్లిన విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు...





# తహాఫుజ్ ఖత్మే నబువ్వత్‌ను సమాజంలో బలోపేతం చేయండి

- ఇస్లాం ముసుగులో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండండి
- ఖాధియాని, షకిలియత్ వర్గాల బారిన పడి మోసపోకండి..
- గ్రామీణ ప్రాంత ముస్లింల ఈమాన్ విశ్వాసాన్ని కాపాడే యజ్ఞంలో బాగస్వామ్యులు కండి
- ముస్లిం సమాజానికి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపు



కరీంనగర్, జూలై 31 (జనంసాక్షి) : ప్రస్తుత పరిస్థితుల్లో ఖాధియాని, షకిలియత్ వర్గాల నుంచి ముస్లిం సమాజాన్ని మేలుకొలుపి, వారి బారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఉమ్మతే మహమ్మదీయా (మహమ్మద్ ప్రవక్త సల్లం అనుచరులపై) ఉందని మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో కశ్మీర్ గడ్డ మస్జిదే జంజంలో నిర్వహించిన ఇస్ దౌర్ మే బాతిల్ ఫిత్నోసే అప్నే ఈమాన్ కో కైసే బచాయే అనే అంశంపై నిర్వహించిన జల్సా ఆధ్యాత్మిక సదస్సు పెద్దఎత్తున విజయవంతం అయింది. ఈసందర్భంగా మౌలానా అర్షద్ అలీ ఖాస్మి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తను చిట్ట చివరి ప్రవక్తగా అంగీకరించకుంటే ముస్లిం కాలేడని, విశ్వాసం ఈమాన్ నుండి బహిష్కృతులు అవుతారని చెప్పారు. ఇజ్రాయిల్, ఆంగ్లేయుల కనుసన్నల్లో భారత దేశంలో ఖాధియాని వర్గం పేరిట, షకిల్ వర్గం పేరిట కార్యకలాపాలను కొనసాగిస్తూ, ముస్లింల ముసుగులో, వేషధారణలతో అమాయక ముస్లింలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముస్లిం యువత ఇస్లాం గురించి పూర్తి స్థాయిలో తెలియకుండా ఖాధియాని, షకిలియత్ వర్గాలు ముస్లిం గురువులు, పండితులని నమ్మి, వారిబారిన పడి, ఇస్లాం, ఈమాన్ నుండి తమంతట తాము బహిష్కృతులు అవుతున్నారని, ఇంత పెద్ద ఘటన ఇది వీరికి తెలియకుండానే జరిగిపోతుందన్నారు. ఖాధియాని, షకిలియత్ వర్గాలను స్వీకరించి, వారు చెప్పిన బాటలో నడుస్తూ జీవితం గడిపి, ఒకవేళ మరణిస్తే కాఫిర్ గానే పరిగణించబడుతారని, ఖయామత్ ప్రళయదినం రోజు లేపబడుతారని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ముస్లింలను చేరదీసి, వారి ఈమాన్ విశ్వసాన్ని కాపాడేందుకు మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు చేస్తున్న ఈ బృహత్తర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ తమ విధిగా, బాధ్యతతో పాలుపంచుకొని, తోడ్పాటునందించాలని కోరారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అలుపెరుగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింల, ఈమాన్, విశ్వసాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని అభినందించారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ కు కరీంనగర్ నగర ముస్లిం సమాజం అండగా నిలబడి, మజ్లీస్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు లో తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి, అమాయక గ్రామీణ ముస్లింలను ఇస్లాం నుండి మరలిపోకుండా కాపాడే యజ్ఞంలో మహమ్మద్ ప్రవక్త అనుచరులుగా మనసా, వాచా, ఖర్మనా సేవలు అందించాలని పిలుపు నిచ్చారు. ఈసదస్సుకు ఉమ్మడి జిల్లా నుండి, నగర ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో హాఫీజ్ వసిముద్దీన్, ఖత్మే నబువ్వత్ కరీంనగర్ సేవకులు హాఫిజ్ అహ్మద్ హిఫ్జి, కలిమ్ షరీఫ్, హాఫిజ్ అబ్దుల్ రాఫె, హాఫిజ్ తౌహీద్, హాఫీజ్ ఇమ్రాన్ బేగ్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
1 ఆగస్టు 2026

# "లీకైన" నమ్మకం!

సంపాదకీయం

ప్రశ్నపత్రాల లీకేజీలపై ఉక్కుపాదం మోపుతామని కేంద్రం ఘనంగా ప్రకటించింది. పార్లమెంట్ కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. కఠిన శిక్షలు, బెయిల్‌కు అవకాశం లేని నేరం, భారీ జరిమానాలు అంటూ గొప్పగా ప్రచారం జరిగింది. కానీ ఆ చట్టం సిరా ఇంకా ఆరకముందే ఒడిశాలో మెడికల్ పీజీ థియరీ పరీక్ష ప్రశ్నపత్రం సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ఇది యాదృచ్ఛికమా? లేక చట్టాలకంటే లీకేజీ మాఫియా ఒక అడుగు ముందే ఉందనే చేదు నిజమా?

ఒకవైపు చట్టసభలో "లీకేజీలకు చెక్" అంటూ చప్పట్లు కొడుతుంటే, మరోవైపు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రశ్నపత్రం వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడం దేశ పరీక్షా వ్యవస్థపై చెంపపెట్టులాంటిది. చట్టం చేయడం సులభం. కానీ చట్టాన్ని అమలు చేసే సంకల్పం ఉందా? అన్నదే అసలు ప్రశ్న.

నీట్ నుంచి రాష్ట్ర స్థాయి ఉద్యోగ పరీక్షల వరకు, మెడికల్ పీజీ నుంచి ఇతర పోటీ పరీక్షల వరకు లీకేజీలు వరుసగా జరుగుతూనే ఉన్నాయి. ప్రతిసారీ ప్రభుత్వం "కఠిన చర్యలు" అంటుంది. దర్యాప్తు కమిటీలు వస్తాయి. కొందరు అరెస్టవుతారు. కొంతకాలానికి విషయం చల్లారిపోతుంది. కానీ లీకేజీ రాకెట్లు మాత్రం యథావిధిగా కొనసాగుతూనే ఉంటాయి. శిక్షల భయం లేకపోతే కొత్త చట్టం కూడా పాత కథగానే మిగిలిపోతుంది.

ప్రశ్నపత్రం ఎలా బయటకు వచ్చింది? ఎక్కడ భద్రత విఫలమైంది? ఎవరు లీక్ చేశారు? వెనుక ఎవరు ఉన్నారు? ఈ ప్రశ్నలకు వేగంగా, పారదర్శకంగా సమాధానం చెప్పగలిగితేనే కొత్త చట్టానికి విలువ ఉంటుంది. లేకపోతే ఇది కూడా మరో ప్రకటనగానే చరిత్రలో మిగిలిపోతుంది.

ప్రశ్నపత్రాల తయారీ నుంచి ముద్రణ, రవాణా, పరీక్షా కేంద్రాల వరకు ప్రతి దశలో డిజిటల్ భద్రత, ఎన్‌క్రిప్షన్, రియల్‌టైమ్ ట్రాకింగ్, బాధ్యులపై తక్షణ చర్యలు తప్పనిసరి. రాజకీయ పలుకుబడి, అధికార అండ, డబ్బు ప్రభావం ముందు చట్టం చేతులెత్తేస్తే, ఎంత కఠినమైన చట్టమైనా కాగితంపైనే పరిమితమవుతుంది.

విద్యార్థులు చట్టాల ప్రకటనలు కోరుకోవడం లేదు. తమ శ్రమకు న్యాయం కావాలని కోరుకుంటున్నారు. తల్లిదండ్రులు హామీలు కాదు, భరోసా కోరుతున్నారు. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడలేని ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా ప్రజల నమ్మకాన్ని తిరిగి సంపాదించలేదు.

ఒడిశా మెడికల్ పీజీ ప్రశ్నపత్రం లీకేజీ కొత్త చట్టానికి తొలి అగ్నిపరీక్ష. ఈ కేసులో ప్రభుత్వం ఎంత వేగంగా, ఎంత కఠినంగా, ఎంత పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నదే ఆ చట్టానికి నిజమైన పరీక్ష. అప్పుడు మాత్రమే అది పళ్లు ఉన్న పులి అని ప్రజలు నమ్ముతారు. లేదంటే మరోసారి నిరూపితమయ్యేది ఒక్కటే – చట్టాలు కఠినమవుతున్నాయి... కానీ లీకేజీ మాఫియా ఇంకా కఠినంగా నవ్వుతోంది.

# భారతీయ విద్యా వ్యవస్థపై ఆర్ఎస్ఎస్ ప్రభావం

విద్యార్థులకు ఒకే కథనం కాకుండా విభిన్న దృక్పథాలను పరిచయం చేయడం ఆధునిక విద్య యొక్క లక్ష్యం. భారత చరిత్రలో వేద సంస్కృతి ఎంత ముఖ్యమో, బౌద్ధం, జైనం, భక్తి ఉద్యమం, సిక్కు సంప్రదాయం, రాజ్యాంగ నిర్మాతల ఆలోచనలు, స్వాతంత్ర్యోద్యమంలోని భిన్న సిద్ధాంతాలు కూడా అంతే ముఖ్యమైనవి. విద్యా వ్యవస్థ ఈ వైవిధ్యాన్ని ప్రతిబింబించినప్పుడే ప్రజాస్వామ్య భారతదేశ ఆత్మ నిలుస్తుంది.

ముగింపుగా చెప్పాలంటే, భారతీయ విద్యా వ్యవస్థను ఆర్ఎస్ఎస్ పూర్తిగా "శాసిస్తోంది" అని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. అదే సమయంలో విద్యా విధానాలు, సాంస్కృతిక చర్చలు, కొన్ని విద్యా సంస్థలు, పాఠ్యాంశాల రూపకల్పన వంటి రంగాల్లో ఆర్ఎస్ఎస్ భావజాలానికి కొంతమేర ప్రభావం ఉందని రాజకీయ విశ్లేషకులు, విద్యావేత్తలు చర్చిస్తున్నారు. అయితే ఆ ప్రభావం పరిమాణం ప్రాంతాన్ని బట్టి, ప్రభుత్వాన్ని బట్టి, విద్యాసంస్థను బట్టి మారుతుంది. కాబట్టి ఈ అంశాన్ని భావోద్వేగాలతో కాకుండా పరిశోధనలు, రాజ్యాంగ విలువలు, విద్యా నాణ్యత, శాస్త్రీయ ఆధారాల వెలుగులో పరిశీలించడం సమాజానికి, విద్యార్థులకు, దేశ భవిష్యత్తుకు మరింత ప్రయోజనకరమైన మార్గం.

భారతీయ విద్యా వ్యవస్థపై ఆర్ఎస్ఎస్ ప్రభావం గురించి చర్చించేటప్పుడు ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తుంచుకోవాలి. విద్యా విధానం అనేది కేవలం పాఠ్యపుస్తకాల మార్పులతోనే నిర్ణయించబడదు. ఉపాధ్యాయ శిక్షణ, పాఠ్యాంశాల రూపకల్పన, పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి, విద్యార్థుల ఆలోచనా స్వేచ్ఛ, ప్రభుత్వ నిధుల కేటాయింపు, నియంత్రణ సంస్థల పాత్ర వంటి అనేక అంశాల సమ్మిళిత ఫలితమే విద్యా వ్యవస్థ. అందువల్ల ఆర్ఎస్ఎస్ ప్రభావాన్ని అంచనా వేయాలంటే ఈ అన్ని కోణాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశ విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసిన ప్రధాన సూత్రాలు రాజ్యాంగ విలువలే. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, శాస్త్రీయ దృక్పథం, సమాన అవకాశాలు విద్యా వ్యవస్థకు పునాదులుగా నిలిచాయి. అయితే కాలక్రమేణా వివిధ ప్రభుత్వాలు తమ తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా విద్యా విధానాల్లో మార్పులు చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలో కూడా విద్యా విధానాలు మారాయి. జనతా ప్రభుత్వాలు వచ్చినప్పుడు కూడా మార్పులు జరిగాయి. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న కాలంలో కూడా విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలులోకి వచ్చాయి. అందువల్ల విద్యా విధానాలపై రాజకీయ ప్రభావం కొత్త విషయం కాదు. కానీ ఆ ప్రభావం ఏ దిశగా సాగుతోంది అనే అంశమే అసలు చర్చ.

ఆర్ఎస్ఎస్ చాలా కాలంగా భారతీయ విద్య "భారతీయ మూలాలపై ఆధారపడాలి" అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వస్తోంది. విదేశీ పాలన కాలంలో రూపొందిన విద్యా వ్యవస్థ భారతీయ చరిత్ర,



సంస్కృతి, సంప్రదాయ విజ్ఞానాన్ని తక్కువ చేసి చూపిందని ఆ సంస్థ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో భారతీయ తత్వశాస్త్రం, వేద గణితం, ఆయుర్వేదం, యోగ, సంస్కృతం, భారతీయ శాస్త్రవేత్తల కృషి, స్థానిక జ్ఞాన వ్యవస్థలను పాఠ్యాంశాల్లో మరింత బలంగా చేర్చాలని ఆ సంస్థకు అనుబంధ మేధావులు సూచిస్తున్నారు.

మరోవైపు అనేక మంది విద్యావేత్తలు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు ఒక కీలక హెచ్చరిక చేస్తున్నారు. భారతీయ వారసత్వాన్ని బోధించడం అభ్యంతరకరం కాదని, కానీ చరిత్రను ఒకే కోణంలో చూపడం ప్రమాదకరమని వారు పేర్కొంటున్నారు. చరిత్ర అనేది అనేక ఆధారాలు, విభిన్న అభిప్రాయాలు, పురావస్తు పరిశోధనలు, శాసనాలు, సాహిత్య ఆధారాలపై ఆధారపడుతుందని వారు గుర్తుచేస్తున్నారు. విద్యార్థులకు ఒకే భావజాలాన్ని కాకుండా విభిన్న దృక్కోణాలను పరిచయం చేయడం విద్య యొక్క ప్రధాన లక్ష్యమని వారు నొక్కి చెబుతున్నారు.

ఇటీవలి సంవత్సరాల్లో పాఠ్యపుస్తకాలలో జరిగిన కొన్ని మార్పులు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. కొన్ని అధ్యాయాలు తొలగించబడ్డాయి. కొన్ని కొత్త అంశాలు చేర్చబడ్డాయి. ప్రాచీన భారతదేశ విజ్ఞాన సంపదకు సంబంధించిన వివరాలు విస్తరించబడ్డాయి. మొఘల్ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమంలోని కొన్ని భాగాలు, సామాజిక ఉద్యమాలకు సంబంధించిన అంశాల్లో మార్పులు జరిగినట్లు విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం మాత్రం విద్యార్థులపై పాఠ్యభారం తగ్గించడం, సమకాలీన అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను సరళీకరించడం లక్ష్యమని వివరణ ఇచ్చింది. ఈ రెండు వాదనల మధ్య నిజానిజాలను విశ్లేషించడం పరిశోధకుల బాధ్యతగా మారింది.

జాతీయ విద్యా విధానం–2020 కూడా ఇదే చర్చలో ప్రధాన పాత్ర పోషించింది. ఈ విధానంలో మాతృభాషలో బోధన, నైపుణ్యాభివృద్ధి, బహుళశాఖల విద్య, పరిశోధన ప్రోత్సాహం, భారతీయ జ్ఞాన సంపదకు ప్రాధాన్యం వంటి అంశాలు ఉన్నాయి. ఈ విధానాన్ని సమర్థించే వారు ఇది 21వ శతాబ్దపు భారత అవసరాలకు అనుగుణంగా రూపొందించబడిందని అంటున్నారు. విమర్శించే వారు మాత్రం భారతీయ జ్ఞాన సంపద పేరిట ఒక నిర్దిష్ట సాంస్కృతిక భావజాలానికి అధిక ప్రాధాన్యం లభించే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

కేజీ నుంచి పీజీ వరకు ఈ ప్రభావం ఒకే విధంగా ఉండదు. ప్రాథమిక స్థాయిలో దేశభక్తి గీతాలు, యోగా, నైతిక విలువలు, భారతీయ సంస్కృతి వంటి అంశాలు ఎక్కువగా కనిపిస్తాయి. మాధ్యమిక స్థాయిలో చరిత్ర, సామాజిక శాస్త్రం, సంస్కృతి, పౌరశాస్త్రం వంటి విషయాల్లో మార్పులు చర్చకు వస్తాయి. విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన అంశాలు, అధ్యాపకుల నియామకాలు, అకాడమిక్ స్వేచ్ఛ, పాఠ్య ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలపై చర్చ మరింత తీవ్రంగా ఉంటుంది.

భారతదేశంలో ఉన్నత విద్యను నియంత్రించే వ్యవస్థ కూడా విస్తృతమైనది. కేంద్ర విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, సాంకేతిక విద్యా సంస్థలు, వైద్య విద్యా సంస్థలు, న్యాయ విద్యా సంస్థలు – ప్రతి రంగానికి వేర్వేరు నియంత్రణ వ్యవస్థలు ఉన్నాయి. కాబట్టి మొత్తం ఉన్నత విద్య ఒకే భావజాలానికి పూర్తిగా లోబడి ఉందని చెప్పడం పరిశోధనా ప్రమాణాలకు అనుగుణంగా ఉండదు. అయితే నియామకాలు, విధాన నిర్ణయాలు, నిధుల కేటాయింపు వంటి అంశాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వ ప్రభావం సహజంగానే కనిపిస్తుందని విద్యా విశ్లేషకులు పేర్కొంటున్నారు. విద్యా రంగంలో అత్యంత ప్రాధాన్యమైన అంశం విమర్శనాత్మక ఆలోచన. విద్యార్థి ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించకపోతే ఏ విద్యా విధానమైనా అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. ఒక సిద్ధాంతాన్ని మాత్రమే బోధించి మిగతా అభిప్రాయాలను నిర్లక్ష్యం చేస్తే విద్య పరిశోధనా స్వభావాన్ని కోల్పోతుంది. అదే సమయంలో దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వంపై గౌరవాన్ని పెంపొందించడమూ విద్యలో భాగమే. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యతను కాపాడడం ప్రతి ప్రజాస్వామ్య దేశం ముందున్న అతిపెద్ద సవాలు. అందువల్ల భారతీయ విద్యా వ్యవస్థపై ఆర్ఎస్ఎస్ ప్రభావాన్ని అంచనా వేయాలంటే రాజకీయ నినాదాల ఆధారంగా కాకుండా విద్యా పరిశోధనలు, విధాన పత్రాలు, రాజ్యాంగ విలువలు, విద్యార్థుల అభ్యాస ఫలితాలు, స్వతంత్ర అధ్యయనాల ఆధారంగా పరిశీలించడం అవసరం. ఈ చర్చలో అనుకూల వాదనలకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో, విమర్శలకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వడం శాస్త్రీయ దృక్పథానికి అనుగుణమైన మార్గం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# జవాబుదారీతనం కోసం జంగ్ చేసిన బొద్దింకలకు జేజేలు

ఒక ప్రజాస్వామ్య దేశంలో యువత వీధుల్లోకి రావడం సాధారణ రాజకీయ పరిణామం కాదు. అది వ్యవస్థపై విశ్వాసం దెబ్బతిన్నప్పుడు, తమ సమస్యలకు పరిష్కారం లభించడం లేదనే భావన బలపడినప్పుడు ఉద్భవించే సామాజిక ప్రతిస్పందన. ఇటీవలి కాలంలో పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరుద్యోగ సమస్య, విద్యార్థి ఉద్యమాలు, వాటిపై ప్రభుత్వాల స్పందన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ పరిణామాలు విద్యా వ్యవస్థ, న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య హక్కులు, ప్రభుత్వాల జవాబుదారీతనంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. కోట్లాది మంది యువత సంవత్సరాల తరబడి కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు. అలాంటి పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వచ్చిన ప్రతిసారి వారి శ్రమ, ఆశలు, కుటుంబాల ఆర్థిక త్యాగాలు ఒక్కసారిగా ప్రశ్నార్థకమవుతాయి. ఇలాంటి ఘటనలపై వేగవంతమైన, పారదర్శకమైన విచారణలు జరగకపోతే ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుంది. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు. విద్యార్థులు, కార్మికులు, రైతులు లేదా ఇతర వర్గాలు తమ సమస్యలను శాంతియుతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యమాలు నిర్వహించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే. అదే సమయంలో శాంతిభద్రతలు కాపాడడం ప్రభుత్వ బాధ్యత. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యతను పాటించడం అత్యంత కీలకం. నిరసనలు హింసాత్మకంగా మారకూడదు; అలాగే వాటిని అణచివేసే చర్యలు కూడా చట్టబద్ధత, మానవ హక్కుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలి. ఇటీవలి విద్యార్థి నిరసనల సందర్భంగా పోలీసు చర్యలపై, బలప్రయోగంపై, అలాగే నిరసనకారుల ప్రవర్తనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ ఆరోపణలన్నింటినీ స్వతంత్రంగా, నిష్పాక్షికంగా పరిశీలించడం అవసరం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం మాత్రమే కాదు, నిరసనకారులు కూడా చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అదే సమయంలో అధికార యంత్రాంగం కూడా రాజ్యాంగబద్ధమైన హద్దుల్లోనే వ్యవహరించాలి. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. ప్రజలలో సందేహాలు తలెత్తకుండా పారదర్శకత, వేగవంతమైన న్యాయ ప్రక్రియలు మరింత బలోపేతం కావాలి. నిరుద్యోగం, పరీక్షల నిర్వహణలో లోపాలు, నియామకాల ఆలస్యం వంటి అంశాలు యువతలో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఒక ఉద్యోగం కోసం సంవత్సరాల పాటు సిద్ధమయ్యే అభ్యర్థి పరీక్ష రద్దు కావడం లేదా లీకేజీల కారణంగా అవకాశాలు కోల్పోవడం తీవ్రమైన మానసిక, ఆర్థిక ప్రభావాన్ని కలిగిస్తుంది. అందుకే పరీక్షల నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు, శాశ్వత నైపుణ్యం కలిగిన సిబ్బంది, బాధ్యతాయుతమైన పర్యవేక్షణ అవసరం. ప్రభుత్వాలు ఉద్యమాలను కేవలం శాంతిభద్రతల సమస్యగా కాకుండా, వాటి వెనుక ఉన్న అసలు కారణాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. అదే విధంగా ఉద్యమాలు కూడా ప్రజాస్వామ్య పరిమితుల్లోనే కొనసాగాలి. సంభాషణ, చర్చ, రాజ్యాంగబద్ధ పరిష్కారాలే ప్రజాస్వామ్యానికి బలం. అణచివేత గానీ, హింస గానీ దీర్ఘకాలిక పరిష్కారాన్ని ఇవ్వలేవు. విద్యార్థుల ఆకాంక్షలు దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంటాయి. వారి విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. పారదర్శక పరీక్షల నిర్వహణ, వేగవంతమైన నియామకా లు, అవినీతిపై కఠిన చర్యలు, నిరసనలకు ప్రజాస్వామ్యబద్ధ స్పందన–ఇవే యువతలో నమ్మకాన్ని పునరుద్ధరించే మార్గాలు. చివరికి, ప్రజాస్వామ్యం అనేది ఎన్నికలతో మాత్రమే పరిమితం కాదు. ప్రజల ప్రశ్నలను వినడం, విమర్శలను స్వీకరించడం, సమస్యలకు చట్టబద్ధ పరిష్కారాలు చూపడం, రాజ్యాంగ విలువలను కాపాడడం ద్వారా మాత్రమే అది సజీవంగా ఉంటుంది. యువత ఆశలను గౌరవించే, ప్రజాస్వామ్య సంభాషణను బలోపేతం చేసే పాలననే దేశ భవిష్యత్తుకు నిజమైన బలంగా చెప్పవచ్చు.

ఎన్. నారాయణ రావు,
ప్రధాన కార్యదర్శి, పౌర హక్కుల సంఘం.

# మంచి సినిమాల దిక్సూచి 'సినీ ప్రపంచంలో ఆమె'

*మహాశ్వేతాదేవి జన్మించి వంద సంవత్సరాలు పూర్తయ్యాయి. మరణించి దశాబ్దం కావచ్చు. మహాశ్వేతాదేవి జననం 14. 1. 1916, మరణం 28. 7. 2016*

ప్రజా సమూహాల గురించి, ఆదివాసీల గురించి, వారి మీద అత్యాచారాలు గురించి, వారి న్యాయం కోసం మాట్లాడిన, రచనలు చేసిన అతి కొద్ది మందిలో ఆమె ఒకరు. ఆమె స్మృతిలో ఇటీవల మాతృక ప్రచురించిన బాలాజీగారి రచన 'సినీ ప్రపంచంలో ఆమె' మంచి ప్రయత్నం. సినిమాలను ప్రజల కోణంలో, మహిళల కోణంలో, ప్రజా సంక్షేమం దృష్టి కోణంలో విశ్లేషించి సమీక్షలు గత కొన్ని సంవత్సరాలుగా ఆయన కలం నుండి వెలువడుతూ వివిధ పత్రికల్లో కనిపిస్తున్నాయి.

అక్కడక్కడా తారసపడుతున్న ఆ రచనల్లో కొన్ని సమీక్షల్లో మహిళలకు సంబంధించిన సినిమాల సమీక్షలను ఒక పుస్తకం రూపంలో ప్రజల ముందు, పాఠకుల ముందు ఉంచే ప్రయత్నం అరుదైన ప్రయత్నం. మంచి సినిమాల మీద పుస్తకాలు కూడా చాలా తక్కువగానే ఉన్నాయి. మంచి సినిమాలను సృష్టించడం లోనూ, వాటిని ఆస్వాదించడంలోనూ మెజారిటీ భారతీయులు వెనకే ఉన్నారు. అందులోనూ, తెలుగు రాష్ట్రాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రజలకు ఎందుకూ పనికిరాని, ఏ విలువలూ లేని చవకబారు సినిమాలు వినోదం పేరుతో తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతుండడం మనకు తెలుసు. సినిమా ప్రపంచంలో అత్యంత దయనీయమైన పరిస్థితి ఇది. అక్కడక్కడా మంచి దర్శకులు చిన్నచిన్న ప్రయత్నాలు చేస్తున్నా సరే, వాటిని కూడా ఆదరించే ప్రేక్షకులు ఇంకా తక్కువే. ఇలాంటి విషమ పరిస్థితిలో 'సినీ ప్రపంచంలో ఆమె' అనే టైటిల్ తో వొచ్చిన ఈ పుస్తకంలో ఎన్నో మంచి సినిమాలను ఒక దగ్గర పూసలు మాలలా గుచ్చి అందించే ప్రయత్నం జరిగింది. మహిళలకు సంబంధించిన మహిళల సమస్యలపై చర్చించిన సినిమాలే ఇందులో ఉండడం విశేషం.

మహాశ్వేతాదేవి వర్ధంతి జులై 28న ఉంది. ఈ సందర్భంలో ఆమె సాహితీ ప్రపంచానికీ, పరోక్షంగా సినిమా ప్రపంచానికీ అందించిన సేవ ఉన్నతమైనది. పుస్తకం ఆరంభంలోనే మహాశ్వేతా దేవికి సంబంధించి రెండు విలువైన వ్యాసాలు ఉన్నాయి. 'మహాశ్వేతాదేవిని పరిచయం చేసే సినిమాలు', 'మహాశ్వేతా దేవి రచనల ఆధారంగా వచ్చిన సినిమాలు' అనే రెండు వ్యాసాలు మహాశ్వేతాదేవి గురించి విస్తృతంగా చర్చిస్తాయి. అలానే మొత్తం తెలుగు సినిమాల సారాంశాన్ని స్త్రీ పురుష సంబంధాల కోణంలో విశ్లేషించిన మరో మంచి వ్యాసం ఈ పుస్తకంలో కనిపిస్తుంది. 'తెలుగు సినిమా స్త్రీపురుష సంబంధాలు' అనే వ్యాసం తెలుగు సినిమాని స్త్రీ పురుష సంబంధాల కోణంలో తెర వెనుకా, తెరమీదా కనిపించే జీవిత వాస్తవాలని చిత్రించింది. విశ్లేషించింది. దశాబ్దాలుగా తెలుగు సినిమా పురుషస్వామ్య విలువలతో స్త్రీలను సెకండరీ పాత్రలుగానే చూపించింది. తెలుగు సినిమాలను చూసిన ఎవరికైనా ఈ విషయం తెలిసే ఉంటుంది. పురుషుడు ఎప్పుడూ కూడా ప్రధాన పాత్రలో కనిపిస్తాడు. హీరో సమస్యలను పరిష్కరించడంలోనూ, అన్యాయాల ను ఎదిరించడంలోనూ చాలా బిజీగా ఉంటాడు. హీరో వస్తే అన్ని పరిష్కరించేస్తాడు అనే స్థితిలో హీరోయిన్ ఉంటుంది. ప్రపంచంలో ఎలాంటి అన్యాయాలు జరిగినా సరే పురుషుడే ఎదుర్కొని పరిష్కరిస్తాడు. స్త్రీ




నిస్క్రియాత్మక పాత్రలో పురుషుడి మీద ఆధారపడి ఉంటుంది. ఎలాంటి అన్యాయం జరిగినా సరే పురుషుడే వచ్చి న్యాయం అందిస్తాడు. ఇలాంటి తప్పుడు సందేశాలను అందించే వందల వేల సినిమాలు తెలుగు సినిమా ఇండస్ట్రీ అందించింది. అందిస్తూనే ఉంది. కోట్ల రూపాయలు వెనకేసుకుంది. అభివృద్ధి చెందిన టెక్నాలజీ కారణంగా తెలుగు సినిమా మరింత అభివృద్ధి కావాల్సి ఉండగా, అది మరింత అద్వాన్న స్థితిలోకి పయనించింది. యానిమేషన్ టెక్నాలజీని ఉపయోగించి సినిమా క్వాలిటీని మరింత దిగజార్చింది. తెలుగు సినిమా మరింత మూఢనమ్మకాలలోకి దిగజారింది. పాత పుక్కిటి పురాణాలను పట్టుకొచ్చి పాత కొత్తలను మిక్స్ చేసి హీరోలను గ్లోరిఫై చేసి దానికి టెక్నాలజీ రంగులను అద్ది, ప్రపంచీకరణ అందించిన కమర్షియల్ అస్త్రాలను, పబ్లిసిటీ హంగామాలను ఉపయోగించి సినిమాను మరింత అవాస్తవంగానూ, సామాజిక జీవితానికి ఏ విధంగానూ పనికిరాని విధంగానూ మార్చేసింది. హింసను భరించలేనంత స్థాయికి తీసుకువెళ్లింది. హీరోలను గాడ్ ఫాదర్స్ గా మార్చేసింది. ఇది గతంలోనూ ఉంది. ప్రపంచీకరణ కారణంగా అది మరింత విచ్చలవిడిగా మారిపోయి ప్రి షో అంటూ ప్రజల్లో భ్రమలను నింపింది. కొన్ని విషాదకరమైన సంఘటనలకు కూడా దారి తీసింది. డబ్బు సంపాదన మాత్రమే ధ్యేయంగా మారింది.

స్త్రీ పురుష సంబంధాల కోణంలో తెలుగు సినిమా ఇంటా బయటా ఏం చేసిందో, ఏం జరుగుతుందో రచయిత తన వ్యాసంలో స్పష్టంగా వ్యాఖ్యానిస్తున్నారు. అలానే, మరికొన్ని వ్యాసాల్లో ఎన్నెన్నో సినిమాలను చర్చించారు. తెలుగు సినిమా మాత్రమే కాదు. బెంగాలీ, మలయాళం, విదేశీ భాషల్లో వస్తున్న ఎన్నెన్నో మంచి సినిమాలను ఒడిసి పట్టుకొని వాటి గురించి చర్చించారు. ఘోరే బాయ్ రే ఆజ్, చారులత, ఏక్ దిన్ ప్రతిదిన్, ముఖర్జీ దార్ బౌవ్, లాంటి బెంగాలీ సినిమాలూ, తప్పడ్, పద్మావత్, ఆస్త్రా, సర్దారీ బేగం లాంటి హిందీ సినిమాలూ, అలానే ఇతర భారతీయ, విదేశీ సినిమాలు కూడా ఈ పుస్తకంలో తారసపడతాయి. సమీక్షలు చదవగానే ఆ సినిమాలు చూడాలని పాఠకుడు కోరుకుంటాడు.

సినిమాల సమీక్షల విషయానికొస్తే రచయిత రచనల్లో ఆయా సినిమాల కథల లేదా పాత్రల విశ్లేషణలు మాత్రమే కనిపించవు. సహజంగా అసంఖ్యాకమైన సినిమాలను చూసి మంచి సినిమాలను తినడం, తాగడం జీవితంలో అలవాటుగా పెట్టుకున్న రచయిత ఆ సినిమాల గురించి రాస్తూ ఎన్నో సినిమాలను అక్కడే ప్రస్తావిస్తారు. కథ మాత్రమే కాకుండా, టెక్నలాజికల్ అంశాలను కూడా కలగలిపి రచనకు మరింత విలువను అందిస్తారు. సుదీర్ఘకాలంలో మంచి సినిమాల మీద దాహాన్ని దాదాపు 35 సంవత్సరాలుగా బాలాజీ గారిలో స్వయంగా, వ్యక్తిగతంగా చూసిన నాకు ఆయన మంచి సినిమా ఎక్కడ ఉన్నా, ఏ గ్రహం మీద ఉన్నా చూడకుండా విడిచి పెట్టరని నాకు తెలుసు. మంచి సినిమాలు ఇంట్లో ప్రదర్శించి అందరినీ ఆహ్వానించి, చూపించి, ఆ సినిమా మీద చర్చించే ప్రయ త్నం కూడా గతంలో ఆయన చేశారు. మంచి సినిమాల మీద ఆయనకున్న ప్రేమ ఇక్కడే స్పష్టమవుతుంది. కొన్నిసార్లు పాపులర్ సినిమాలుగా ప్రచారం అందుకున్న సినిమాలను కూడా ఆయన ఎండగట్టి అందులోని తప్పుడు చారిత్రక అంశాలను బయటకు తీసి వాస్తవాలను ప్రజల ముందు పెట్టి సామాజిక బాధ్యతను నెరవేర్చడం కూడా మనకు తెలుసు. జరిగిన చరిత్ర ఒకటైతే, చరిత్రను వక్రీకరించి తమ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చి ప్రచారం చేసే సినిమాలు ఇటీవలి కాలంలో బాగానే వచ్చాయి. ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో తెలియనంత భ్రమల్లో ఆ సినిమాలు ప్రేక్షకు లను ముంచేశాయి. ఇలాంటి సినిమాల విషయంలో కూడా చారిత్రక ఆధారాలతో సమీక్షించి వాస్తవాన్ని తెలియజేసే రచనలు అవసరం. ఈ కార్యాన్ని రచయిత ఎన్నో సమీక్షల్లో నిర్వర్తించారు. అందుకోసం, ఆయన చరిత్ర పుస్తకాలను అధ్యయనం చేసి అందించారు..

రచయిత సినీ సమీక్షలు సినిమాల వరకు మాత్రమే పరిమితం కావు .తప్పుడు చరిత్రలను కలగాపులగం చేసేసి సినిమా రూపంలో ప్రజల మెదళ్ళలోకి ఎక్కించే ప్రయత్నం కొనసాగుతూ ఉంది. ఒక ప్రత్యేక వర్గం మనుగడ కోసం, ప్రపంచీకరణ విధానాలను తమ ప్రయోజనాల కోసం అడ్డు అదుపు లేకుండా ముందుకు నడిపించడానికి కావలసిన భావజాలం మాత్రమే ప్రజల్లో ఉండే విధంగా సినిమాలను కూడా తమ అస్త్రాలుగా మార్చుకొని చరిత్రను తమకు అనుగుణంగా చూపించే ప్రయత్నాన్ని ఎండగట్టడానికి ఆయా సినిమాల వాస్తవ రూపాన్ని ప్రజలకు అందించడానికి అవసరమైతే విభిన్న చారిత్రక గ్రంథాలను కూడా అధ్యయనం చేసి ఆయా వ్యాసాలను ప్రజలకు అందించే చారిత్రక సామాజిక బాధ్యతతో ఉన్న ప్రయత్నం కూడా రచయిత ఎన్నోసార్లు కొనసాగించడం మనకు కనిపిస్తుంది. ఇది నిజమైన చరిత్ర అని చెప్పే ఎన్నో సినిమాలను ఆయన తన మైక్రోస్కోపిక్ దృష్టి కోణంలో పరిశీలించి, డయాగ్నోసిస్ చేస్తూ నిజమైన చరిత్రను ప్రజలకు చూపించి దాన్నుంచి జాగ్రత్తపడమని హెచ్చరించారు. ఇది నిజమైన చరిత్ర అని తప్పుడు చరిత్రలను చూపించే సినిమాలలో నిజమైన చరిత్రను బయటకు తీసి ఏది నిజమైన చరిత్రో ఏది ప్రజల కోణంలో చైతన్యం కావలసిన చరిత్రో తెలియజేసిన సందర్భాలు ఉన్నాయి.

పుస్తకం చివరిలో 'దళిత మహిళలపై అత్యాచారాలను చిత్రించిన సినిమాలు' అనే మరో వ్యాసం కూడా విలువైన రచన. దాసి, దామిని, బ్యాండిట్ క్వీన్, ఆర్టికల్ 15 మరికొన్ని సినిమాలమీదా, డాక్యుమెంటరీల మీదా విశ్లేషణ ఈ రచనలో కనిపిస్తుంది. కరడుగట్టిన ఫ్యూడలిజం, బలత్కారానికి మధ్య ఉన్న సంబంధాన్ని చాలా హృదయ విదారకంగా చిత్రించిన సినిమా దాసి అని రచయిత అంటారు. మతం, జాతి, కులం, లింగం, పుట్టిన ప్రదేశం కారణంగా ఏ పౌరుడికైనా వివక్ష చూపకూడదు అని భారతీయ రాజ్యాంగం 1950లోని 15వ అధికరణం ఘోషిస్తోంది. కానీ, సమాజంలోని అన్ని పార్శ్వాల్లోనూ కుల వ్యవస్థ ఘోర స్థాయిలో ఉందని రచయిత అంటారు ఈ వ్యాసంలో. ఈ వివక్ష ఏ స్థాయికి పయనించిందీ అంటే, మెదడులు ఎంతగా బ్రెయిన్ వాష్ అయిపోయాయంటే చివరికి పదో తరగతి విద్యార్థులు కూడా తమ చరిత్ర పాఠాలలో విశ్లేషణ చేస్తున్నప్పుడు ఒక ప్రత్యేక మతం మీద వ్యతిరేకతతో కూడిన మాటలు ఆడుతున్నారంటే వారిలో ఎంత భయంకరమైన స్థాయికి వారి బ్రెయిన్ వాషింగ్ కొనసాగిందో మనకు అర్థమవుతుంది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి సెన్సిటైజ్ చేసిన సినిమాల గురించి వచ్చిన ఈ వ్యాసాలు చదవాల్సినవే. సినిమాలు కూడా చూడాల్సినవే.

స్త్రీ గురించి స్త్రీలు పడుతున్న అనుభవిస్తున్న వివిధ రకాల సమస్యల గురించి వచ్చిన సినిమాలు చాలా తక్కువ. అయినా సరే, ఇప్పటివరకు వచ్చిన స్త్రీల సమస్యలను చర్చించిన మంచి సినిమాలు ఎంచుకొని ఆయా సమీక్షలను పాఠకుల ముందుకు తేడానికి ప్రయత్నించిన మాతృక ప్రయత్నం కూడా ఈ కోణంలో మంచి ప్రయత్నమని మరోసారి చెప్పగలం. స్త్రీల సమస్యలు, స్త్రీల మీద అత్యాచారాలు తమ సినిమాలకు ముఖ్యాంశంగా తీసుకుని వచ్చిన మంచి సినిమాలు చాలా తక్కువే అంటూ మాతృక అంటోంది.

'అంతః శక్తి ఉన్నా ,సమాజపు అంచనాల మధ్య కొట్టుమిట్టాడుతూ నాలుగు గోడలకు మధ్య పరిమితం చేస్తున్న గృహపాత్రను ప్రశ్నించే మధ్యతరగతి మహిళను చిత్రీకరించిన ఒక సత్యజిత్ రే; చరిత్రనుండి సరఫరా అయిన అనాది దుఃఖాన్ని డిస్ ప్లేస్మెంట్ బాధను మోసే స్త్రీ పాత్రలను సృష్టించిన ఒక రిత్విక్ ఘటక్; ఉద్యోగం చేస్తున్న మహిళ ఒక రాత్రి ఆలస్యంగా వచ్చినందుకు కుటుంబంలో వచ్చిన నైతిక సంక్షోభాన్ని ఎత్తి చూపించిన ఏక్ దిన్ ప్రతి దిన్, ఒక మృణాల్ సేన్; ఫ్యూడల్ పితృస్వామిక నిర్మాణాల్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్న స్త్రీని ఆవిష్కరించిన ఆదూర్ గోపాల కృష్ణన్, గ్లామర్ కీ, త్యాగానికీ, రొమాన్స్ కీ స్త్రీని పరిమితం చేసిన వ్యాపారాత్మక సినిమాను దుమ్మెత్తి పోసిన ఒక శ్యామ్ బెనగల్; సినిమాల్లో కనబడే మగదృష్టిని ప్రశ్నించిన ఒక అపర్ణా సేన్; మతాధిక్య పితృస్వామ్యానికీ, సెక్సువల్ అణచివేతకూ సవాల్ విసిరిన దీపా మెహతా ఇంకా ఇటీవలి కాలంలో మలయాళ, తమిళ సినిమా రంగాల్లో వస్తున్న కొంతమంది కొత్త దర్శకులు తప్ప స్త్రీ గురించి ఆలోచించిన వాళ్ళు చాలా తక్కువ' అంటూ మాతృక సంపాదక వర్గం పుస్తకం ఆరంభంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు మొత్తం సినిమా ప్రపంచం వాస్తవ పరిస్థితి ని మన కళ్ళ ముందు ఉంచుతుంది. ఎంతో అభివృద్ధి చెంది ఎన్నో వందల కోట్ల పరిశ్రమకు దారి తీసిన సినీ పరిశ్రమలో స్త్రీలకు అందించిన స్థలం ఇంత మాత్రమేనా అని ఆశ్చర్యం కలుగుతుంది. అయినా మంచి సినిమా కోసం ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. అందులో భాగంగానే ఈ పుస్తకం కూడా.



కేశవ్
కోల్కతా ఆర్థిక సామాజిక విశ్లేషకులు
జాగృతి సమీక్ష సంపాదకులు




# సనత్‌నగర్ టిమ్స్‌కు డా. మర్రి చెన్నారెడ్డి పేరు ఖరారు

## రూ.1,100 కోట్లతో నిర్మించిన ప్రతిష్ఠాత్మక ఆస్పత్రికి తెలంగాణ ప్రభుత్వం నామకరణం

**హైదరాబాద్, జనంసాక్షి :** హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి పేరును ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే ఉత్తర్వుల్లో టిమ్స్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా డా. నరేంద్రకుమార్‌ను నియమించింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన డా. మర్రి చెన్నారెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు సేవలందించారు. అంతేకాకుండా ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలకు గవర్నర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. సుమారు రూ.1,100 కోట్ల వ్యయంతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌లో కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశారు. 30 ప్రత్యేక వైద్య విభాగాలు, అత్యాధునిక కార్డియాక్ కేర్ సేవలు, ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్‌తో పాటు పలు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థను అభివృద్ధి చేసినట్లు అధికారులు తెలిపారు.

# రోడ్డు పనుల్లో జాప్యానికి చెక్

**భారీ వర్షాలపై అధికారులకు కలెక్టర్ అలర్ట్**
**ఆగస్టు 15లోగా జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలి**
**భారీ వర్షాలు రోడ్డు భద్రతపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఫోకస్**



**మహబూబ్ నగర్ బ్యూరో జులై 31(జనం సాక్షి) :** జిల్లాలో జాతీయ రహదారులపై కొనసాగుతున్న అన్ని రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. జానకితో కలిసి నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై తీసుకున్న చర్యల పై చర్చించారు, ఇంకా పూర్తికాని పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై నిర్మాణ పనులు ఆలస్యం కావడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని కలెక్టర్ అన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాంతాల్లో తగిన హెచ్చరిక బోర్డులు, డైవర్షన్లు, రోడ్డు మార్కింగ్‌లు, లైటింగ్, క్రాష్ బ్యారియర్లు, ఇతర భద్రతా చర్యలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మూసాపేట, రాజాపూర్, జడ్చర్ల, పొన్నకల్ జంక్షన్ తదితర కీలక ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అవసరమైన చోట సంయుక్త తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న అంశాలపై ఇంజినీరింగ్ పరమైన పరిష్కారాలను అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణం ఆలస్యం విషయంలో జిల్లా కలెక్టర్ నేషనల్ హైవే అధికారులపై ఆగ్రహం వ్యయం చేశారు. పనుల పూర్తికి పదేపదే గడువులు పొడిగించడం సరికాదని హెచ్చరించిన కలెక్టర్, ఆగస్టు 15లోగా అన్ని ప్రాధాన్య పనులు పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు. పనుల పురోగతిపై ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు జియో ట్యాగ్ ఫోటోలతో పాటు పనులు, కార్మికుల సంఖ్య, ప్రస్తుత పరిస్థితిపై నివేదికను తప్పనిసరిగా పంపాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు. గడువులోగా పనులు పూర్తి కాకపోతే సంబంధిత అధికారుల పనితీరుపై ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ కార్యాలయానికి నివేదిస్తానని హెచ్చరించారు. రోడ్డు భద్రత అత్యంత కీలకమైన అంశమని, ఇందులో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల కారణంగా పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్, పోలీసు, రోడ్లు--భవనాల శాఖ అధికారులు సమన్వయంతో దశలవారీగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించి పాదచారులకు సురక్షితంగా నడిచే అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతినిధి కోట బాబు, రోడ్లు--భవనాల శాఖ, రవాణా శాఖ, మున్సిపల్ శాఖ, పోలీసు శాఖ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ డి. జానకితో కలిసి వర్షాల పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రహదారులు, కల్వర్టులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖలు వెంటనే స్పందించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, వాగులు, కాలువల నీటి మట్టాలను ఇరిగేషన్ అధికారులు నిరంతరం పరిశీలించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు, మత్స్యకారులు, సందర్శకులు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో దప్పు చాటింపు, మైకుల ద్వారా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. పాత, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అవసరమైతే అందులో నివసిస్తున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే సహాయం అందించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

# భార్య సమాధి వద్దనే భర్త ఆత్మహత్యా



**రంగారెడ్డి జులై 31 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యను హత్య చేసి కటకటాల పాలైన వ్యక్తి బెయిల్ పై బయటకు వచ్చి భార్య సమాధి వద్ద ఆత్మహత్య ఆత్మహత్య చేసుకున్నాడు ఈ ఘటన మంచాల మండలం నోముల గ్రామంలో చోటుచేసుకుంది. ఎందుకు సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం.. బాబు అనే వ్యక్తి గతంలో తన భార్యను అత్యంత దారుణంగా నరికి చంపాడు. అతనిపై హత్య కేసు నమోదు కావడంతో రిమాండ్ లో ఉన్నాడు. ఇటీవల బెయిల్ పై బయటకు వచ్చి, ఊరికి దూరంగా ఉంటున్నాడు. కాగా, గురువారం రాత్రి గ్రామానికి వచ్చి, భార్య సమాధి వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం ఉదయం సమాధి వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే మంచాల పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భార్యను హత్య చేసిన అనంతరం గ్రామానికి దూరంగా ఉన్న వ్యక్తి, ఇంతకాలం తర్వాత వచ్చి అదే సమాధి వద్ద ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు ఏమిటన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను విశ్లేషిస్తున్నాను.

# సమీక్ష సమావేశంలో సర్పంచుల మధ్య ఘర్షణ

**రోడ్ల దుస్థితిపై వాగ్వాదం.. పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత**



**నవాబుపేట్, జూలై 31 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశం, సామర్థ్య వృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఇద్దరు సర్పంచుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్, మండల ప్రత్యేక అధికారి కవిత సమక్షంలో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు, 32 గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయం, విద్యుత్, వైద్యం, విద్య, ఉపాధి హామీ తదితర శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు. రైతులకు విత్తనాల పంపిణీ, రైతు బీమా, పంటల ఆన్‌లైన్ నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు సేవలు, హెచ్‌పీవీ వ్యాక్సిన్, పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల సమస్యల పరిష్కారంపై అధికారులు వివరించారు. గ్రామాల్లో స్వల్ప వర్షానికే విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని, రోడ్ల వెంట చెట్లు తొలగించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంపై సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేయగా, విద్యుత్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్ల దుస్థితిపై చర్చ జరుగుతుండగా, సర్పంచుల సంఘం అధ్యక్షుడు, ఎల్లకొండ సర్పంచ్ కొండల యాదవ్ మరియు దాతాపూర్ సర్పంచ్ బలవంత్ రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అభివృద్ధి అంశాలపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఉద్రిక్తతకు దారితీయగా, పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

అనంతరం జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ మాట్లాడుతూ, వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సర్పంచులకు సూచించారు. ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన 'జలసిరి' కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వీవీజీ రామ్, ఈజీఎస్ అంశాలపై అవగాహన సదస్సు కూడా నిర్వహించారు.

# వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీస్తున్నారు

**మాల మహానాడు రాక్స్ జాతీయ అధ్యక్షులు డా. ఆర్ఎస్ రత్నాకర్**




**మహబూబ్‌నగర్ ప్రతినిధి జూలై 31(జనం సాక్షి ):** ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతను దెబ్బతీస్తూ, వారిపై పెద్ద కుట్ర జరుగుతోందని మాల మహానాడు మరియు రాక్స్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్. రత్నాకర్ ఆరోపించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, రేవంత్ రెడ్డి క్యాబినెట్లలో సామాజిక న్యాయం ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీయే బీజం వేసిందని, నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ మాలల గొంతు కోసిందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు . ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా దేశంలో పరిమిత సంఖ్యలో మాత్రమే లబ్ధి చేకూరుతుందని, ఈ పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎస్సీ వర్గాలకు సమాన అవకాశాలు ఎలా కల్పిస్తారో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ వల్ల మాల సామాజిక వర్గం తన ఉనికిని కోల్పోయి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో చట్టపరమైన మార్పులు జరిగే వరకు తమ ఉద్యమం పూర్తిగా శాంతియుతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. మాల ప్రజాప్రతినిధులు మేల్కోవాలని తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజిక వర్గాన్ని తొక్కేసే ప్రయత్నాలు జరుగుతున్నా, ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా మాల ప్రజాప్రతినిధులు గళం విప్పాలని, సామాజిక వర్గ ప్రయోజనాల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీరం సతీష్ కుమార్, తలారి రాజన్న, ఎడ్ల కృష్ణయ్య, యాదయ్య, కాశయ్య, నారాయణ, విజయ్‌కుమార్, నరహరి, నాని, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా పర్యటనలో లీస్‌బర్గ్ స్టోన్ టవర్ వైనరీని సందర్శించిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**తాండూరు జులై 31(జనంసాక్షి)** అమెరికా పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తో కలిసి వర్జీనియా రాష్ట్రంలోని లీస్‌బర్గ్‌లో ఉన్న ప్రముఖ స్టోన్ టవర్ వైనరీని సందర్శించారు. ఈ సందర్భంగా వైనరీ యాజమాన్యం వారికి వైన్ తయారీ ప్రక్రియ, ద్రాక్ష సాగు నుంచి బాట్లింగ్ వరకు ఉండే వివిధ దశలను క్షేత్రస్థాయిలో వివరించారు. వైనరీ నిర్వహణ విధానం, నాణ్యత నియంత్రణ, మార్కెటింగ్ వ్యూహాలపై అధికారులు సమగ్ర సమాచారం అందించారు. పర్యాటక అభివృద్ధికి వైనరీలు పోషిస్తున్న పాత్రను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేకంగా పరిశీలించారు. వైనరీని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వైన్ టూరిజం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు చేకూరుతున్న ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఇటువంటి నమూనాలను అధ్యయనం చేసి, తెలంగాణలో అమలు చేసే అవకాశాలపై చర్చించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, వైన్ తయారీతో పాటు గ్రామీణ పర్యాటకం, స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహానికి ఇది మంచి ఉదాహరణ అని అన్నారు. ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి వైనరీ నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగంపై ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సందర్శనలో వైనరీ యాజమాన్యం అతిథులకు వైనరీ ఆవరణ, ద్రాక్ష తోటలు, సెల్లార్‌లను చూపించారు. తెలంగాణలో పర్యాటక, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# మత్తుకు చెక్.. సైబర్ నేరాలకు బ్రేక్..!

**విద్యార్థుల భద్రతే లక్ష్యంగా ఉప్పల్ పోలీసుల మెగా అవగాహన**
**లిటిల్ ఫ్లవర్ కళాశాలలో యువతకు కీలక సందేశం**
**మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం..**
**సైబర్ మోసాలపై అప్రమత్తతే ఆయుధం**



**ఉప్పల్ జులై 31 (జనంసాక్షి) :** యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలు, పెరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ఉప్పల్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థుల్లో భద్రతా చైతన్యం పెంచేందుకు లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఏసీపీ, ఉప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, చట్టాలను గౌరవిస్తూ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని పోలీసులు వివరించారు. క్షణిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం ఇతరులకు ఇవ్వవద్దని హెచ్చరించారు. విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. మహిళలు, విద్యార్థుల భద్రత కోసం అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలు, పోలీసు సేవలపై కూడా అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులతో పోలీసులు ముఖాముఖిగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. సమాజంలో నేరాల నియంత్రణకు పోలీసులతో పాటు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. యువత రక్షణ.. సమాజ భద్రతకు తొలి అడుగు అనే లక్ష్యంతో ఉప్పల్ పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మంచి స్పందనను పొందింది.




# కార్ ఫ్రాగ్రన్స్ విభాగంలోకి ఓడోనిల్

**ఖైరతాబాద్, జూలై 31 (జనంసాక్షి):** డాబర్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఎయిర్ ఫ్రెష్నర్ బ్రాండ్ ఓడోనిల్ కార్ ఫ్రాగ్రన్స్ విభాగంలోకి ప్రవేశి స్తూ ఓషన్ బ్రీజ్, రూబీ మిస్ట్ వేరియంట్లను విడుదల చేసినట్లు డాబర్ ఇండియా లిమిటెడ్ హోం కేర్ మార్కెటింగ్ హెడ్ వైభవ్ రాథీ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 45 రోజుల వరకు నిలిచే సువాసన, ఫ్రాగ్రన్స్ రెగ్యులేటర్, యాంటీ స్మోక్ టెక్నాలజీ వంటి ఫీచర్లతో ఈ ఉత్పత్తులు అందుబాటు లోకి తెచ్చామని తెలిపారు. 8 మిల్లీలీటర్ల సింగిల్ ప్యాక్ ధర రూ.99 కాగా, సింగిల్, వ్యాల్యూ ప్యాక్ లలో ఈ ఉత్పత్తులు ప్రముఖ ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, మోడ్రన్ ట్రేడ్ అవుట్‌లెట్లు, రిటైల్ స్టోర్లలో లభ్యమవుతాయని వెల్లడించారు.



# నిమ్స్ ఫ్యాకల్టీ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**ఖైరతాబాద్, జూలై 31 (జనం సాక్షి):** నిజాం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) ఫ్యాకల్టీ అసోసియేషన్‌కు 2026 సంవత్సరానికి నిర్వహిం చిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎ న్నికైంది. నూతన కార్యవర్గంలో అధ్యక్షురాలిగా డా.స్వర్ణలత, ఉపాధ్యక్షురాలిగా డా.మేఘా ఉప్పి న్, ప్రధాన కార్యదర్శిగా డా.పి.ఎస్.ఎస్.గోపాల్, కోశాధికారిగా డా.శ్రీనివాస్ జి, సంయుక్త కార్యదర్శి గా డా.రామకృష్ణ ఆర్ ఎన్నికైనట్లు అసోసియేషన్ వెల్లడించింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్ని కైన కార్యవర్గ సభ్యులు తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న నిమ్స్ అధ్యాపకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, విద్యా, వైద్య సేవలు, పరి శోధన రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పని చేస్తామని పేర్కొన్నారు. అలాగే నిమ్స్ సమగ్ర అ భ్యున్నతి కోసం పారదర్శకత, ఐక్యత, జవాబుదారీ తనం, నిబద్ధతతో తమ బాధ్యతలను నిర్వర్తిస్తా మని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది.

# బాలయ్య ఆచూకీని త్వరగా కనిపెట్టండి : టిఆర్ఎస్

**శేరిలింగంపల్లి, జూలై 31 (జనంసాక్షి) :** ఆఫీస్ పెట్ డివిజన్ పరిధి ప్రేమ్ నగర్ ప్రాంతానికి చెందిన బాలయ్య కొండాపూర్ వైశాలి నగర్ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద పొరపాటున డ్రైనేజీ నాలాలో కొట్టుకుపోయి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆచూకీ లభించకపోవడం గర్హనీయమని, ఇది ముమ్మాటికి అధికారుల వైఫల్యమైన అని టిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ వాసలి చంద్రశేఖర ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ బాలయ్య కుటుంబం నిరుపేద కుటుంబమని, అలాంటి వ్యక్తి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దుర్మరణం చెంది నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ మృతదేహం ఆచూకీ లభించకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఫోటోలు దిగడంలో, మీడియాలో మొసలి కన్నీరు కార్చడంలో చూపించిన శ్రద్ధను కొంతమేర బాలయ్య విషయంలో చూపించినా పరిస్థితి ఇంత దయనీయంగా ఉండదని దుయ్యబట్టారు. చనిపోయిన బాలయ్య కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారని, ఆయన కుటుంబానికి ఎవరు న్యాయం చేస్తారని చంద్రశేఖర్ ప్రసాద్ ప్రశ్నించారు. తక్షణమే అధికారులు మరింత బాధ్యతతో బాలయ్య మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబానికి అప్పగించాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా వారికి అండదండలు అందించి ఆర్థిక చేయూతను కల్పించాలని డిమాండ్ చేశారు.

# భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్త అరెస్ట్



**మల్కాజిగిరి జూలై 31(జనంసాక్షి) :** కట్టుకున్న భార్యను వేధింపులకు గురిచేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తను మల్కాజిగిరి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. దమ్మాయిగూడ సిద్ధార్థ నగర్ కాలనీకి చెందిన యల్లుగుల నవీన్ కుమార్ (41) మౌలాలి జవహర్‌నగర్‌లోని అక్షయ టవర్స్‌లో నివాసముంటున్న శరణ్య (34)తో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. నవీన్ కుమార్ మద్యానికి బానిసగా మారి ఆర్థికంగా అప్పులు చేయడమే కాకుండా, కుటుంబ నిర్వహణను పట్టించుకోకుండా భార్యను తీవ్రంగా వేధించేవాడు. భర్త వేధింపులు తాళలేక శరణ్య పురుగుల మందు సేవించింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతి చెందింది. మృతురాలి తండ్రి అశోక్ అకునూరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సాక్షుల వాంగ్మూలాలు, ఆధారాలను సేకరించిన అనంతరం భార్య ఆత్మహత్యకు కారణమైన నిందితుడు నవీన్ కుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు అతడికి జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
01 ఆగస్ట్ 2026

## రాయన్‌పల్లి వంతెన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవ

**రూ.2.30 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదన నిధుల మంజూరుకు నిరంతర ప్రయత్నాలు**

**రాయన్ పల్లి వంతెన వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు**

**మెదక్, జూలై 31( జనం సాక్షి ) :** మెదక్ మండలంలోని రాయన్ పల్లి గ్రామ వంతెన గత ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతినడంతో గ్రామ ప్రజలు, రైతులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో విస్తృతంగా చర్చలు జరిపారు.

వంతెన పునర్నిర్మాణానికి సంబంధించి రూ. 2.30 కోట్ల అంచనా వ్యయాన్ని సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనకు త్వరితగతిన ఆమోదం లభించేలా తాను నిరంతరం సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ నిధుల మంజూరు కోసం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, తహసీల్దార్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే, కొత్త వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే తాత్కాలిక మరమ్మతులు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌తో కూడా ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేకంగా మాట్లాడి రాయను



పల్లి వంతెన ప్రస్తుత పరిస్థితిని వివరించి, ఈ పనులకు అత్యవసర ప్రాధాన్యత ఇచ్చి నిధుల విడుదల వేగవంతం చేయాలని కోరారు. అదేవిధంగా మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని వంతెనలు, కాలువలు, వాగులు, చెరువుల పరిస్థితిని సమీక్షించి, వర్షాకాలంలో ప్రమాదం ఏర్పడే అవకాశమున్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. ఆయన రైన్‌పల్లి వంతెన పునర్నిర్మాణం త్వరితగతిన ప్రారంభమయ్యేలా ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను సాధించేందుకు తన ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## జడ్చర్లలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు

**జడ్చర్ల, జూలై 31 (జనంసాక్షి):** జడ్చర్ల మండలంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల, ఏరియా ఆసుపత్రి అలాగే బాదేపల్లి పాత బజార్‌లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముందుగా గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, తరగతి గదులు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం నాలుగో తరగతి గదికి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. పాఠశాలలో దోమల బెడద తీవ్రంగా ఉందని, కొన్ని గదుల కిటికీలకు తలుపులు లేవని, ఫ్యాన్లు పనిచేయడం లేదని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్, పనిచేయని ఫ్యాన్లకు సాయంత్రంలోపు మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కిటికీలకు తలుపుల బిగింపు, దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను అత్యవసరంగా సిద్ధం చేసి, అనుమతుల కోసం సాయంత్రంలోపే ఫైల్ పంపాలని ఆర్‌సీఓను ఆదేశించారు. అలాగే పాఠశాల పరిసరాల్లో దోమల నివారణకు గ్రామ



పంచాయతీ సిబ్బందితో వెంటనే ఫాగింగ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా... ప్రధాన కారిడార్, వార్డులు, క్యాజువాలిటీ, లేబర్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి వెలుపల చెత్త పేరుకుపోవడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం తగదని, ప్రతిరోజూ కనీసం మూడు పర్యాయాలు ఆసుపత్రిలోని అన్ని విభాగాలను శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రసూతి వార్డును సందర్శించి బాలింత మహిళలతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, శానిటేషన్, ఇతర సౌకర్యాల గురించి ఆరా తీశారు. వైద్య సేవల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్యాధికారులకు సూచించారు. పర్యటనలో భాగంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పాత బజార్‌లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను కలెక్టర్ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు పనులను వేగవంతంగా పూర్తి చేసి, స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ మహమ్మద్ అర్షదుల్ల తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో పెద్దమందడి వనపర్తి రూ.40 కోట్ల రహదారి పనులు ప్రారంభం

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, జూలై 31జనంసాక్షి :** పెద్దమందడి--వనపర్తి ప్రధాన రహదారి నిర్మాణానికి మంజూరైన రూ. 40 కోట్ల పనులు సాంకేతిక సమస్యలు పరిష్కారమైన నేపథ్యంలో మరో వారం రోజుల్లో ప్రారంభమవుతాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దమందడి మండల రైతువేదికలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన శాఖల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించిన ఎమ్మెల్యే, ప్రతి శాఖ ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లబ్ధిదారులకు మట్టి, ఇసుక సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. మహిళా సంఘాల రుణాల మంజూరులో జాప్యంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ సమీక్షలో యూరియా బుకింగ్ సమయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, యాప్‌లో "నో స్టాక్" సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలో గత 30 నెలల్లో విద్యుత్ శాఖ ద్వారా రూ. 140 కోట్ల



అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రస్తుతం మరో రూ. 40 కోట్ల పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో వనపర్తి మూడో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. గ్రామాల్లో పనిచేయని వీధిలైట్లను వెంటనే మరమ్మతు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తున్న గ్రామపంచాయతీలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పెద్దమందడి--ఖిల్లా ఘనపురం మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు నవనీత, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి విజయభాస్కర్, జడ్పీ సీఈఓ యాదయ్య, ఎంఈఓ మంజుల, ఎంపీడీవో పరిణత, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

### పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు జులై 31(జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని.. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో వివరాలు సమర్పించని ప్రతి ఓటరు తమ బాధ్యతగా వెంటనే వివరాలు అందించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 64.65 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని తెలిపారు. బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో దేవాలయాలకు వచ్చే భక్తులతో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరికి ఎస్ఐఆర్ అంశంపై అవగాహన కల్పించడంతోపాటు.. ప్రక్రియలో పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి ఓటు అత్యంత



కీలకమని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ముగియడానికి మరో 10 రోజుల సమయం ఉన్నందున అర్హులైన ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణుల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు బ్రాహ్మణుల కోసం ఫంక్షన్ హాల్ నిర్మించి అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయ్ కాడి విజయకుమార్, కౌన్సిలర్ అంతిరెడ్డి, శంకర్, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దుచెయ్యాలి

**కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్య తీసుకోవాలి**

**కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు అమ్మడమే ఏజెన్సీలో పనిగా మారింది**

**మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి ప్రభుత్వానికి డిమాండ్**

**సంగారెడ్డి జులై 31 (జనం సాక్షి) :** అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చెయ్యాలి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠినమైన చర్య తీసుకోవాలి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు అమ్మడమే ఏజెన్సీల పనిగా మారిందని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి అన్నారు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం సూపర్డెంట్ కి వినతి. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం, యాదగిరి మాట్లాడుతూలి ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఏజెన్సీలకు వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్నవారికే ఉద్యోగాలివ్వడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు రావాలంటేనే ఏజెన్సీలు,అధికారులకు చేతులు తడిస్తే తప్ప ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు అందులో పని చేస్తున్న కార్మికులను కాదని అధికారులు ఏజెన్సీలకు వత్తాస్తు పలుకుతూ వాళ్లకి అనుకూలంగా ఉన్నవారికి డబ్బులు ఇస్తేనే ఉద్యోగం ఇస్తున్నారని ఆయన అన్నారు మార్పు అంటే ఇదేనేమో అని అన్నారు ఆస్పత్రిలో కొన్నేళ్లుగా పనిచే స్తున్న కార్మికులను కాదని ఇతరులకు ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలివ్వడం అన్యాయమని దుయ్యబట్టారు ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలు పేరుమీద నోటిఫికేషన్ వేయకుండా ఎలా రిక్రూట్మెంట్ చేస్తారని అన్నారు అధికారులు ఎవరికి చెప్పకుండా కాంట్రాక్టర్లకు వత్తాస్తు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్న వారికి ఉద్యోగాలు



ఇవ్వడం ఏంటని అన్నారు కార్మికులకు మేలు చేయాల్సిన అధికారులే ఇలా చేయడం ఏంటని అన్నారు నోటిఫికేషన్ వేయకుండా ఉద్యోగాలు తీసుకున్న వారిని రా తొలగించి వారి స్థానంలో అందులో పని చేస్తున్న కాంటాక్ట్ కార్మికులను తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేనిపక్షంలో కార్మికులందరూ ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వ హాస్పిటల్,మెడికల్ కళాశాల అధికారులు పద్ధతి మార్చుకోవాలని ఆయన అన్న లేనిపక్షంలో భవిష్యత్తులో ఏమన్నా జరుగుతే దీనికి బాధ్యత ప్రభుత్వ హాస్పిటల్, మెడికల్ కళాశాల అధికారులు వహించాల్సి వస్తుందని అన్నారు . ప్రభుత్వం స్పందించి వెంటనే నియామ కాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని లేదా పోరాటం మరింత తీవ్రతం చేస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కే,యాదగిరి కే, సదానంద నాగరాజు, సునీత లక్ష్మీ ప్రియ మొగులమ్మ భాగ్యలక్ష్మి శేఖర్ నాగరాజు, మహేందర్ రెడ్డి సురేష్ మల్లేశం మహేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు



## తెలంగాణకు మరిన్ని గ్రామీణ రహదారులు మంజూరు చేయండి

### కేంద్ర మంత్రికి ఎంపీ అరుణ వినతి

**నారాయణపేట జూలై 31(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని గ్రామీణ రహదారులు ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేయాలని బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు పాలమూరు ఎంపీ డి కే అరుణ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కోరారు.తెలంగాణ బిజెపి ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేష్ ,ఈటల రాజేందర్, రఘునందన్ రావు తో కలిసి కేంద్ర గ్రామీణాభి వృద్ధి, వ్యవసాయ,రైతు సంక్షేమ శాఖ మంత్రి ని కలిసి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించి కోరారు.ఈ సందర్భంగా ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని గ్రామీణ రహదా రులను మంజూరు చేయాలని, అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అర్హులైన పేద కుటుంబాలకు అధిక సంఖ్యలో గృహాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పేదల గృహ కల సాకారం కోసం కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు.

## చేర్యాలలో త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

### ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా!

**చేర్యాల (జనంసాక్షి) జూలై 31 :** చేర్యాల అంగడి బజార్ నుండి పెద్దమ్మ గడ్డకు వెళ్లే దారిలో శుక్రవారం పెట్రోల్ తో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనం పక్కనే ఉన్న మోరిలోకి దిగబడి ఒక వైపు పడిపోయే ప్రమాదం నుండి బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఒకవేళ కింద పడిపోయి ఉంటే లారీలోని పెట్రోల్ ఇండ్లలోకి వెళ్లి పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉండేది. అంగడి బజార్ నుండి పెద్దమ్మగడ్డ వరకు ఉన్న రోడ్డుపై హెచ్చరిక బోర్డు పెట్టాలని కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటీ సమావేశంలో తీర్మానం చేసినప్పటికీ ఏలాంటి ఏర్పాట్లు చేకపోవడంపై మున్సిపాలిటీ పాలకవర్గం అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజలను ఒప్పించి రహదారి వెడల్పు కార్యక్రమాలు చేపడితే కానీ ఇలాంటి ప్రమాదాల బారినుండి బయటపడే అవకాశం లేదు. ముఖ్యంగా మున్సిపాలిటీ పాలకవర్గం అధికారులు ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా! అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి వెంట ఏదైనా అత్యవసర పరిస్థితిలో కనీసం



అంబులెన్స్ వెళ్లడానికి కూడా సరైన మార్గం లేకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారిలో ఒక భారీ వాహనం వస్తే ఎదురుగా మరో వాహనం రావడానికి దారిలేక అనేక ప్రమాదాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పాలకవర్గం చోద్యం చూస్తున్నారు.సంబంధిత అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు స్పందించి వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## రాయిన్‌పల్లి ప్రాజెక్ట్ కెనాల్ చెరువు కట్టకూ భారీ గండి

### ఏడు గ్రామాలకు ముప్పు.. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

**శాశ్వత మరమ్మతులు చేయకపోతే ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరిక**

**మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి**

**మెదక్, జులై 31 (జనం సాక్షి) :** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెదక్ మండలం రాయినపల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ కూలిపోగా, చెరువు కట్ట కూడా సగానికి పైగా దెబ్బతినడంతో ఏడు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం ఘటనాస్థలిని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ఏడాది వరదల్లో దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, రహదారులకు శాశ్వత మరమ్మతులు చేయకుండా తాత్కాలిక పనులతో సరిపెట్టడంతోనే నేడు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ పూర్తిగా కూలిపోయిందని ఆరోపించారు. మూడు రోజుల వర్షాలకే కాల్వ కట్ట, చెరువు కట్ట దెబ్బతినడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ ద్వారా సుమారు 2500 ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ఏడు గ్రామాలకు ప్రత్యక్షంగా, మరో పది గ్రామాలకు పరోక్షంగా నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కాల్వ దెబ్బతినడంతో రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.రెండు నెలల క్రితమే రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి మరమ్మతులు చేపట్టాలని కోరినా ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు కెనాల్ పూర్తిగా కొట్టుకుపోవడంతో చెరువు కట్టకూ పెను ముప్పు ఏర్పడిందని, కామారెడ్డి జిల్లా దంతేపల్లి వైపు నుంచి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితి మరింత



ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే ఏడు గ్రామాల ప్రజలు, రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ట్రాక్టర్లు, జేసీబీల సహాయంతో స్వయంగా కట్టను పూడ్చే కార్యక్రమం చేపడతామని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజ గౌడ్ మాజీ ఎంపీపీ కిష్టయ్య, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,నాయకులు న్యాయవాది జీవన్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగ నరేందర్,రాయన్ పల్లి మాజీ సర్పంచ్ నాగులు, పార్టీ అధ్యక్షులు జంగం వీరస్వామి, మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ. ఆంజనేయులు నాయకులు బాలయ్య నర్సాగౌడ్ నర్సింలు, దుర్గయ్య, కిష్టయ్య సిద్ధిరాములు,శీను భాస్కర్, యాదగిరి శ్రీధర్, రైతులు తదితరులు ఉన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్‌లో నెల రోజుల్లో 112 మంది బాలల రక్షణ

### 75 కేసులు నమోదు

**బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు**

**అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా ముగిసిన ఆపరేషన్ ముస్కాన్**

**అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**

**మెదక్ బ్యూరో, జూలై 31 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా జూలై 1 నుంచి నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా ముగిసిందని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ ముగింపు సందర్భంగా నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, వ్యాపార సముదాయాలు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి రక్షించినట్లు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా నెల రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 112 మంది బాలలను రక్షించి, వారిని




చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరిచిన అనంతరం తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారి సంరక్షణకు అప్పగించినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు లేని లేదా ప్రత్యేక సంరక్షణ అవసరమున్న పిల్లలను సంబంధిత సంరక్షణ కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. బాల కార్మికులను పనిలో ఉంచుకున్న యజమానులపై 75 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. పిల్లల బాల్యం విద్యకే అంకితం కావాలని, వారు కార్మికులుగా కాకుండా పాఠశాలల్లో చదువుకుంటూ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. పోలీస్ శాఖతో పాటు కార్మిక, విద్య, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల సమిష్టి కృషితో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతమైందని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఇదే సమన్వయంతో భవిష్యత్తులో కూడా నిరంతర చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఐ రాజశేఖర్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఉప్పలయ్య, హెల్త్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ నవ్య (సీఏఎస్), డీసీపీయూ ఇన్‌చార్జి నాగరాజు, ఏఎల్ఓ మెదక్ కమ్రుద్దీన్, తిరుపతి, ఏఎల్ఓ నర్సాపూర్ సత్యేంద్ర ప్రసాద్, మిషన్ ఎన్జీవో ప్రతినిధులు, రెండు డివిజన్లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

## గద్వాల మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల డిసెంట్

### రాజకీయంగా వేడెక్కిన పురపాలిక

**జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల, జూలై 31 (జనంసాక్షి) :** మున్సిపాలిటీలో శుక్రవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. సమావేశంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు అజెండాలోని 3, 6, 7, 9, 11, 15, 18, 19, 22 అంశాలపై డిసెంట్ ప్రకటించారు. ఈ మేరకు తమ అభ్యంతరాలను పేర్కొంటూ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ప్రత్యేక లేఖ అందజేశారు. సమావేశంలో చర్చించిన పలు అంశాలపై తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొంటూ కౌన్సిలర్లు అధికారికంగా అసమ్మతి నమోదు చేసినట్లు సమాచారం. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్‌ను కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయనున్నట్లు వారు వెల్లడించారు.కౌన్సిలర్లు డిసెంట్ ప్రకటించిన నేపథ్యంలో సమావేశంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు తెలిసింది. ఈ పరిణామం గద్వాల మున్సిపల్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారగా, డిసెంట్‌కు దారితీసిన కారణాలపై కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసిన అనంతరం మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.



# న్యాయ మౌలిక వసతులపై ప్రశ్నించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ బ్యూరో, జూలై 31 ( జనం సాక్షి) :** వరంగల్ జిల్లాలో న్యాయ మౌలిక వసతుల అభివృద్ధి, ఈ-కోర్టుల విస్తరణ, కోర్టు భవనాల నిర్మాణం, డిజిటల్ న్యాయ సేవల పురోగతిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. జిల్లాకు కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం, పూర్తయిన ప్రాజెక్టులు, అమలులో ఉన్న పనులు, ఈ-కోర్టుల అభివృద్ధి చర్యలపై స్పష్టమైన వివరాలను కోరారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జిల్లా, సబ్‌ఆర్డినేట్ కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధి పై రాష్ట్రాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు కేంద్రం 1993-94 నుంచి ప్రత్యేక కేంద్ర ప్రాయోజిత పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణకు గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ.11.16 కోట్ల నిధులు విడుదల చేసి వినియోగించినట్లు కేంద్రం వెల్లడించింది. 2024-25లో రూ.1.96 కోట్లు, 2025-26లో రూ.9.20 కోట్లు విడుదల కాగా, 2026-27 సంవత్సరానికి రూ.15.79 కోట్ల మదర్ శాంక్షన్ మంజూరు చేసినట్లు తెలిపింది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయ సేవలు అందుబాటులోకి రావాలంటే ఆధునిక సాంకేతికతతో పాటు మెరుగైన మౌలిక వసతులు అవసరమని అన్నారు. ఈ-కోర్టుల ఫేజ్-3 కింద జిల్లాకు నిధులు మంజూరు చేసి డిజిటల్ సేవలను విస్తరించడం, ఈ-సేవా కేంద్రాల ఏర్పాటు, వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయాలు కల్పించడం వల్ల న్యాయ సేవలు మరింత ప్రజలకు చేరువవుతాయని చెప్పారు. జిల్లాలో కోర్టుల ఆధునికీకరణ, సాంకేతిక సదుపాయాల విస్తరణతో పాటు భవిష్యత్తులో అవసరమైన చోట కొత్త న్యాయ మౌలిక వసతుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

# పశువులను మేతకు తీసుకెళ్లిన రైతు అదృశ్యం



**కడెం, జులై 31 (జనంసాక్షి) :** కడెం మండలంలోని నవాబ్ పేట్ గ్రామానికి చెందిన సిద్ధం గంగన్న (70) అనే రైతు గ్రామంలో పశువులు మేపుతూ నివసించేవాడు, ఎప్పటిలాగే ఈనెల 30వ తేదీ గురువారం రోజున పశువుల మేతకు వెళ్లిన గంగన్న పశువులు ఇంటికి వచ్చిన కానీ గంగన్న ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో శుక్రవారం రోజున కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు పలువురు గంగన్న ఆచూకీ కోసం అడవిలో విస్తృతంగా గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు కడెం ఎస్సై సాయి కిరణ్ దర్యాప్తు చేపట్టి గంగన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. గంగన్న పశువులను మేతకు తీసుకెళ్లిన అదే రోజు రాత్రి భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో గంగన్న వాగు ప్రవాహంలో కొట్టుకు పోయాడా? లేదా అడవిలో దారి తప్పిపోయారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గంగన్న ఆచూకీ తెలియక పోవడం కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గంగన్న ఆచూకీ తెలిసినవారు వెంటనే సమీప పోలీసులకు లేదా 9703833979 అనే నెంబర్కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

- కలెక్టర్ భవేష్ మిశ్రా



**ఖానాపూర్ జూలై 31 (జనం సాక్షి) :** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని రెంకొని వాగు పై తెగిన తాత్కాలిక వంతెన ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ తాత్కాలిక వంతెన తెగిపోవడంతో వాగుకు అటువైపు ఉన్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట మునిసిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక మహేందర్, తహసిల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, ఎంఈఓ సంధ్యారాణి, కౌన్సిలర్ లు తొడసం ఇందిరా, రాజురా సత్యం, బొప్పారావు సత్యవతి, నాయకులు బండి పెల్లి ప్రకాష్ గౌడ్, గొర్రె గంగాధర్, తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- దేశాయిపేట, నెహ్రూ మెమోరియల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ

**వరంగల్ బ్యూరో, జూలై 31 (జనం సాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం వరంగల్ నగరంలోని దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, నెహ్రూ మెమోరియల్ స్కూల్ ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత.అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం పాత భవనం పునరుద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు, కాంపౌండ్ గేట్ నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పాటు ఆవరణ పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు పాఠశాల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంతంలోని పాత పాఠశాల భవనం పునరుద్ధరణ పనులను కూడా పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై జిల్లా విద్యాశాఖాధికారిని (డీఈఓ) అడిగి తెలుసుకున్నారు. రెనోవేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ),ఎ ఎం ఓ ఉండ్రాతి సుజన్ తేజ,వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ , ఇంజినీరింగ్ అధికారులు, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 31 (జనంసాక్షి):** జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత నది వరద పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి నదిలో నీటి మట్టం, వరద ప్రవాహం, భద్రతా చర్యలు, భవిష్యత్ పరిస్థితులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాణహిత నదిలో నీటి మట్టం 146.65 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని, దిగువకు 7.75 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వెళుతుందని, ఎగువ ప్రాంతాల నుండి సుమారు 12 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ఆందోళనకర పరిస్థితులు లేవని, వరద ప్రవాహం మరింత పెరిగినప్పటికీ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం లేదని, అయినప్పటికీ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నది ఒడ్డు, చెక్‌డ్యాంలు, వాగులు, వంతెనల వద్దకు సరదాగా వెళ్లడం, సెల్ఫీలు దిగడం, ఈత కొట్టేందుకు ప్రయత్నించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని సూచించారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రతిష్ఠాత్మక ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న పనుల పురోగతి వివరాలను ఇరిగేషన్ టెక్నికల్ కన్సల్టెంట్ సత్యానంద్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులు నాణ్యతతో, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగవంతం చేయాలని తెలిపారు. పంట సాగులో నాట్ల పరిస్థితిని రైతు కూలీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మెరుపులు, ఉరుములు, వరద ప్రవాహాలు ఉన్న సమయంలో పొలాలలో పని చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పత్తి, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో కొందరు రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ వరితో పాటు పత్తి, మిరప తదితర పంటలను సాగు చేస్తున్నారని, ఇలాంటి పంటల మార్పిడి విధానం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులకు పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సిర్పూర్ (టి) మండలం వెంకట్రావుపేట్ వద్ద పెన్‌గంగా నదిపై ఉన్న వంతెన వద్ద వరద పరిస్థితులు, నీటి ప్రవాహంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు వంతెన మార్గంలో ఒక వ్యాన్ నిలిచిపోవడంతో పాటు, ఓవర్‌లోడ్ వాహనాల రాకపోకల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓవర్‌లోడ్ వాహనాల రాకను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన ఆర్చ్‌ను తొలగించడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెన్‌గంగా నదిలో ప్రస్తుతం కొనసాగుతున్న నీటి ప్రవాహంపై విచారించి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వంతెన వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి, వరద ప్రభావిత ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి. వినయ్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, తుమ్మిడి హెట్టి సర్పంచ్ సూరజ్, సంతోష్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఉండాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




**హనుమకొండ ప్రతినిధి జులై 31 (జనంసాక్షి) :** రానున్న ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సమన్వయ సమావేశంలో కలెక్టర్ ఏర్పాట్లపై శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహణ ఏర్పాట్లపై ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకల ప్రాంగణంలో ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, విశిష్ట అతిథులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు సౌకర్యవంతంగా పాల్గొనేలా కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేదిక, జాతీయ పతాకావిష్కరణ, పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆకర్షణీయమైన ప్రదర్శన శకటాలు (టేబ్లోలు), అవగాహన స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి శాఖ తమ విభాగం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల ఫలితాలు ప్రతిబింబించేలా శకటాలు, ప్రదర్శనలు రూపొందించాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, జిల్లా అదనపు కలెక్టర్ రవి, ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, హనుమకొండ ఆర్డిఓ వెంకటేష్, డిఆర్డిఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు ముందస్తు చర్యలతో సన్నద్ధంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జులై 31 (జనంసాక్షి) :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద నీటితో నీటిమట్టం వేగంగా పెరుగుతున్నందున అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు చేపల వేట, ఈత వంటి కార్యకలాపాల కోసం నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని, అత్యవసర పరిస్థితులు మినహా రానున్న రెండు, మూడు రోజుల పాటు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1800-425-7109కు సమాచారం అందించాలని సూచించారు. 24/7 టోల్ ఫ్రీ నెంబర్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపడతారని పేర్కొన్నారు. మండల, జిల్లా, గ్రామ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నదిలో నీటిమట్టం వేగంగా పెరుగుతున్నందున అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి రామన్నగూడెం వద్ద గోదావరి నీటిమట్టం 75.47 అడుగులు (16.97 మీటర్లు) నమోదైంది. ప్రస్తుతం ఉన్న ప్రవాహ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గోదావరి పరివాహక ప్రాంతాల్లోని కన్నాయిగూడెం, ఏటూరు నాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు మధ్యాహ్నం 2 గంటల వరకు 14,03,500 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, అంతే పరిమాణంలో నీటిని స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ ఫ్రీ ఫ్లో పరిస్థితిలో ఉందని తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో జంపన్నవాగు, ఇతర వాగులు, లోతట్టు ప్రాంతాల్లో బ్యాక్‌వాటర్ ప్రభావం ఏర్పడే అవకాశం ఉన్నందున గతంలో ముంపునకు గురైన గ్రామాలు, ఆవాసాలు, ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని, రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల, పంచాయతీరాజ్, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

# వర్షాలకు కూలిన ఇండ్లు





**దస్తురాబాద్, జూలై 31 (జనంసాక్షి):** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రానికి చెందిన గంప భారతి ఇల్లు కూలిపోయిందని ఆమె తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజులనుండి కురుస్తున్న వర్షాలకు పాత ఇల్లు కావడంతో ఇంటికి ఒక వైపు భాగం వానకు తడిసి గోడ కూలిపోయిందని ఆమె తెలిపారు. గోడ కూలిపోయే సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం ఏమి జరగలేదని ఆమె అన్నారు. అయితే పాత ఇల్లు కావడంతో జాగ్రత్త గానే ఉన్నామని అందులో ఉన్న సామాగ్రి మాత్రం పాడైపోయిందని ఆమె అన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ కనక యాదవరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు అప్రమత్తం గా ఉండాలని, పాత ఇళ్లలో ఉండవద్దని ఆయన సూచించారు.

**సారంగాపూర్, జూలై 31(జనం సాక్షి) :** సారంగాపూర్ మండలం సోనాపూర్ గ్రామం హర్కై తాండ లో జాదవ్ సుజాత భర్త కృష్ణ రేకుల ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఉన్నటువంటి ధాన్యం బస్తాలు మరి ఇతర వస్తువులు వర్షంలో తడిసి ముద్దయ్యాయి జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆదుకోవాలని నిరుపేద కుటుంబం వేడుకున్నారు.

**కడెం, జులై 31 (జనం సాక్షి) :** కడెం మండలంలోని (బెల్లాల్) మొర్రిగూడెం గ్రామంలో గ్రామసుడు సత్యనారాయణకు చెందిన ఇల్లు గురువారం రోజు రాత్రి సమయంలో కూలిపోయింది. ప్రమాదాన్ని గ్రహించిన కుటుంబ సభ్యులు ముందుగానే బయటకు వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇల్లు కూలడంతో ఇంట్లో ఉన్న అవసర నిమిత్తం వస్తువులు బీరువా, టీవీ, ఫ్రిడ్జ్, ఇంట్లో ఉన్న సంబంధిత పరికర వస్తువులు ధ్వంసమై భారీ ఆస్తి నష్టం జరిగింది. దీంతో బాధిత కుటుంబాన్ని సంబంధిత ప్రభుత్వా అధికారులు, నాయకులు స్పందించి తక్షణ ఆర్థిక సాయం అందించాలని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని బాధితులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియలో పరకాలకు రాష్ట్రంలో ద్వితీయ స్థానం

**పరకాల, జులై 31 (జనం సాక్షి):** ఎస్ఐఆర్ ప్రక్రియలో 100% విజయవంతంగా పూర్తి చేయడంలో విశేష కృషి చేసిన పరకాల ఆర్డీవో డిఎస్ వెంకన్న ను బీజేపీ పరకాల పట్టణ శాఖ తరపున పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ జయంతి లాల్‌తో పాటు పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయికి విద్యార్థినుల ఎంపిక



**వరంగల్ ఈస్ట్, జూలై 31 (జనం సాక్షి) :** హనుమకొండ తూర్పు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళలు) ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు "నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమం సందర్భంగా వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో గ్రూప్ డ్యాన్స్, స్కిట్ విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించి, రాబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అధ్యాపకులు విజేత విద్యార్థినులను అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి కళాశాలకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఫోన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుద్ఘాతం

- వ్యక్తి మృతి



**గోవిందరావుపేట, జులై31 (జనంసాక్షి) :** గురువారం రాత్రి సుమారు 10:30 గంటల సమయాన మొబైల్ ఛార్జింగ్ పెట్టబోయి విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుస్సాపురం గ్రామ పంచాయతీ పరిధిలో నివసిస్తున్న పాలెం రవి, వయస్సు 46 సంవత్సరాలు నిద్రించే సమయం ముందు మొబైల్ ఫోను ఛార్జింగ్ పెట్టే ప్రయత్నంలో పక్కనే ఉన్న కరెంటు తీగ ను గమనించకపోవడం వలన విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలాడు. భార్య, ఇరుగు పొరుగువారు కుప్పకూలిన రవి ని గమనించి వెంటనే 108 ద్వారా ములుగు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే సమయానికి వ్యక్తి మృతి చెందిన నాడు అని డాక్టర్లు ధ్రువీకరించినారు. మృతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు. రెక్కాడితేనే డొక్కాడే కటిగా పేద కుటుంబం కాబట్టి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. పాలెం రవి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
01 ఆగస్ట్ 2026

# గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

**రెండు కిలోల గంజాయి, ఒక బైక్ స్వాధీనం**



**కోదాడ (జనంసాక్షి) :** కోదాడ పట్టణ శివారులోని దుర్గాపురం స్టేజీ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులుచాకచక్యంగా పట్టుకున్నారు. మరొ వ్యక్తి పరారీలో ఉన్నారు. నిందితుల నుండి 2 కిలోల గంజాయి,ఒక మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు దుర్గాపురం స్టేజీ వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా మరియు తనిఖీలు నిర్వహించారు. అక్కడ గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా, వీరికి సహకరించిన మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. కోదాడ ప్రాంతంలో మత్తు పదార్థాలు రవాణా చేసిన, విక్రయించిన వారిపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మాదక ద్రవ్యాల వ్యవస్థపై ఉక్కు పాదంతో అణిచివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పట్టణ సీఐ శివశంకర్, ఎస్సై అజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దూదేకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ఖమ్మం, (జనంసాక్షి) :** దూదేకుల ముస్లిం మైనార్టీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, తగిన న్యాయం జరిగేలా చూస్తానని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో 'నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం' రాష్ట్ర అధ్యక్షుడు, దూదేకుల సంఘం 2016 జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సయ్యద్ బాషా ఆధ్వర్యంలో నాయకులు ఆయనను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దూదేకుల వర్గానికి జరుగుతున్న అన్యాయాలను నివారించాలని, సమాజ సంక్షేమానికి ప్రత్యేకంగా దూదేకుల కార్పొరేషన్ సహా ఆత్మగౌరవ భవనాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. జేఏసీ అధ్యక్షుడు బాబు జానీ, తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, సీనియర్ నాయకుడు అంకుష్‌లతో చర్చించి, వారి సలహాలు-సూచనల మేరకు ఈ వినతిపత్రాన్ని అందించినట్లు నాయకులు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గతంలోనూ పలు బీసీ సమావేశాల్లో ఈ అంశాలు తన దృష్టికి వచ్చాయని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం తరపున సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# బీబీనగర్ ఎయిమ్స్ భవన నిర్మాణాల్లో జాప్యం

**ప్రజలకు అందుబాటులోకి రాని పూర్తి స్థాయి వైద్య సేవలు నిర్మాణ పనులు పూర్తయితే తప్ప భర్తీ కానీ డాక్టర్, ఫ్యాకల్టీ పోస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు**

**బీబీనగర్ (జనంసాక్షి) :** బీబీనగర్‌లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను అత్యుత్తమ వైద్య సంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 1000 కోట్ల పైచిలుకు నిధులు కేటాయించినప్పటికీ గడువు లోపు భవన నిర్మాణ పనులు జరగకపోవడంతో ప్రజలకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రావడం లేదు. మౌలిక వసతుల కొరత, నిర్మాణాల జాప్యం, అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది కొరతతో ఎయిమ్స్‌లో ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం శాశ్వత భవనాల నిర్మాణాలు కొనసాగుతుండగా, పలు వైద్య విభాగాలు పరిమిత వసతులతోనే కొనసాగుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరించాల్సిన అవసరం ఉన్నా భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది వైద్య సేవలతో పాటు వైద్య విద్యా కార్యక్రమాలు కూడా విస్తరిస్తున్నప్పటికీ, అవసరమైన సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. 201 ఎకరాల విస్తీర్ణంలో గల ఎయిమ్స్ క్యాంపస్ లో 750 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతుండగా 10 నుంచి 15 బెడ్లు మాత్రమే ఎమర్జెన్సీ సేవలకు అందుబాటులో ఉంచగా 100 బెడ్లకు పైగా ఇన్ పేషంట్ సేవలకు అందుబాటులో ఉన్నాయి.



**పెరుగుతున్న రోగుల సంఖ్య :** ఎయిమ్స్ ప్రారంభమైనప్పటి నుంచి ఓపీ సేవలు గణనీయంగా పెరిగాయి. 2020-21లో 7,116 మంది మాత్రమే ఓపీ సేవలు పొందగా, 2025--26 నాటికి 5,09,299 మంది సేవలు పొందారు. ఇప్పటివరకు మొత్తం 16,83,121 మందికి పైగా ఓపీ సేవలు అందించగా, సగటున రోజుకు 1,800 మందికిపైగా రోగులు వస్తున్నారు. 1,53,408 మంది ఇన్‌పేషెంట్లు వైద్య సేవలు పొందారు. 2019--20లో 2,665 ఇన్‌పేషెంట్లు ఉండగా, 2025--26 నాటికి 10,44,167 మంది వైద్య సేవలు పొందారు . తెలంగాణ రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా రోగులు ఎయిమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. కానీ ఎయిమ్స్‌కు వస్తున్న రోగులకు అనుగుణంగా వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు వెనుతిరిగే పరిస్థితి ఏర్పడుతుంది. సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఒకరిద్దరు మాత్రమే డాక్టర్లు ఉండడం, 183 ఫ్యాకల్టీ పోస్టులకు 131 పోస్టులు మాత్రమే భర్తీ కాగా 181 సీనియర్ రెసిడెన్ట్ పోస్టులకు 100 భర్తీ కావడంతో తీవ్రంగా వైద్య సిబ్బంది కొరత ఏర్పడింది దీంతో అత్యవసర సేవల కోసం వచ్చిన రోగులకు వైద్యం అందని పరిస్థితి. దీంతో రోగులు తిరిగి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది. బిబినగర్ ఎయిమ్స్ కు రోగుల తాకిడి రోజురోజుకు పెరిగిపోతూ వైద్యులకు పని భారం పెరుగుతుంది . భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే వైద్యుల కొరత తీరడంతో పాటు , ఆధునిక వైద్య సేవలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. తద్వారా ప్రజలకు ఉచిత కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తే ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడదు. కానీ ఎయిమ్స్ లో భవన సముదాయాలు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవు. దీంతో ఎయిమ్స్ లోని పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది డాక్టర్లు ఫ్యాకల్టీ నియామకాలు ఆలస్యంగా జరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం 2026 లోపు పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు జరగాలని నిర్మాణ సంస్థను ఆదేశించింది. ఎయిమ్స్ మాస్టర్ ప్లాన్ ప్రకారం 2025 లోపే పూర్తి కావాల్సిన నిర్మాణాలు కార్మికుల కొరత కారణంగా ముందుకు సాగడం లేదని సంబంధిత నిర్మాణ సంస్థ గడువు పెంచుకుంటూ వస్తుంది. దీంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండగా రోగులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

# పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని పెంచాలి

**20 వేల పోలీస్ నియమకాలు నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని**

**భద్రాచలంలో ఫ్లకార్డులతో నిరసన తెలిపిన నిరుద్యోగ యువత**

**భద్రాచలం జూలై 31 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంటు భర్తీ నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భద్రాచలంలో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్ల నిరుద్యోగ యువత ముత్తవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ యూనిఫామ్ సర్వీసులకు మరో 4 సంవత్సరాల వయోపరిమితి సడలింపు కల్పించాలని అన్నారు. గత నాలుగేళ్లుగా ఏడు సంవత్సరాల వయస్సు సడలింపు కలిగి ఉంది, కానీ గత 4 ఏళ్లుగా ఎటువంటి పోలీస్ నోటిఫికేషన్ లేకపోవడం వలన దాదాపు మూడు లక్షల మంది అభ్యర్థులకు నష్టం జరిగిందని వారు తెలిపారు. అదేవిధంగా ఎస్సై అభ్యర్థుల వయా పరిమితి 37 సంవత్సరాలకు పెంచాలని అలాగే 20 వేల పోలీసుల నియామకం



నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూకల కిరణ్, కంచు చెన్నకేశవ, కోటేష్, కొప్పుల నాగరాజు, రామకృష్ణ వేణు, గణేష్ సాయిబాబు నిరుద్యోగ మహిళలు పాల్గొన్నారు.

# ఖమ్మం కలెక్టరేట్ ముందు విద్యార్థుల ఆందోళన




**ఖమ్మం కార్పొరేషన్ జూలై 31 (జనంసాక్షి) :** పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నిధులను విడుదల చేయాలనిప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వందలాదిమంది విద్యార్థులతో ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి జరిగింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జి మస్తాన్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్మెంట్స్ గా స్కాలర్షిప్లను వెంటనే ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ నిధులు విడుదల కాక లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ఒకవైపు పిజి ,పి హెచ్ డి తదితరు ఉన్నత విద్య నోటిఫికేషన్లు వచ్చాయని కౌన్సిలింగ్ లకు వెళ్లాలంటే ఒరిజినల్ సర్టిఫికెట్స్ లేక విద్యార్థులు ఉన్నత విద్యను కోల్పోతున్నారన్నారు. ఫ్యూచర్ సిటీలకు, రాష్ట్రంలో ఉన్న గుడులకు చర్చిలకు మసీదులకు కోట్ల రూపాయలను వెచ్చిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు నిధులను విడుదల చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని వహిస్తుందన్నారు. మంత్రులకు ఎమ్మెల్యేలకు పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చిల్లిగవ్వ ఇవ్వడం లేదని వాపోయారు. విద్యార్థుల అకౌంట్స్ లోనే రియంబర్స్మెంట్ వేస్తామని చెప్పడం వల్ల ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ముందే ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని దీంతో తీవ్రమైన ఆర్థిక భారానికి విద్యార్థులు గురవుతున్నారని అన్నారు. ఒకవైపు యాజమాన్యాలకు కోట్ల రూపాయల బాకీ ఉండి నేడు విద్యార్థులకు ఇస్తామని చెప్పడం ద్వారా ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అనుమానాన్ని వ్యక్తం చేశారు. జీవో లతో సంబంధం లేకుండా పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను, 200 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల ప్రతిఘటన రాష్ట్ర ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో. పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షురాలు ఈశ్వరి, ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్, యశ్వంత్, రాము, శ్రీకాంత్, ఉదయ్ కిరణ్, చైతు, వినోద్, రాజశేఖర్, చందు సంజయ్, వినోద్, వెంకటేష్ గాంధీ పాల్గొన్నారు.

# భద్రగిరి మార్ట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులు అద్భుతం

## సుకుమా జిల్లా ఎస్పీ వివేక్

**భద్రాచలం జూలై 31 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడవులలో దొరికే అటవీ ఉత్పత్తులు, సేంద్రియ ఆర్గానిక్ ఉత్పత్తులు, ఎస్ హెచ్ జి గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఎంతో దూర దృష్టితో భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ కృషితో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ చాలా అద్భుతంగా ఉందని చత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా ఎస్పీ వివేక్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని భద్రగిరి మార్ట్ ను సుకుమా జిల్లా ఎస్పీ తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి మార్ట్ లోని అటవీ ఉత్పత్తులను పరిశీలించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన అనేక అటవీ వస్తువులను ఈ మార్టో అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఎస్ హెచ్ జి గిరిజన మహిళలు ఆర్గానిక్ పంటలు పండించే గిరిజన రైతుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ను కల్పించడంతోపాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయంతో ఏర్పాటు చేసిన ఈ మార్టు చాలా బాగుందన్నారు. భద్రగిరి మార్ట్? లో అందుబాటులో ఉంచిన గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు, వారి ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడం, అలాగే వారి జీవనోపాధిని మెరుగుపరచడం కోసం కృషిచేసిన ఐటీడీఏ అధికారులకు ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజర్ జయరాజ్, సిబ్బంది ఝాన్సీ లక్ష్మి, భూదేవి, రమ్య, భవ్య, శశికళ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలకు వసతులు కరువాయేనా!

- తాగునీరు లేక విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్న వైనం
- మరుగుదొడ్డి నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్!




**అన్నపురెడ్డిపల్లి, జూలై 31 (జనం సాక్షి) :** అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంకటాపురం సీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల అంకితభావంతో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నప్పటికీ, కనీస మౌలిక సదుపాయాల కొరత విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులు కల్పించాల్సిన తరుణంలో ఈ పాఠశాల సమస్యలు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 20 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే గ్రామ వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే నీరు పాఠశాల ఆవరణలో నిల్వ ఉండటంతో గడ్డి పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో విద్యార్థులు బయటకు రావడానికి, ఆటలు ఆడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు ఆటస్థలం లేకపోవడం వల్ల చిన్నారులు క్రీడలు, శారీరక వ్యాయామానికి దూరమవుతున్నారు. అదేవిధంగా పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడం విద్యార్థుల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు కొత్త మరుగుదొడ్డి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు గడ్డి నిలిచే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, ఆటస్థలం ఏర్పాటు, ప్రహరీ గోడ నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి పనులను తక్షణమే పూర్తి చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్థులు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

# 154 శాతం ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా




**మణుగూరు, జూలై 31 (జనంసాక్షి):** జూలై నెలలో తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల బొగ్గు ప్రతి పెరిగిందని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పేర్కొన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఉత్పత్తి ఉత్పాదకరపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... జూలై నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 6 లక్షల 48 వేల 500 టన్నులకు గాను 10 లక్షల 01 వేల 059 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడమైనది. జూలై నెలలో సాధించిన ఉత్పత్తి 154 శాతం. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 31 జూలై, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 32 లక్షల 62 వేల టన్నుల లక్ష్యానికి గాను 42 లక్షల 41 వేల 735 టన్నులు సాధించడం జరిగింది అనగా 132 శాతం సాధించడం జరిగింది.జూలై నెలలో మణుగూరు ఏరియా 10 లక్షల 02 వేల 059 టన్నులను రవాణా చేయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 31 జూలై, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ గా 43 లక్షల 03 వేల 844 టన్నులు రవాణా చేయడం జరిగింది.జూలై నెలలో ఓవర్ బర్డెన్ మన డిపార్ట్ మెంటల్ గా 09 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 84 శాతం తో 7 లక్షల 56 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 31 జూలై, 2026 వరకు 44 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 34 లక్షల 12 వేల క్యూబిక్ మీటర్ల అనగా 78 శాతం తీయడం జరిగింది. పదవి విరమణ/మెడికల్ డెత్ అయిన ఉద్యోగులకు ఈ క్రింది విధంగా చెల్లింపులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్టు టీఎం డి వెంకట రామారావు , ఏటిఎం (ఐఈడి) సిహెచ్.రాంబాబు , ఏజిఎం(పర్సనల్) ఎస్. రమేష్ , పీకే ఓసి 4 ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, "ఏటా ఎంపిసి నిజిఓన్ జీడిన ఈ ఈ. ఈ. శ్రీనివాస్, శ్రీనివాస్, డిటిఎం(సర్వే) ఎల్. దయాకర్ , డివై, సీఎంఒ డా. జ్యోతిర్మాయి, సీనియర్ ఎస్టేట్స్ అధికారిని కె. స్వప్న , పర్యావరణ అధికారి జె. శ్రీనివాస్ రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్ , డివై. పిఎం బి. శ్యామ్ ప్రసాద్, ఎక్సిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బచ్చోడు తండాలో డెంగ్యూ కలకలం..!

## రెండు రోజుల్లో రెండు కేసులు నమోదు



**తిరుమలాయపాలెం, జూలై 31 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు తండా గ్రామపంచాయతీలో డెంగ్యూ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. గత రెండు రోజుల క్రితం ఒక డెంగ్యూ కేసు నమోదు కాగా, ఈరోజు గ్రామంలో నిర్వహించిన రక్త నమూనాల సేకరణలో మరో డెంగ్యూ కేసు వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, హెల్త్ వర్కర్లు వెంటనే అప్రమత్తమై గ్రామంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించడం, రక్త నమూనాలు తీసుకోవడం, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డెంగ్యూ వ్యాప్తి చెందకుండా గ్రామస్థులు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను తొలగించాలని, జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు. "పరిశుభ్రమైన పరిసరాలే డెంగ్యూకు శాశ్వత నివారణ" అని ఆరోగ్య శాఖ అధికారులు గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి

**వరద ఉధృతిని క్షేత్రస్థాయిలో పరిశీలన**

**జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్**



**భద్రాచలం జూలై 31 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి వరద పెరిగిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులు ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజ్ పేర్కొన్నారు. భద్రాచలం వద్ద గోదావరి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం భద్రాచలం వద్ద గోదావరి వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదట విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ వద్ద వరద నీటి పారుదల పరిస్థితి, మోటార్ల పనితీరును ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీరు వేగంగా బయటకు వెళ్లేలా మోటార్లను నిరంతరం నిర్వహించాలని, ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం కరకట్టపై నుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్, స్నానఘాట్ల వద్ద పరిస్థితిని సమీక్షించారు. గోదావరిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను అనుమతించ రాదని, ప్రమాద ప్రాంతాల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై గోదావరి వరద నీరు ఎక్కడ వరకు చేరిందనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , భద్రాచలం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం వేగంగా పెరుగుతోందన్నారు. శుక్రవారం గోదావరి నీటిమట్టం 48.00 అడుగులకు చేరుకోవడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 11,44,645 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోందని, నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించేలా అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు.

# డిజిటలైజేషన్ తర్వాత కోదాడను మోడల్ కోర్టుగా ఎంపిక చేస్తాం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద



**కోదాడ టౌన్ జూలై 31 (జనంసాక్షి) :** కోర్టు ఫైళ్ల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యాక కోదాడను మోడల్ కోర్టుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద అన్నారు. శనివారం కోదాడలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను ఒకటవ అదనపు జిల్లా జడ్జి శివరాం ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. భవన నిర్మాణ పురోగతిని పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. కోర్టు హాల్లో జరిగిన సమావేశంలో సబ్ జడ్జి సురేష్,ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడాతు కోదాడలో కోర్టు భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటు లోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల డిజిటలైజేషన్ వేగవంతం చేసి, వ్యాజ్యదారులకు సత్వర న్యాయం అందించేలా కోదాడ కోర్టును ఆదర్శంగా నిలుపుతామన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ,జాయింట్ సెక్రటరీ జానీ పాషా, మహిళా ప్రతినిధులు ధనలక్ష్మి,హేమలత,దుర్గ, సీనియర్ న్యాయవాదులు సుధాకర్ రెడ్డి,ఎస్ ఆర్ కే మూర్తి, దేవపత్తిని నాగార్జున,పాలేటి నాగేశ్వరరావు,నాగు బండి కృష్ణమూర్తి,యడ్లపల్లి వెంకటేశ్వర్లు,చింతకుంట్ల రామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సీతారామరాజు, చలం,నాగుల్ పాషా పాల్గొన్నారు.




## ఆగస్టులో అదిరిపోయే స్మార్ట్‌ఫోన్స్..

**న్యూఢిల్లీ:**కొత్త స్మార్ట్‌ఫోన్ కొనాలనుకుంటున్నారా? అయితే, ఆగండి. మిమ్మల్ని అలరించేందుకు ఆగస్టు సిద్ధమవుతోంది. వివిధ రకాల స్మార్ట్‌ఫోన్లతో కంపెనీలు విడుదలకు రెడీ అవుతున్నాయి. ఇందులో గూగుల్ పిక్సెల్ 11 సిరీస్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. దీంతో పాటు వివో, షావోమీ, పోకో నుంచి కూడా పలు ఫోన్లు లాంచ్ కాబోతున్నాయి. ఆ వివరాలు ఇవీ..

గూగుల్ పిక్సెల్ 11 సిరీస్: ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ పిక్సెల్ 11 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేయనుంది. ఆగస్టు 12న ఈ ఫోన్లు తీసుకురానున్నట్లు గూగుల్ ఇప్పటికే ప్రకటించింది. పిక్సెల్ 11, పిక్సెల్ 11 ప్రో, పిక్సెల్ 11 ప్రో పిక్సెల్ 11 ప్రో ఫోల్డ్ మోడళ్లను విడుదల చేసే అవకాశం ఉంది. గూగుల్ కొత్త టెన్సార్ జీ6 చిప్‌సెట్‌తో రానున్నట్లు సమాచారం.



వివో ఎస్2: ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ వివో తన ఎస్ సిరీస్‌ను తిరిగి తీసుకురాబోతుంది. 2019లో ఎస్1 లాంచ్ చేయగా.. కొత్తగా ఎస్2 పేరిట ఆగస్టులో మరో ఫోన్ విడుదల చేయనుంది. విడుదల తేదీని మాత్రం వెల్లడించలేదు. 6.59 అంగుళాల ఓఎల్ఈడీ డిస్‌ప్లే, 7000ఎంఏహెచ్ బ్యాటరీతో రానున్నట్లు టెక్ వర్గాలు పేర్కొన్నాయి.


పోకో ఎం8 పవర్: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ పోకో కూడా ఎం సిరీస్‌లో ఫోన్ లాంచ్ చేయనుంది. పోకో ఎం8 పవర్ పేరిట ఆగస్టు 4న దీన్ని విడుదల చేయనుంది. 8000 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీతో రానున్నట్లు ఇప్పటికే టీజర్ విడుదల చేసింది. మూడు రోజుల వరకు బ్యాటరీ లైఫ్, అమోలెడ్ డిస్‌ప్లే, గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, 50ఎంపీ ప్రధాన కెమెరా ఉండనున్నాయి. 7 అంగుళాల ఓఎల్ఈడీ డిస్‌ప్లే రాబోతున్నట్లు సమాచారం.

రెడ్‌మీ నోట్ 17 5జీ: ప్రముఖ మొబైల్ కంపెనీ షావోమీ రెడ్‌మీ నోట్ 17 మాస్టర్ ఎడిషన్‌ను లాంచ్ చేయనుంది. 8000 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీతో ఆగస్టు 6న ఈ ఫోన్ లాంచ్ కానుంది. 7 అంగుళాల ఓఎల్ఈడీ డిస్‌ప్లే ఉండనున్నట్లు సమాచారం.

ఇవి కూడా..

ఐకూ నుంచి ఐకూ జడ్11 స్మార్ట్‌ఫోన్ ఆగస్టు నెలలోనే రాబోతోంది. దీంతో పాటు శాంసంగ్ నుంచి ఎఫ్ 70 ప్రో, గెలాక్సీ ఏ08 4జీ విడుదల కాబోతున్నట్లు టెక్ వర్గాలు పేర్కొన్నాయి. రెడ్‌మీ నుంచి 17సీ 5జీ, రియల్‌మీ 16ఎక్స్, లావా స్మార్ట్ 4, ఒప్పో కె15 ఆగస్టులోనే పలకరించనున్నాయి. స్మార్ట్‌వాచ్ బ్రాండ్ ఫైర్ బోల్ట్ కూడా ఆగస్టులో కొత్త ఫోన్లను విడుదల చేస్తామని గతంలో ప్రకటించింది. దీంతో ఆ కంపెనీ నుంచి కూడా బడ్జెట్ ఫ్రెండ్లీ స్మార్ట్‌ఫోన్ ఆగస్టులోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

# మూడోరోజూ లాభాలే..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో వరుసగా మూడో రోజూ రాణించాయి. ముఖ్యంగా ఆటో, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. సెన్సెక్స్ 166 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,300 ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 77,998.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,928.15) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు నష్టాల్లోకి జారుకున్న సూచీ.. తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 78,272.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 166.49 పాయింట్ల లాభంతో 78,094.64 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 66.45 పాయింట్ల నష్టంతో 24,383.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.41గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ లాభాల్లో ముగిశాయి. టీసీఎస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్, ఐటీసీ, టెక్ మహీంద్రా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 87 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4055 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.కాగా అంతకుముందు వరుసగా రెండో రోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాంటి బ్లూచిప్ షేర్లు రాణించడం ఇందుకు దోహదం చేసింది. విదేశీ సంస్థాగత మదుపర్లు తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపడం సానుకూలత తెచ్చిపెట్టింది. అయితే స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లు నష్టపోయాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 26 పైసలు పెరిగి 95.50 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.52% పెరిగి 89.22 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సింగపూర్, తైవాన్, దక్షిణ కొరియా, చైనా సూచీలు నష్టాల్లో ముగియగా.. హాంకాంగ్, జపాన్ సూచీలు లాభపడ్డాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.15,000 కోట్లు తగ్గి రూ.483.20 లక్షల కోట్లకు పరిమితమైంది.

ఒడుదొడుకుల మధ్య..

ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,638.86 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో (క్రితం ముగింపు 77,655) ఆరంభమైంది. మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య కదలాడింది. చివరకు 273.55 పాయింట్ల లాభంతో 77,928.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 66.95 పాయింట్లు పెరిగి 24,317.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,187.10 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 24,342.95 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది.

సగం అటు.. సగం ఇటు..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో సగం లాభాల్లో.. సగం నష్టాల్లో ముగిశాయి. మారుతీ సుజుకీ 1.77%, ఎంఅండ్ఎం 1.73%, టెక్ మహీంద్రా 1.49%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.44%, ఎస్‌బీఐ 1.22%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.06%, పవర్‌గ్రిడ్ 1.04% చొప్పున లాభపడ్డాయి. అదానీపోర్ట్స్ 3.26%, ఇండిగో 0.87%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.83%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 0.74%, యాక్సిస్ బ్యాంక్ 0.57% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో వాహన, ఇంధనం, చమురు- గ్యాస్, లోహాలు రాణించగా.. స్థిరాస్తి, సేవలు, బీమా, భారీ యంత్రపరికరాలు, ఇండస్ట్రియల్స్, కమొడిటీస్ డీలాపడ్డాయి.

మణిపాల్ హెల్త్ ఐపీఓ రెండో రోజుకు 45% స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలోనూ 45% దరఖాస్తులే వచ్చాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీరేట్లలో మార్పులేదు: బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఈ ఏడాది వరసగా అయిదో సమీక్షలోనూ, కీలక రేట్లలో మార్పు చేయకుండా 3.75 శాతంగా కొనసాగించింది. ఏప్రిల్- జూన్‌లో అమెరికా ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 1.5 శాతంగా నమోదైంది. దిగుమతులు పెరగడం ప్రభావం చూపింది. జులై 25తో ముగిసిన వారంలో నిరుద్యోగ ప్రయోజనాల కోసం దరఖాస్తులు 9,000 పెరిగి 1,97,000కి చేరాయి. లేఆఫ్‌లు కూడా అతి తక్కువగానే ఉన్నాయి.

లిస్టింగ్ మెరుపులు...

లోహియా కార్ప్ లిమిటెడ్ షేరు, ఇష్యూ ధర రూ.425తో పోలిస్తే బీఎస్ఈలో ట్రేడింగ్ 8.23% అధికంగా రూ.460 వద్ద ప్రారంభమైంది. చివరకు 16.38% లాభంతో రూ.494.65 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.5,225.98 కోట్లుగా నమోదైంది. ఇండో ఎంఐఎం లిమిటెడ్ కంపెనీ షేరు, ఇష్యూ ధర రూ.485తో పోలిస్తే బీఎస్ఈలో 44.94% అధికంగా రూ.703 వద్ద ట్రేడింగ్ ఆరంభమై, చివరకు 52.94% లాభంతో రూ.741.80 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.36,680.59 కోట్లుగా నమోదైంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,54,236 (22 క్యారెట్లు) | ₹ 1,67,180 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,40,000

## కోస్పి దూకుడు.. శాంసంగ్, హైనిక్స్ జంప్



**న్యూఢిల్లీ:**దక్షిణకొరియా సూచీ కోస్పి భారీగా పుంజుకొంది. వరుసగా మూడు రోజుల పాటు నష్టాలు చవిచూసిన సూచీ.. శుక్రవారం పైకెగిసింది. దాదాపు 18 శాతం మేర లాభపడింది. ఒక్కరోజులో ఈ స్థాయిలో లాభపడి సరికొత్త రికార్డు సృష్టించింది. దాదాపు 17.91 శాతం లాభంతో.. వెయ్యికి పైగా పాయింట్లు ఎగబాకి 6,595.45 వద్ద ట్రేడవుతోంది. దక్షిణకొరియాకు చెందిన ప్రధాన కంపెనీలైన ఎస్‌కే హైనిక్స్, శాంసంగ్ షేర్లు కూడా 23 శాతానికి పైగా రాణించడం గమనార్హం.

కారణాలు ఇవీ..

అమెరికా మార్కెట్లు నిన్న లాభాల్లో ముగియడం ఆసియా మార్కెట్లలో కొత్త ఉత్సాహం నింపింది. ముఖ్యంగా టెక్నాలజీ, చిప్ స్టాక్స్ రాణించడం కోస్పికి కలిసొచ్చింది. దీనికితోడు అమెజాన్ మెరుగైన త్రైమాసిక ఫలితాలు ప్రకటించడం ఆసియా మార్కెట్లలో పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీ కండక్టర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కోస్పికి కలిసొచ్చింది. దక్షిణకొరియాకు చెందిన ప్రధాన కంపెనీలైన ఎస్‌కే హైనిక్స్, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ 23 శాతం చొప్పున రాణించాయి. తైవాన్ సెమీకండక్టర్ మానుఫ్యాక్చరింగ్ కంపెనీ కూడా 10 శాతానికి పైగా రాణించడంతో కోస్పి దూసుకెళ్లింది.గత కొన్ని రోజులుగా కోస్పి దాదాపు 17 శాతానికి పైగా పతనమైంది. దీంతో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు దిగడమూ దక్షిణ కొరియా సూచీ రాణించడానికి మరో ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సైతం లాభాల్లో ట్రేడవుతున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి సెన్సెక్స్ 313 పాయింట్ల లాభంతో 78,241.25 వద్ద, 100 పాయింట్ల లాభంతో నిఫ్టీ 24,417 వద్ద కొనసాగుతోంది.

# చరిత్ర సృష్టించిన మైక్రోసాఫ్ట్..

### ఒక్కరోజే రూ.42లక్షల కోట్లు పెరిగిన సంపద




**న్యూఢిల్లీ:**టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్లలో చరిత్ర సృష్టించింది. కనీవిని ఎరుగని రీతిలో ఈ కంపెనీ మార్కెట్ విలువ కేవలం ఒక్క రోజే 450 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.42లక్షల కోట్లకు పైమాటే) పెరిగింది. గురువారం నాటి (అమెరికా కాలమానం ప్రకారం) ట్రేడింగ్‌లో మైక్రోసాఫ్ట్ షేర్లు రికార్డు స్థాయిలో 16శాతం పెరిగాయి. దీంతో భారీగా సంపద సృష్టి జరిగింది.ఒక కంపెనీ మార్కెట్ విలువ కేవలం ఒక్క రోజులో ఈ స్థాయిలో పెరగడం అమెరికా స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. గతేడాది ఏప్రిల్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచదేశాలపై విధించిన టారిఫ్‌లను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో ఎన్విడియా షేర్లు నాడు భారీగా పెరిగాయి. దాంతో ఈ చిప్ కంపెనీ మార్కెట్ విలువ ఒక ట్రేడింగ్ సెషన్‌లో 440 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. ఇప్పుడు దీన్ని మైక్రోసాఫ్ట్ అధిగమించి.. సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ భారీ లాభంతో టెక్ దిగ్గజం మార్కెట్ విలువ 3.35 ట్రిలియన్ డాలర్లకు చేరింది.మైక్రోసాఫ్ట్ బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. అజ్యూర్ క్లౌడ్ విభాగ ఆదాయం అంచనాలకు మించి 43శాతం వృద్ధి నమోదుచేసినట్లు వెల్లడించింది. ఇక, తమ ఏఐ అసిస్టెంట్ మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్‌కు విశేష ఆదరణ లభిస్తోందని, దీని యూజర్ల సంఖ్య 3 కోట్లు దాటిందని తెలిపింది. దీంతో ఈ కంపెనీ షేర్లు దాదాపు 16శాతం లాభంతో రాణించాయి. షేరు విలువ ఒక రోజులో ఈ స్థాయిలో పెరగడం 2008 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం.మరోవైపు, అటు మెటా షేర్లు 8శాతం మేర కుంగాయి. ఈ కంపెనీ త్రైమాసిక ఫలితాల అంచనాలు మదుపర్లను నిరాశపర్చాయి. మరోవైపు, ఏఐలో మెటా పెట్టుబడులు పెరుగుతుండటం కూడా షేరు విలువపై ప్రభావం చూపించింది. దీంతో వరుసగా 11 రోజు మెటా షేర్లు పతనమయ్యాయి.

## ఫ్లిప్‌కార్ట్ వినియోగదారులకు నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్ ఫ్రీ!


ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్.. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌తో జట్టు కట్టింది. తన ప్లస్ లాయల్టీ మెంబర్లకు నెట్‌ఫ్లిక్స్ మొబైల్‌ప్లాన్‌ను ఉచితంగా అందించనుంది. నెలవారీ షాపింగ్ ఆధారంగా ఈ రివార్డును ఇవ్వనుంది. ఆగస్టు 1 నుంచి కొత్త రివార్డు ప్రోగ్రామ్‌ను ప్రారంభించనుంది. ఒక క్యాలెండర్ నెలలో నాలుగు సార్లు రూ.299, లేదా అంతకంటే ఎక్కువ మొత్తం షాపింగ్ చేసిన వినియోగదారులకు ఈ మొబైల్ ప్లాన్ ఉచితంగా లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, ఫ్లిప్‌కార్ట్ గ్రాసరీ, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో ఆర్డర్లకు ఇది వర్తిస్తుంది. నాలుగో ఆర్డర్ పూర్తయిన నాటి నుంచి 30 రోజుల పాటు మొబైల్ ప్లాన్ చెల్లుబాటు అవుతుంది. ఆ తదుపరి నెల కూడా నిర్ణీత ఆర్డర్ల విలువ దాటగానే నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్‌ను అన్‌లాక్ చేయొచ్చు. ప్రతి నెలా 4 ఆర్డర్లు పూర్తి చేయడం ద్వారా ఈ ప్రయోజనాన్ని ఉచితంగా కొనసాగించొచ్చు. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ సభ్యులు కానివారూ ఈ ప్రయోజనాన్ని పొందొచ్చు. ఇందుకోసం 12 నెలల వ్యవధిలో 15 ఆర్డర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడే ప్లస్ మెంబర్‌షిప్‌కి అర్హత సాధిస్తారు. అయితే, మొబైల్ ప్లాన్‌లో ఒక మొబైల్/టాబ్లెట్‌లో ఏదో ఒకదాంట్లో మాత్రమే చూసేందుకు వీలవుతుంది. టీవీ లేదా ఇతర ప్లాన్‌లకు అప్‌గ్రేడ్ చేయడానికి కుదరదు.




## మా ఏఐ మోడల్.. 3 కంపెనీలను హ్యాక్ చేసింది: ఆంత్రోపిక్

**న్యూఢిల్లీ:**క్లాడ్ చాట్‌బాట్ సృష్టికర్త, ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆంత్రోపిక్ సంచలన విషయాన్ని బయటపెట్టింది. టెస్టింగ్ దశలో ఉన్న తమ ఏఐ మోడళ్లు పొరపాటున మూడు ఇతర కంపెనీల నెట్‌వర్క్‌లలోకి ప్రవేశించి హ్యాక్ చేశాయని ప్రకటించింది. తమ ఏఐ వ్యవస్థ ఇంకో ఏఐ కంపెనీ మోడల్‌ను హ్యాక్ చేసిందని చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో.. తాము కూడా అప్రమత్తమై సైబర్‌సెక్యూరిటీ సమీక్ష చేపట్టినట్లు తెలిపింది. రికార్డులు పరిశీలిస్తుండగా.. ఈ ఏడాది ప్రారంభంలో హ్యాకింగ్ జరిగినట్లు గుర్తించామంది. హ్యాంకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను తాము ఇప్పటికే సంప్రదించామని ఆంత్రోపిక్ వెల్లడించింది. అయితే వాటి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల వాటి మౌలిక సదుపాయాలను క్లాడ్ దెబ్బతీసిందని పేర్కొంది. ఇది దురుద్దేశంతో చేసిన పని కాదని.. ఒక మోడల్ సామర్థ్యం ఏమిటో తెలియాలంటే దానిని విడుదల చేయడానికి ముందు భద్రతా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. ఆ సమయంలో అనుకోకుండా ఈ సైబర్ భద్రత ఘటన చోటుచేసుకున్నట్లు వివరించింది. దీంతో అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు ఏర్పడవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## స్టీరింగ్ వీల్ లేకుండానే రోబో ట్యాక్సీలు..ఎక్కడంటే..?



మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక అభివృద్ధి చెందుతోంది. అమెరికాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రైవర్ లెస్ ట్యాక్సీ కార్లు రోడ్లపై దూసుకెళ్తున్నాయి. ఇప్పుడు స్టీరింగ్ వీల్ లేకుండానే రయ్ రయ్ మంటూ దూసుకెళ్లే రోబో ట్యాక్సీలు ప్రపంచంలోనే తొలిసారిగా అగ్రరాజ్యంలో తిరగనున్నాయి. అమెజాన్ అనుబంధ సంస్థ 'జూక్స్' పూర్తి అటానమస్ కారు వాణిజ్య వినియోగానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో ఆ సంస్థ ఛార్జీలు వసూలు చేసుకునేలా అమెరికా ఫెడరల్ రెగ్యులేటర్లు అనుమతినిచ్చారు. ప్రయోగాత్మకంగా 'జూక్స్' గతేడాది నుంచి లాస్ వెగాస్, శాన్ ఫ్రాన్సిస్కోలలో ఇప్పటికే ఉచిత ప్రయాణాలను అందిస్తోంది. ప్రస్తుత అనుమతులతో ఈ ట్యాక్సీ సర్వీసులకు అధికారికంగా ఆమోదం లభించింది.ఈ రోబోటాక్సీలలో బ్రేక్ పెడల్స్ కూడా లేకుండా అనుమతించే నిబంధనను కూడా నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ గత నెలలో ప్రతిపాదించింది. అయితే దీనికి ఇంకా అనుమతులు రాలేదు. ట్యాక్సీలలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు అనుగుణంగా నిబంధనలు రూపొందిస్తున్నామని ట్రాఫిక్ సేఫ్టీ అధికారి జోనాథన్ మోరిసన్ పేర్కొన్నారు. దానంతట అదే నడిచే రోబోటిక్ వ్యవస్థ ఉన్న వాహనంలో.. స్టీరింగ్ వీల్స్, విండ్‌షీల్డ్ వైపర్స్, సైడ్-వ్యూ మిర్రర్స్ వంటివి అవసరం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**రోబోటాక్సీ భద్రతపై ప్రశ్నలు..**

అయితే రోబోట్యాక్సీలో భద్రత గురించి పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టీరింగ్ వీల్.. ఇతర నియంత్రణ పరికరాలు లేకుండా ట్యాక్సీ పనిచేయాలనే 'జూక్స్' ప్రణాళికపై అడ్వొకేట్స్ ఫర్ హైవే అండ్ ఆటో సేఫ్టీ బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వాహనాలు ప్రయాణికులు, ఇతర వాహనాల భద్రతను దృష్టిలో పెట్టుకొని.. పని చేస్తాయనడానికి సంస్థ తగిన వివరణాత్మక ఆధారాలు చూపించలేదని పేర్కొంది. ఇప్పటికే ఉన్న రోబో ట్యాక్సీలు కొన్నిసార్లు రోడ్డు మధ్యలో ఆగిపోవడం.. పార్కింగ్ నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపింది. దీనిపై జోనాథన్ మోరిసన్ స్పందిస్తూ.. ట్యాక్సీలను నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తుంటాయన్నారు. ఎప్పుడు, ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోబోటాక్సీల భద్రత గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

# రైళ్లలో అదనపు లగేజీకి ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం



దిల్లీ: రైలు టికెట్ బుకింగ్ సమయంలోనే అదనపు లగేజీ కోసం ప్రత్యేకంగా బుక్ చేసుకొనే ఆన్‌లైన్ సదుపాయాన్ని భారతీయ రైల్వే ప్రారంభించింది. దీనిద్వారా ప్రయాణికులు పార్శిల్ ఆఫీసులకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. కన్ఫర్మ్ టికెట్ ఉన్న ప్రయాణికులే ఈ సదుపాయం వినియోగించుకునే వీలుంది. టికెట్ బుకింగ్ సమయంలో ఐఆర్‌సీటీసీ లేదా పార్సిల్ పోర్టల్‌లో అదనపు లగేజీకి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. నేటి నుంచే ఈ కొత్త సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఏసీ ఫస్ట్‌క్లాస్, ఏసీ 2టైర్, ఫస్ట్ క్లాస్, స్లీపర్ క్లాస్, సెకండ్ క్లాస్ ప్రయాణికులు ఈ సేవలను ఉపయోగించుకోవచ్చు. ఏసీ 3-టైర్, ఏసీ చైర్‌కార్ ప్రయాణికులకు ఈ సదుపాయం వర్తించదు. ఎందుకంటే వీటిలో గరిష్ఠంగా అనుమతించే లగేజీ పరిమితి, ఉచిత పరిమితి ఒకేలా (40 కేజీలు) ఉండడమే ఇందుక్కారణం. సాధారణ కంపార్ట్‌మెంట్లలో పెట్టెలు లేదా సూట్‌కేస్‌ల సైజు గరిష్ఠంగా 100 సెం.మీ 60 సెం.మీ x 25 సెం.మీ. ఉండాలి. ఏసీ త్రీ టైర్, ఏసీ చైర్ కార్ కోచ్‌లలో 55 సెం.మీ x 45 సెం.మీ x 22.5 సెం.మీ. మించకూడదు. అంతకంటే పెద్ద లగేజీని తీసుకెళ్లాల్సి వస్తే దానికి పార్శిల్ వ్యాన్‌లో వేయాల్సి ఉంటుంది.

**తరగతిని బట్టి లగేజీ ఇలా**

ఏసీ ఫస్ట్ క్లాస్‌కు ఉచిత పరిమితి 70 కేజీలుగా ఉంది. అదనపు రుసుము చెల్లించి 150 కేజీల వరకు తీసుకెళ్లొచ్చు. ఏసీ 2 టైర్, ఫస్ట్ క్లాస్ ప్రయాణికులు 50 కేజీల వరకు ఉచితంగా లగేజీని పట్టుకెళ్లొచ్చు. రుసుము చెల్లించి గరిష్ఠంగా 100 కేజీలు తీసుకెళ్లేందుకు వెసులుబాటు ఉంది.స్లీపర్ క్లాస్ ఉచిత పరిమితి 40 కేజీలు కాగా.. గరిష్ఠంగా 80 కేజీలు పట్టుకెళ్లొచ్చు.సెకండ్ క్లాస్‌లో ఉచిత పరిమితి 35 కేజీలు కాగా.. రుసుము చెల్లించి గరిష్ఠంగా 70 కేజీలు వరకు లగేజీ పట్టుకెళ్లొచ్చు.అదే ఏసీ 3 టైర్, ఏసీ చైర్‌కార్‌లో ఉచిత, గరిష్ఠ లగేజీ పరిమితి కూడా 40 కిలోలు మాత్రమే.

## సంపదలో రోష్ని.. సీఈఓల్లో ప్రియా నాయర్

**న్యూఢిల్లీ:**సంపదను ఇంతలింతలు చేయడంలో హెచ్‌సీఎల్ టెక్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ అగ్రస్థానంలో నిలిచారు. గురువారం విడుదలైన 'కాండీర్ హురున్ ఇండియా ఉమెన్ లీడర్స్ లిస్ట్' ఈ విషయాన్ని వెల్లడిస్తోంది. అదే సమయంలో ప్రొఫెషనల్ సీఈఓల విభాగంలో రూ.5,06,600 కోట్ల కంపెనీ అయిన హిందుస్థాన్ యునిలీవర్‌కు సీఈఓ, ఎండీగా ఉన్న ప్రియా నాయర్ తొలి స్థానం దక్కించుకున్నారు. ఈ ఏడాది జాబితాలో మొత్తం 117 మంది చోటుచేసుకున్నారు. 2025లోని 97 మందితో పోలిస్తే 21% పెరుగుదల కనిపించింది. వీరిలో అత్యధికులు (12 మంది) వృశ్చిక రాశి వారని నివేదిక తెలిపింది. 2025లో తొమ్మిది విభాగాల్లో ఈ జాబితా వెలువడగా, ఈ ఏడాది అది 12కు విస్తరించింది. తద్వారా మహిళా నాయకత్వం వివిధ రంగాలకు చేరినట్లయింది.

ఫిన్లాండ్ జీడీపీ కంటే ఎక్కువగా..: జాబితాలోని మొత్తం మహిళలు రూ.39 లక్షల కోట్ల సంపదకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది ఫిన్లాండ్ దేశ జీడీపీ కంటే అధికం. వీరి సగటు వయసు 48 ఏళ్లు. జాబితాలో అత్యంత పిన్నవయస్కురాలు శీతల్ దేవి(19) కాగా, ఎక్కువ వయసున్న వ్యక్తిగా రజని బెక్టర్(86) నిలిచారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా, నైకా వ్యవస్థాపకురాలు ఫల్గుణి నాయర్, సుధా మూర్తి, నిసాబా గోద్రేజ్ వంటి ప్రముఖులూ ఈ జాబితాలో ఉన్నారు.

విభాగాల వారీగా..: రూ.1,21,000 కోట్ల విలువైన అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌నకు చెందిన ప్రీతా రెడ్డి(68), సునీతా రెడ్డి(67) సంయుక్తంగా దిగ్గజ విభాగంలో అగ్రస్థానంలో నిలిచారు. రూ.22,230 కోట్ల విలువైన రెన్యూ పవర్‌కు సహ వ్యవస్థాపకురాలైన వైశాలి నిగమ్‌సిన్హా(56) న్యూ ఎకానమీ విభాగంలో ముందున్నారు.

# రాజేందర్ రెడ్డి ఆత్మహత్య కేసు.. అరెస్టుల్లో జాప్యంపై అనుమానాలు

- హైకోర్టులో ముందస్తు బెయిల్ తిరస్కరణ.. పోలీసుల తదుపరి చర్యలపై ఉత్కంఠ
- నిందితుల అరెస్టు ఆలస్యంపై రాజకీయ జోక్యం ఆరోపణలు
- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: బీఆర్ఎస్ భరోసా
- త్వరిత దర్యాప్తు, నిందితుల అరెస్టుకు డిమాండ్



**తిమ్మాపూర్, జూలై 31 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన రాజేందర్ రెడ్డి ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు ఆలస్యమవుతుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్లిష్టమైన కేసులను వేగంగా ఛేదిస్తున్న పోలీసులు ఈ కేసులో మాత్రం ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకోకపోవడంపై స్థానికంగా చర్చ సాగుతోంది. నిందితులకు రాజకీయ అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ప్రజాప్రతినిధి సన్నిహితుడిగా ప్రచారంలో ఉన్న వ్యక్తికి పోలీసు రక్షణ కల్పించారనే వార్తలు వెలువడిన అనంతరం ఉన్నతాధికారులు స్పందించి, సంబంధిత బందోబస్తును తొలగించినట్లు సమాచారం. అయినప్పటికీ ప్రధాన నిందితుల అరెస్టు జరగకపోవడంతో దర్యాప్తు తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
ఈ కేసులో అరెస్టును తప్పించుకునేందుకు నిందితులు హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరణకు గురైనట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం పోలీసుల తదుపరి చర్యలపై అందరి దృష్టి నెలకొంది. న్యాయస్థానం నిర్ణయం అనంతరం కూడా అరెస్టుల్లో జాప్యం ఎందుకనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అయితే, హైకోర్టు నిర్ణయంపై అధికారిక ధ్రువీకర ణ కోసం ఎదురుచూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా, బాధిత కుటుంబాన్ని శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ సుడా చైర్మన్ జీవి రామకృష్ణా రావు పరామర్శించారు. పార్టీ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన, బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజేందర్ రెడ్డి మృతికి బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

- 3 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి
- హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మీటర్ రీడర్స్ జేఏసీ



**ముషీరాబాద్, జూలై 31(జనం సాక్షి):** హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మీటర్ రీడర్ల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మీటర్ రీడర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జేఏసీ నాయకులు మాట్లాడుతూ, గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. మీటర్ రీడర్ల వేతనాలను ప్రతి నెల 1వ తేదీన IFMIS పోర్టల్ ద్వారా నేరుగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. మీటర్ రీడర్ల ఉద్యోగ భద్రత కోసం సాంక్షన్ పోస్టులను మంజూరు చేయాలని, ఈ అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని జేఏసీ కోరింది.

ఈ విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుత్వానికి సానుకూలంగా లేఖ రాయడం పట్ల మీటర్ రీడర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన ప్రతి మీటర్ రీడర్‌కు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మీటర్ రీడర్స్ జేఏసీ కృతజ్ఞతలు తెలిపింది.
"ఐక్యతే మన బలం – మీటర్ రీడర్ల హక్కుల సాధన కోసం మన పోరాటం నిరంతరం కొనసాగుతుంది" అని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల బాలకృష్ణ రెడ్డి, టీజేఎస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, రవి, అంజిరెడ్డి, మనోజ్, చంద్రశేఖర్, జి. విక్రమ్ రాజు, శ్రీకాంత్, సోమి రెడ్డి, వినోద్, గిరి, శ్యామ్, రాజ్ కిరణ్, వీరేందర్, మదన్ మోహన్, నర్సింగ్, వెంకటేష్, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## లింగన్న త్యాగం ప్రజా పోరాటాలకు
# స్ఫూర్తిదాయకం : కే గోవర్ధన్



**ముషీరాబాద్, జూలై 31 (జనం సాక్షి) :** ప్రతిఘటనా పోరాట యోధుడు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ లింగన్న అని, ఆయన త్యాగం ప్రజా పోరాటాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.గోవర్ధన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మార్క్స్ భవన్ లో కామ్రేడ్ లింగన్న 7వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.గోవర్ధన్ మాట్లాడుతూ ఇల్లందు ఏజెన్సీలో ఆదివాసీల పోడు భూముల పోరాటంలో లింగన్న క్రియాశీల పాత్ర పోషించారని, పేదలకు భూములు, గూడేలకు సాగు, తాగునీరు, విద్య, వైద్యం కోసం పోరాడారని అన్నారు. పోడు పోరాటానికి భయపడే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 జులై 31న బూటకపు ఎన్ కౌంటర్ చేసిందని విమర్శించారు. లింగన్న ఈతరం భగత్ సింగ్, కొమరం భీం లాంటి వారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియునేతలు బి.ప్రదీప్, ఎం.శ్రీనివాస్, పిడిఎస్ యు నేతలు పి.మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# హైటెక్ సిటీ వార్డులో పౌర సమస్యలను సమీక్షించిన కమిషనర్



**శేరిలింగంపల్లి, జూలై 31 (జనంసాక్షి) :** ఒకరోజు ఒక వార్డు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి హైటెక్ సిటీ వార్డులో 'వన్ డే వన్ వార్డ్' కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ జి. సృజన జోనల్ కమిషనర్, మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ తోకలిసి రాష్ట్ర ప్రజాబద్ధల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్థానిక ప్రజలు, నాయకులతో కలిసి హైటెక్ సిటీ వార్డును సందర్శించి పౌర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎంసి కమిషనర్ వార్డు పరిధిలోని మస్తాన్ నగర్ మురికివాడ(స్లమ్) లోని స్థానిక ప్రజలు మరియు వివిధ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై వార్డు పరిధిలోని పౌర సమస్యలను తెలుసుకొని మున్సిపల్ సేవల అమలును సమీక్షించారు. అయితే స్థానికులు తమ ప్రాంతంలోని వివిధ పౌర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. ప్రధానంగా పాత బోర్ వెల్స్, విద్యుత్ కనెక్షన్ల మరమ్మత్తులు–పునరుద్ధరణ, పనిచేయని వీధి దీపాల పునరుద్ధరణ, జలమండలి విభాగం నిర్వాకంతో తక్కువ నీటి ఒత్తిడి కారణంగా తాగునీటి సరఫరా సరిగా లేనందున మెరుగుదల, డ్రైనేజీ వ్యవస్థ, నాలాలు మరియు లీకేజీలవల్ల మురుగనీటిలో తాగునీరు కలిసి కలిసి తనీరు సరఫరా, దాని పరిష్కారం, ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంవంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు లేవనెత్తిన, చర్చకు వచ్చిన గుర్తించిన అన్ని సమస్యలను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల అమలును నిరంతరం పర్యవేక్షించి, చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు 'కంప్లయన్స్ నివేదికలు' సమర్పించాలని సూచించారు. వన్ డే వన్ వార్డ్ కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలను సమీక్షించడం, శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం మరియు ప్రజలకు మరింత మెరుగైన మున్సిపల్ సేవలను అందించడం లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, యూబిడి మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అసంపూర్తి డ్రెయిన్ పనులతో రవీంద్రనగర్‌కు మళ్లీ వరదల ముప్పు

**ఉప్పల్, జూలై 31 (జనంసాక్షి):** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్ కాలనీ మరోసారి వరద ముప్పు ఎదుర్కొంటు ందనే ఆందోళ న స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఓయూ సరస్సు నుంచి రామంతపూర్ పెద్ద సరస్సు వరకు వర్షపు నీటి పారుదల కోసం రూ.14 కోట్ల వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభమై చాలా కాలం గడిచినా ఇప్పటివరకు 20 శాతం మేర కూడా పూర్తి కాలేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికే వర్షాకాలం కొనసాగుతుండగా నిర్మాణం ఆలస్యం కావడంతో భారీ వర్షాలు కురిస్తే కాలనీ మళ్లీ నీట మునిగే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.. ప్రస్తుతం డ్రెయిన్ పనులు అసం పూర్తిగా ఉండటంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం
# పేద ప్రజలతో వ్యాపారం చేస్తోంది

### కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె. రామకృష్ణ



**సికింద్రాబాద్(జనంసాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో పేద ప్రజలపై ఆర్థిక భారం మోపుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని కంటో న్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్య క్షుడు జె.రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం మహేంద్ర హిల్స్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... వివాదం ఉన్న భూముల విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.సర్వే నంబర్ 844/1 మల్కాజిగిరి పరిధిలో ఉండగా,అక్కడ కంటో న్మెంట్‌లో 400 ఇళ్ల నిర్మాణం ఎలా చేపడతారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 74కు సంబంధించి కోర్టు వివాదాలు ఉన్నాయని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టులో కేసు ఓడిపోయిందని ఆయన పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో అక్కడ ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపడతారో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు వివరించాలని కోరారు. రూ.6 లక్షలకు 400 చదరపు అడుగుల ఇల్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముందుగా రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ఇల్లు మంజూరైన తర్వాత రూ.6 లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని రామకృష్ణ ఆరోపించారు.400చదరపు అడుగుల నిర్మాణం, బహుళ అంతస్తుల నిర్మాణ విధానంపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజలకు వెల్ల డించాలని డిమాండ్ చేశారు. పేదలు రూ.6 లక్షలు చెల్లిస్తే వారికి లభించే ఇంటి పరిమాణం 400 చదరపు అడుగులేనని, పది అంతస్తుల నిర్మాణ విధానంలో నికరంగా లభించే స్థలం కేవలం 4-5 గజాల మేరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ లెక్కన ఒక్క గజానికి సుమారు రూ. 1.50 లక్షల వరకు పేదలు చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు.

**టీమ్స్ ఆసుపత్రికి కేంద్ర అనుమతులు కీలకం**

టీమ్స్ ఆసుపత్రి నిర్మాణం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తామంటే తామే గొప్ప అన్న ట్లుగా ప్రచారం చేసుకుంటున్నాయని రామకృష్ణ మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం టీమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని ఆయనపేర్కొన్నారు. తాను కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో టీమ్స్ ఆసుపత్రి మురుగు నీటి వ్యవస్థకు సంబంధించి కంటోన్మెంట్ ప్రాంతంలో సీవరేజ్ ఔట్‌లెట్‌ను అభివృద్ధి చేసి దానిని జీహెచ్ఎంసీ ఔట్‌లెట్‌కు అనుసంధానం చేయాలనే షరతుతో అనుమతులు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశా రు.కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా అన్ని రాజకీయ పార్టీలు కలిసి సీవరేజ్ ఔట్‌లెట్ పనులను పూర్తి చేయాలని కోరారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటూ
# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- పూరి గుడిసెలో నివాసం ఉన్న అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**బొంరాస్ పేట, జూలై 31 (జనం సాక్షి):** ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు.శుక్రవారం బొంరాస్ పేట మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని,బొట్లవాని తండాలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మెరుగైన వైద్యంతోపాటు మందులను అందుబా టులో ఉంచాలన్నారు.వర్షాకాలం ఉన్నందున పాము కాటుకు సంబంధించి మందులను నిల్వలు ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తు లకు ఆసరా పెన్షన్ కు దరఖాస్తు చేసుకునేందుకుగాను ధ్రువీకరణ పత్రాలను వెంటనే ఇవ్వాలని కలెక్టర్ వైద్యాధికారిని ఆదేశించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని అనారోగ్య వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఇన్ పేషెంట్, మందుల నిల్వ గది, ఆపరేషన్ థియేటర్లను కలెక్టర్ పరిశీలించారు.ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ 10వ తరగతిలో తెలుగు బోధనను పరిశీలించారు.విద్యార్థినిలలో విద్యతోపాటు తమ సృజనాత్మకతను తీసుకువచ్చే విధంగా ఇండోర్ గేమ్ లను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థినిలకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం నాగిరెడ్డి పల్లి గ్రామాన్ని సందర్శించిన క్రమంలో పూరిగుడిసెలో జీవనం సాగిస్తున్న కుటుంబాన్ని పరిశీలించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హౌసింగ్ అధికారికి సూచించారు.కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, తహసిల్దార్ పద్మావతి,ఎంపీడీవో వెంకన్ గౌడ్,వైద్యాధికారి హేమంత్ కుమార్ లు ఉన్నారు.

## మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటమే
# ఊ. సాంబశివరావుకు నిజమైన నివాళి



**ముషీరాబాద్, జూలై 31 (జనం సాక్షి):** మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటమే ఊ. సాంబశివరావుకు నిజమైన నివాళి అని టీపీఎస్‌కే గౌరవాధ్యక్షులు జి. రాములు అన్నారు. ఏ మేరకు శుక్రవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక ఉద్యమకారుడు ఊ. సాంబశివరావు 6వ వర్ధంతి సందర్భంగా ఊసా స్మారక కమిటీ ఆధ్వర్యంలో స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీఎస్‌కే గౌరవాధ్యక్షులు జి. రాములు మాట్లాడుతూ, కామ్రేడ్ ఊ. సాంబశివరావు ఉద్యమాల ఉపాధ్యాయుడిగా కుల, వర్గ పోరాటాలను సమన్వయంతో నడపాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, పల్లెల్లో పేదల సంఘాలను ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను లోతుగా అధ్యయనం చేసిన ఆచరణవాది, మార్క్సిస్టు, సామాజిక కార్యకర్త, సాంస్కృతిక యోధుడు, బహుజన ఉద్యమకారుడిగా తెలంగాణ ప్రజలకు చిరపరిచితులని కొనియాడారు. ఆయన రచనలు, పుస్తకాల ద్వారా మతోన్మాదం వల్ల కలిగే ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరించారని, ప్రస్తుతం ఆ ప్రమాదం మరింత తీవ్రరూపం దాల్చిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, సామాజికవాదులు ఐక్యంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడినప్పుడే ఊ. సాంబశివరావుకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు.
సామాజిక తెలంగాణ మహాసభ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య మాట్లాడుతూ, హిందుత్వ శక్తులను ఎదుర్కోవాలంటే మతతత్వం, లౌకికతత్వం, జాతీయవాదం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన అవసరమని, ఆ అవగాహన కలిగిన నాయకుడు ఊ. సాంబశివరావు అని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు, విప్లవ సంస్థలు ఐక్యంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడడమే ఆయనకు ఇచ్చే గొప్ప నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, రాష్ట్ర నాయకుడు శేఖర్, ప్రజా గాయకుడు ఎస్.కే. మౌలానా, దయానంద్, భూపతి వెంకటేశ్వర్లు, నను బాల మల్లయ్య యాదవ్, నరసింహాచారి తదితరులు పాల్గొని ఊ. సాంబశివరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

### ఎమ్మెల్యే ముఠా గోపాల్



**ముషీరాబాద్, జూలై 31(జనం సాక్షి):** మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం బీఆర్ఎస్ కు, తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటు అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి. సోమన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముషీరాబాద్ చౌరస్తాలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహతో కలిసి పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరనియమని కొనియాడారు. పెద్ది నీతి నిజాయితీకి మారుపేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, పార్టీ సీనియర్ నాయకులు టి. సుమన్, డి.శివ ముదిరాజ్, దీన్ దయాల్ రెడ్డి, భోలక్ పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, నియోజకవర్గం బీఆర్ఎస్ మీడియా సేల్ ఇన్చార్జి ముచ్చ కుర్తి ప్రభాకర్, ముషీరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు బల్ల ప్రశాంత్, ఎండి. మోయిన్, డివిజన్ ఎస్ఎస్ఎల్ అధ్యక్ష కార్యదర్శులు సదా, సంతోష్ కుమార్ కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, సుధాకర్ గుప్తా, వల్లాల శ్యామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇందిరా పార్క్ వద్ద జరిగే
# మహా ధర్నాను విజయవంతం చేయండి

### తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశి రావు, పూజరి రమేశ

**ఇబ్రహీంపట్నం, జులై 31(జనం సాక్షి ):** నేడు ఇందిరా పార్క్ వద్ద జరిగే తపస్ మహా ధర్నాను విజయవంతం చేయాలని తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశి రావు మరియు పూజరి రమేశ లు జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు మీడియా తో మాట్లాడుతూ విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ధర్నా చౌక్ ఇందిరా పార్క్ వద్ద తపస్ చేస్తున్న ధర్నా లో మనం అధిక సంఖ్యలో కదలివచ్చి పాల్గొంటే ఉపాధ్యాయ మరియు ఉద్యోగుల ప్రధాన సమస్యలైనా పిఆర్సి అమలు, పెండింగ్ డిఎ ల విడుదల, 2003 డి ఎస్ సి టీచర్లకు అమలు, మానిఫెస్ట్ లో ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలి, పెండింగ్ బిల్లుల మంజూరు, నూూ ఉద్యోగులు మరియు కేజీబీవీ టీచర్లకు 29 రోజుల సమ్మె కాలపు వేతనం చెల్లించి, కనీస వేతన స్కేలును అమలు చేయాలని, ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం జీవో నెంబర్ 25 ను సవరించాలి, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దును అమలు చేయాలని, అన్నీ గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, విద్యా శాఖలో 190 జీవోను అమలు చేసి 317 బాధితులకు తాత్కాలిక ఉపశమనం కలిగించాలని, 2008 కాంట్రాక్టు టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, టెట్ అర్హత మార్కులను అందరు టీచర్లకు 40% గా ఏం చేయాలని మరియు విద్యా సంస్థలకు సంవత్సరం ప్రారంభంలోనే నిధులు మంజూరు చేయాలని వంటి అనేక విద్యారంగా, ఉపాధ్యాయ మరియు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తపస్ చేస్తున్న ధర్నా లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

## ఇంటి దోపిడీ కేసు ఛేదన..
# అల్లుడు, మనవడే సూత్రధారులు

- కరీంనగర్ పోలీసుల వేగవంతమైన దర్యాప్తు.. ముగ్గురు అరెస్ట్
- మీరట్‌లో నిందితుల పట్టివేతకు ప్రత్యేక బృందాల కృషి
- రూ.2.09 లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం
- డిజిటల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలతో కేసు ఛేదన
- ఉత్తరప్రదేశ్ పోలీసులకు కమిషనర్ అభినందనలు




**కరీంనగర్ బ్యూరో, జులై 30 (జనంసాక్షి) :** కరీంనగర్ భగత్‌నగర్‌లో ఈ నెల 21--22 తేదీల మధ్య జరిగిన సంచలనాత్మక ఇంటి దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ (80) అల్లుడు మొహమ్మద్ రజావుద్దీన్, మనవడు మొహమ్మద్ అజీమ్ రజా ప్రధాన సూత్రధారులుగా గుర్తించిన పోలీసులు, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దోపిడీ సమయంలో నిందితులు డమ్మీ పిస్టళ్లు, కత్తులతో ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను బెదిరించి, చేతులు, కాళ్లు కట్టేసి నగదు, ఆభరణాలు, మొబైల్ ఫోన్లను అపహరించారు. అనంతరం అక్కడి అద్దెదారులకు చెందిన రెండు మోటార్‌సైకిళ్లను కూడా తీసుకెళ్లారు.
ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక, డిజిటల్ ఆధారాలను విశ్లేషించారు. నిందితులు మోటార్‌సైకిళ్లపై హుజూరాబాద్ వైపు వెళ్లి, పెద్ద పాపయ్యపల్లి సమీపంలో వాటిని వదిలివేసినట్లు గుర్తించారు. దర్యాప్తులో లభించిన సమాచారంతో నాలుగు ప్రత్యేక బృందాలు మీరట్‌కు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. దర్యాప్తులో కుటుంబ విభేదాల నేపథ్యంలో అల్లుడు రజావుద్దీన్ ఈ దోపిడీకి పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు. అతనితో పాటు మనవడు అజీమ్ రజా, మీరట్‌కు చెందిన సల్మాన్, మరో సల్మాన్, మొహమ్మద్ హసీన్ ఈ నేరంలో పాల్గొన్నట్లు వెల్లడించారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన కరీంనగర్ ప్రత్యేక పోలీసు బృందాలను, మీరట్ పోలీసులను పోలీస్ కమిషనర్ అభినందించారు.

## గంజాయితో దొరికిన
# ఈగిల్ టీం కానిస్టేబుల్

**వివరాలు వెల్లడించిన ఏసిపి విజయ్ కుమార్**



**కరీంనగర్ క్రైం, జూలై 31 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాల నియంత్రణ విభాగంలో పనిచేస్తూ స్నేహితుని కోసం అతని ప్రత్యర్థి పై అక్రమ కేసు పెట్టేందుకు గంజాయి నిల్వచేసిన ఈగల్ టీం కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుని వివరాలను కొత్తపెల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రూరల్ ఏసిపి విజయ్ కుమార్ వెల్లడించారు. కరీంనగర్ మండలం సీతారాంపూర్‌లో నివాస ముంటున్న ఈగల్ టీం కానిస్టేబుల్ మెడబోయిన నాగరాజు వద్ద గంజాయి నిల్వ ఉందన్న సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 370 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును విచారించగా చిగురుమామిడి మండలం కొండాపూర్ కు చెందిన శ్రీనివాస్ కు నాగరాజుకు పరిచయం ఉంది. అదే గ్రామంలో శ్రీనివాస్ కు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తులకు మధ్య భూతగాదాలు ఉండడంతో అవి ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించిన కొలిక్కి రాకపోవడంతో అతన్ని కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో నాగరాజు శ్రీనివాసులు కలిసి పథకం పన్నారు. స్నేహితుని కోసం కానిస్టేబుల్ నాగరాజు వరంగల్ నుంచి గంజాయి తెప్పించి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఎరువుల దుకాణంలో పెట్టాడు. తిరిగి పోలీసులకు సమాచారం అందించి చిరుమామిడి పోలీస్టేషన్లో కేసు నమోదయ్యేలా చేసి కటకటాల పాలు చేశారు. వరంగల్ నుంచి తెప్పించిన గంజాయిలో కిలో గంజాయి శ్రీనివాస్ రెడ్డి దగ్గర దొరికినట్లు చూపించగా మిగిలిన 3 70 గ్రాముల గంజాయిని తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు నాగరాజు ఇంట్లో దాడులు నిర్వహించి గంజాయి తోపాటు నాలుగు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కానిస్టేబుల్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని ఏసిపి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఏసీబీ వెంట కొత్తపల్లి ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం.. పథకాలు అర్హులందరికీ అందాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేయాలి
- నియోజకవర్గ రోడ్ల నిర్మాణానికి 300 కోట్లకు పైగా నిధులు
- నాళాల కబ్జాలు, అవినీతిపై ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం




**యాచారం, జూలై 31 (జనం సాక్షి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలు అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా సర్పంచులు, వివిధ శాఖల అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సంక్షేమ పథకాల అమలు తీరును, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు తెలిపిన పలు స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చానని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం రూ.300 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు గుర్తుచేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ విషయంలో క్షేత్రస్థాయి అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసే వెంచర్లలో నాళాలు కబ్జాకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని ఫార్మ్ ల్యాండ్స్ రిజిస్ట్రేషన్లు చేయవద్దని రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వంలో లేదా అధికారుల స్థాయిలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగడానికి వీల్లేదని, రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రతి గుంట భూమికీ న్యాయమైన నష్టపరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, వచ్చే నెల 10వ తేదీలోగా మళ్లీ సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పురోగతిని సమీక్షిస్తానని ప్రకటించారు. అనంతరం యాచారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ప్రత్యేక అధికారి మాధవరావు, ఎంపీడీవో రాధారాణి, తహశీల్దార్ అయ్యప్ప, పంచాయతీరాజ్ డిఈ శ్రీనివాస్, ఏఈ సూర్యవంశీ, ఎంపీఓ శ్రీలత, వ్యవసాయ అధికారి రవినాథ్, వెటర్నరీ అధికారి రేఖ, వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, ట్రాన్స్కో ఏడీ సీతారాం, ఇతర శాఖల అధికారులు, మండల సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 2047 నాటికి మాదకద్రవ్య
# రహిత దేశమే లక్ష్యం

**మై భారత స్టేట్ డైరెక్టర్ అన్వేష్**

**ఆగస్టు 2న పది వేల మంది యువతతో..పీఎం మోడీ సంభాషణ**

**రంగారెడ్డి జులై 31 (జనంసాక్షి) :** 20047 నాటికి మార్గ ద్రవ్య రైతు దేశంగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ కృషి చేస్తుందని మై భారత్ స్టేట్ డైరెక్టర్ చి అన్వేష్ తెలిపారు. అందులో భాగంగా ఆగస్టు రెండవ తేదీన పదివేల మంది యువతతో ప్రధానమంత్రి మోడీ వర్చువల్ సంభాషణ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ తెలంగాణ, 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారతదేశం లక్ష్యంగా 2026 ఆగస్టు 2న రాష్ట్రవ్యాప్తంగా "నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ - సంకల్ప్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రంగారెడ్డి జిల్లాలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్, సిద్ధిపేటలోని కావేరి విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలలో ప్రధాన కార్యక్రమాలు నిర్వహించనున్నాయని తెలిపారు. అదనంగా మరో ఐదు జిల్లాల్లో జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించి, యువత, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సేవకులు, సామాజిక సంస్థలు కలిసి "నషా ముక్త యువ ప్రతిజ్ఞ" చేయనున్నామన్నారు. తెలంగాణలో నిర్వహించే కార్యక్రమాల్లో సామూహిక ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీలు, యువజన సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పించనున్నామన్నారు. వారిని మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా పరిపాలన, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, యువజన సంఘాలు, ప్రభుత్వ శాఖలు, ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో విస్తృత ప్రచారం చేయనున్నామన్నారు. ప్రతి ఒక్కరి ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని సూచించారు.

# భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- సంక్షేమ బోర్డులో నమోదుకు బిల్డర్లు సహకరించాలి: సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్
- 256 మంది నిర్మాణ కార్మికులకు నమోదు కార్డుల పంపిణీ
- కార్మికుల నమోదుకు పూర్తి సహకారం అందిస్తాం: బిల్డర్లు
- రాయదుర్గంలో కార్మిక సంక్షేమ అవగాహన కార్యక్రమం




**శేరిలింగంపల్లి, జూలై 31 (జనంసాక్షి):** తెలంగాణలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి అర్హత కలిగిన కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాస్-1 టవర్స్‌లో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల నమోదు కార్డుల పంపిణీ, సంక్షేమ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 256 మంది అర్హులైన నిర్మాణ కార్మికులకు నమోదు కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడిన సీపీ, భవన నిర్మాణ రంగం ప్రమాదకరమైనదని, కార్మికుల భద్రతతో పాటు వారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. తెలంగాణ భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న ఈఎస్ఐ, ఈపీఎఫ్, జీవిత బీమా, వివాహ, ప్రసూతి, ప్రమాద మరణ, వైకల్య, వైద్య చికిత్స, అంత్యక్రియల సహాయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉచిత ఆరోగ్య పరీక్షలు వంటి పథకాల వివరాలను కార్మికులకు వివరించారు. నిర్మాణ సంస్థలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు తమ వద్ద పనిచేస్తున్న ప్రతి అర్హత కలిగిన కార్మికుడిని సంక్షేమ బోర్డులో తప్పనిసరిగా నమోదు చేయించాలని సీపీ సూచించారు. దీనికి స్పందించిన బిల్డర్లు, తమ సంస్థల్లోని కార్మికులందరికీ నమోదు కార్డులు ఇప్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, కార్మిక శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్త అరెస్ట్

**మల్కాజిగిరి జూలై 31(జనంసాక్షి) :** కట్టుకున్న భార్యను వేధింపులకు గురిచేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తను మల్కాజిగిరి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.సిఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.దమ్మాయిగూడ సిద్ధార్థ నగర్ కాలనీకి చెందిన యల్లుగుల నవీన్ కుమార్ (41) మౌలాలి జవహర్‌నగర్‌లోని అక్షయ టవర్స్‌లో నివాసముంటున్న శరణ్య (34)తో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. మృతురాలి తండ్రి అశోక్ అకునూరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సాక్షుల వాంగ్మూలాలు, ఆధారాలను సేకరించిన అనంతరం భార్య ఆత్మహత్యకు కారణమైన నిందితుడు నవీన్ కుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు అతడికి జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## రామగిరి ఖిల్లాలో 250 ఎకరాల
# ఇండస్ట్రియల్ పార్క్

*మంత్రి శ్రీధర్ బాబు త్వరలో పర్యటన*



**రామగిరి జూలై 31 జనం సాక్షి :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేడిపల్లి శివారులో ప్రతిపాదిత 250 ఎకరాల ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు త్వరలో రామగిరి ఖిల్లా ప్రాంతంలో పర్యటించి ఇండస్ట్రియల్ పార్క్ కోసం కేటాయించిన భూములను పరిశీలించ నున్నారు. పర్యటన సందర్భంగా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన స్థల పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల పురోగతిపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. అలాగే రత్నాపూర్ గ్రామం నుంచి రామగిరి ఖిల్లా వరకు నిర్మిస్తున్న రహదారి పనులను కూడా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేయనున్నారు.మంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం సంబంధిత శాఖల అధికారులు ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ ఆధ్వర్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో భూమి చదును చేసే పనులను చేపట్టారు.ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు వల్ల రామగిరి మండలంతో పాటు రత్నాపూర్, పరిసర ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.మంత్రి పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమ, తహసీల్దార్ పర్నంది సుమన్, ఎంపీడీఓ బద్రి శైలజరాణి, ఎంపీఓ మూల సమ్మిరెడ్డి, విద్యుత్ ఏడీఈ వంగల వెంకటనారాయణ, సబ్ ఇంజినీర్ కుమ్మరికుంట సతీష్, ఆర్ఐ కే. మహేష్, ఇండస్ట్రియల్ జేఈ సృజన్, కాంట్రాక్టర్ నిశాంత్, గ్రామ కార్యదర్శి గంగుల సంతోష్, జీపీఓ పెరుకు వెంకటేశ్వర్లు, విద్యుత్ లైన్‌మెన్ బంగారు శివకుమార్, గుండా చందన్ తదితరులు పాల్గొన్నారు.




## ఏఐతో సీఎఫ్ఓలు వ్యూహాత్మక నాయకులుగా ఎదగాలి

**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు**

**ఖైరతాబాద్, జూలై 31 (జనం సాక్షి) :** ఏఐ, డేటా ఆధారిత నిర్ణయాలు, ముందుచూపుతో సీఎఫ్ఓలు వ్యూహాత్మక నాయకులుగా ఎదగాలని తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు పిలుపునిచ్చారు. సీఐఐ తెలంగాణ 8వ సీఎఫ్ఓ కాంక్లేవ్‌లో డెలాయిట్ ఇండియా మాజీ చైర్మన్ పిఆర్ రమేష్ తోకలసి ఆయన మాట్లా డుతూ సీఎఫ్ఓలు ఏఐ, సుస్థిరతతో దీర్ఘకాలిక విలువ సృష్టించాలని సూచించారు. అంతరాయా లను అవకాశాలుగా మలచే నాయకత్వం అవసరమన్నారు. సీఎఫ్ఓలు దూరదృష్టి, నిరంతర అభ్యా సంతో సంస్థల భవిష్యత్తును నిర్దేశించాలని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేట రీస్ సీఎఫ్ఓ, సీఐఐ తెలంగాణ ఫైనాన్స్, టాక్సేషన్ ప్యానెల్ కన్వీనర్ ఎం.వి.నంసింహం, సిగ్నోడ్ ఇం డియా లిమిటెడ్ ఎండీ, సీఐఐ తెలంగాణ వైస్ చైర్మ న్ గౌరవ్ మహేశ్వరి, ప్రభుత్వ అధికారులు, సీఎఫ్ ఓలు, సీఈఓలు, పరిశ్రమ, విద్యా, విధాన రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్
# బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ గుజ్జ సత్యం



**ఎల్బీనగర్ 31 (జనం సాక్షి) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థుల మహా ర్యాలీలు విజయవంతమయ్యాయని తెలిపారు. బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి, స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని కోరారు. స్పందించకపోతే విద్యార్థి, బీసీ, ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కటకం నర్సింగ్‌రావు మాట్లాడుతూ, విద్యపై పెట్టుబడి పెట్టడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని, బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ రఘురాం నేత బిజెపి రాష్ట్ర కన్వీనర్ కర్నాటి ధనుంజయ సోషల్ జస్టిస్ పార్టీ వ్యవస్థాపకులు చామకూర రాజు సోషల్ జస్టిస్ పార్టీ ఇంచార్జ్ కెవి గౌడ్ బీసీ సంఘం నాయకుడు బ్రహ్మయ్య విద్యార్థి నాయకులు గుర్రం శ్రవణ్ లక్ష్మీనారాయణ జాతీయ బీసీ సంఘం నాయకులు వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు విద్యార్థి సంఘాలు సామాజిక కార్యకర్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం ఈ సందర్భంగా తెలిపారు

# ఒక్కటి మినహా.. అన్ని అంశాలు ఆమోదయోగ్యమే


- మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఎంసీఎస్ చైర్ పర్సన్ జిందం కళ




**సిరిసిల్ల టౌన్ జూలై 31 (జనం సాక్షి) :** ప్రజల అవసరాలను, పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఈ మున్సిపల్ సమావేశంలో నిధులను కేటాయించడం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశాన్ని ఎం,సీ, ఎస్, చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమావేశంలో 25 అంశాలతో కూడిన ఎజెండాను మున్సిపల్ సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టగా మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో సమగ్రంగా చర్చించి వారి ఆమోదంతో 24 అంశాలను ఆమోదించుకోవడం జరిగిందని తెలిపారు.ఇందులో ముఖ్యంగా రాబోయే వినాయక చవితి పండుగను దృష్టిలో పెట్టుకుని నిమజ్జనం సందర్భంగా మున్సిపల్ చేపట్టవలసిన వివిధ పనుల కోసం దాదాపు 20 లక్షల రూపాయలను కేటాయించుకోవడం జరిగిందన్నారు.
అంతేకాకుండ పారిశుధ్య నిర్వహణలో భాగంగా స్ప్రేయింగ్ మెషిన్ల కొనుగోలు కు, దోమల నివారణకై కెమికల్స్ కొనుగోలుకు, ఫాగింగ్ మిషన్ల మరమ్మతులకు అదే విధంగా విధి నిర్వహణలో భాగంగా పారిశుధ్య కార్మికులకు తప్పనిసరి అయిన హ్యాండ్ గ్లాస్ కొనుగోలు చేయుటకు, నిధులను కేటాయించుకోవడం జరిగిందని వివరించారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిరిసిల్లలోని పవర్ బోర్ల చుట్టూ ఇంకుడు గుంతలు నిర్మించాలని తీర్మానించుకోవడం జరిగిందని. ఇలా ప్రజా సంక్షేమం పట్టణ అభివృద్ధి ధ్యేయంగా 24 అంశాలను ఆమోదిస్తూ తీర్మానాలు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం,డి,ఖాదిర్ ఫాషా,వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు,కోఆప్షన్ సభ్యులు,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# శ్రమశక్తి అవార్డు గ్రహీత మల్లికార్జున్‌కు ఘన సన్మానం

- ప్రజాసేవ కొనసాగించాలని సూచించిన మంత్రి వివేక్
- కొత్త గనులే సింగరేణి భవిష్యత్తుకు భరోసా
- కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న వివేక్



**గోదావరిఖని, జూలై 31 (జనంసాక్షి):** ఉద్యోగానికి మాత్రమే పదవీ విరమణ ఉంటుందని, ప్రజాసేవకు ఎప్పటికీ రిటైర్మెంట్ ఉండదని రాష్ట్ర కార్మిక, ఉపాధి, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీడీకే-11 గనిలో ఉద్యోగిగా పదవీ విరమణ పొందిన శ్రమశక్తి అవార్డు గ్రహీత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కార్మిక నాయకుడు పి. మల్లికార్జున్ దంపతులను శుక్రవారం మంత్రి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాకా వెంకటస్వామి కాలం నుంచి మల్లికార్జున్ తమ కుటుంబానికి సన్నిహితంగా ఉంటూ విలువైన సలహాలు అందించారని గుర్తు చేశారు. ఉద్యోగ జీవితం ముగిసినా కార్మికులు, ప్రజల సంక్షేమం కోసం సేవాభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన మంత్రి, కొత్త గనులు వస్తేనే సింగరేణి సంస్థకు దీర్ఘకాలిక మనుగడ ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో సంస్థ విస్తరణకు ఆటంకం ఏర్పడిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంచిర్యాల జిల్లాలో కొత్త గనికి అవకాశం కల్పించడంతో పాటు తాడిచర్ల బ్లాక్-2ను సింగరేణికి కేటాయించేలా కృషి చేసిందన్నారు. మరిన్ని బొగ్గు బ్లాకులు సింగరేణికి దక్కేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో ఉన్న సింగరేణి, 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలని, తద్వారా సంస్థతో పాటు కార్మికులకు మరింత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు, శాశ్వత కార్మికుల సొంతింటి కల, మెడికల్ బోర్డు, ఇతర సమస్యల పరిష్కారంపై త్వరలోనే ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి, మాజీ ఎమ్మెల్సీ బి. వెంకట్రావు, ఏఐటీయూసీ నాయకులు, సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గని కార్మికులు పాల్గొన్నారు.

# లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

- 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్'తో అంతర్జాతీయ గుర్తింపు
- విద్యారంగ సేవలకు యునైటెడ్ కింగ్డమ్ నుంచి గౌరవం
- 36 ఏళ్లుగా నాణ్యమైన విద్యకు అంకితభావంతో సేవలు
- అభినందనలు తెలిపిన విద్యావేత్తలు, విద్యార్థులు




**కరీంనగర్ బ్యూరో, జులై 30 (జనంసాక్షి) :** అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్‌రెడ్డికి యునైటెడ్ కింగ్డమ్ నుంచి ప్రతిష్ఠాత్మక 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్' లభించడంతో ఆయన పేరు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నమోదైంది. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం శ్రమిస్తే సమాజంలో విశిష్ట గుర్తింపు సాధించగలరని అన్నారు. నాణ్యమైన విద్య ద్వారానే వ్యక్తిత్వ వికాసం, విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.
గత 36 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సాధికారత, విద్యాసంస్థల అభివృద్ధి, సామాజిక సేవల పట్ల చూపిన అంకితభావాన్ని గుర్తించి యునైటెడ్ కింగ్డమ్ ఈ అంతర్జాతీయ గౌరవాన్ని ప్రదానం చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, సేవా సంస్థల ప్రతినిధులు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు డా. నరేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ గౌరవం సాధించడంలో సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమిష్టి కృషి వల్లే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి, సీఎస్‌ల చేతికి ఎల్‌నినో నిపుణుల కమిటీ రిపోర్ట్

- అందజేసిన చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో ఎల్ నీనో పరిస్థితుల ప్రభావంపై సమగ్రంగా విశ్లేషించి రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక రిపోర్ట్ ను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణ, హార్టికల్చర్ కమిషనర్ యాస్మిన్ బాషాలకు అందజేశారు. ఈ సందర్భంగా నిపుణుల కమిటీ నివేదికలోని అంశాలను చిన్నారెడ్డి వారికి వివరించారు. ఈ నివేదికలో చేసిన సిఫార్సులను ఆయా శాఖల వారీగా పగడ్బందీగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారిని చిన్నారెడ్డి కోరారు. నిపుణుల కమిటీ రూపొందించిన రిపోర్ట్ ను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి చిన్నారెడ్డి అందజేసిన విషయం తెలిసిందే.

### సనత్ నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు హర్షణీయం

సనత్ నగర్ టిమ్స్‌కు మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టడం హర్షణీయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు. సనత్ నగర్ ప్రాంత ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర కేంద్ర స్థాయిలో గొప్ప సేవలు అందించిన వ్యక్తి మర్రి చెన్నారెడ్డి అని ఆయన కొనియాడారు.



## జూరాల 24 గేట్లు ఎత్తివేత

- కృష్ణ పరీవాహక ప్రజలు అప్రమత్తం

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జులై 29(జనంసాక్షి) : కృష్ణమ్మకు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఇరిగేషన్ అధికారుల ప్రకారం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1.22 లక్షల క్యూసెక్కులు రాగా, దిగువకు అవుట్‌ఫ్లో 1.36 లక్షల క్యూసెక్కులు కొనసాగుతోంది.ప్రాజెక్టు భద్రత దృష్ట్యా అధికారులు 24 గేట్లను ఎత్తి 96,144 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు.

వరద నీరు పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణా నది పరివాహక ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులు నదిలోకి దిగవద్దని ఇరిగేషన్ అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది ఒడ్డు వైపు వెళ్లవద్దని సూచించారు. ప్రాజెక్టు వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



# భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి



### రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం

- భద్రాచలం-వెంకటాపురం మార్గంలో రోడ్లపైకి వరద నీరు
- ఏజెన్సీ గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- పర్ణశాల ను చుట్టుముట్టిన వరద నీరు
- రంగలోకి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలు
- భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో 49 పునారావాస కేంద్రాల ఏర్పాటు
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు

భద్రాచలం, జూలై 31 (జనంసాక్షి) : భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు 49.50 అడుగుల వద్ద రెండో ప్రమాద హెచ్చరికను దాటి వేగంగా ప్రవహిస్తోంది. గోదావరి వరదల కారణంగా భద్రాలచం-వెంకటాపురం మార్గంలో వివిధ గ్రామాల్లోకి, రహదారులపైకి వరద నీరు చేరడంతో జనజీవనం అస్తవ్యస్తంగా తయారైంది. పలు గ్రామాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సేవలందిస్తున్నాయి. భద్రాచలం వద్ద గురువారం రాత్రి 12 గంటలకు 29.70 అడుగులున్న గోదావరి క్రమేపి వేగంగా పెరుగుతూ ఉదయం 8 గంటలకు 40.20 అడుగులకు చేరుకుంది. అనంతరం 10.14 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక అయిన 43 అడుగులకు చేరడంతో సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారికంగా జారీ చేశారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు 46.50 అడుగులకు, 3 గంటలకు 47.40 అడుగులకు, 3.40 గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో మళ్లీ రెండో ప్రమాద హెచ్చరికను సబ్‌కలెక్టర్ జారీ చేశారు. గోదావరి సాయంత్రం 6 గంటల వరకు 49.50 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద దిగువకు 14,44,645 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. గోదావరి ఎగువ ప్రాంతాలైన ఎస్ఆర్ఎస్పీ, ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ జలాశాయాల నుంచి భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో పాటు గోదావరి ఉపనదులైన ఇంద్రావతి నది నుంచి 10 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేయగా, ప్రాణహిత నుంచి సైతం భారీగా వరద నీరు వస్తోంది. దీంతో రాబోయే 24 గంటల్లో భద్రాచలం వద్ద గోదావరి 55 అడుగుల వరకు చేరే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే చత్తీస్గడ్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదు అవుతుండటంతో గోదావరికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

#### నిలిచిపోయిన రాకపోకలు, గ్రామాలను చుట్టుముట్టిన వరద నీరు

ఏజెన్సీలో వివిధ గ్రామాలకు నిలిచిపోయిన రాపోకలు నిలిచిపోయాయి. భద్రాచలంకు సమీపంలో తెలంగాణ -ఆంధ్రా సరిహద్దుల్లో ఉన్న దుమ్ముగూడెం మండలం తూరుబాక బ్రిడ్జి వద్ద గోదావరి వరద రోడ్డుపైకి రావడంతో భద్రాచలం-చర్ల దు మ్ము గూ డెం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే చర్ల వెం కటాపురం మధ్యలో వీర భద్రవరం బ్రిడ్జి వద్ద రోడ్డు మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాలను గోదావరి చుట్టుముట్టడంతో పర్ణశాలకు వెళ్లే మార్గం మూసుకుపోయింది. దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి గ్రామం వద్ద వరద నీరు రోడ్డెక్కడంతో గ్రామంను అధికారులు ఖాళీయి చేయించి మంగువాయిబాడు ఆశ్రమ పాఠశాలకు గ్రామస్తులను తరలిస్తున్నారు. భద్రాచలంలో సైతం అశోకనగర్ కొత్తకాలనీ, సుభాష్‌నగర్ కాలనీవాసులను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పెరిగితే పునరవాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్దంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపును గోదావరి వరద చుట్టూముట్టింది. ర్యాంపు సిబ్బందితోపాటు ఇసుక లారీలు వరదలో చిక్కుకు పోయారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ మొగిలి శ్రీనివాసరావు, సీఐ రాజువర్మసిబ్బందిలో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వరదలో చిక్కుకున్న వారిని 46మందిని రక్షించారు.



#### రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలు

భద్రాచలం నియోజకవర్గంలో గోదావరి వరదలకు సంబంధించి సేవలందించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, డీడీఆర్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. దుమ్ముగూడెం, చర్ల, మణుగూరు, భద్రాచలం ప్రాంతాల్లో సేవలందించేందుకు సిద్దంగా ఉన్నారు. భద్రాచలంలో కరకట్ట వద్ద బలగాలు 24 గంటలు గస్తీ నిర్వహిస్తున్నాయి. ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ఆదుకునేందుకు సిద్దంగా ఉన్నారు. భద్రాచలం, పినపాక నియోజకవర్గంలో 49 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వరద ప్రభావిత గ్రామాల నుంచి కొన్ని ప్రాంతాల్లో ప్రజల తరలింపు నిర్వహిస్తున్నారు.

#### క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు

జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజ్, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠలు భద్రాచలంలో గోదావరి వరద ఉధృతిని, ప్రజలకు కల్పించాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అలాగే స్థానిక అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. కరకట్టపైన బందోబస్తు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## ప్రతిరోజూ 28 రేకుల బొగ్గు రవాణా చేయాలి

- థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా చూడాలి
- వర్షాకాలం వరదల సమయంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయంతో పనిచేయాలి
- అన్ని ఏరియాల సమీక్షలో సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు




హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి సంస్థ పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉందని సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు రోజుకు 28 నుంచి 32 రేకుల ద్వారా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని అన్ని ఏరియాల జీఎంలకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపు, నాణ్యత అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా ఓపెన్‌కాస్ట్ గనుల ఉత్పత్తిపై కొంత ప్రభావం పడినా, ముందస్తు జాగ్రత్తలతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను తప్పకుండా సాధించాలని సూచించారు. అదే సమయంలో వర్షాకాలంలో భూగర్భ గనుల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు 75-80 శాతం బొగ్గును సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని, స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సింగరేణి రెస్క్యూ బృందాలు, ఇతర విభాగాల అధికారులు వెంటనే సహాయక చర్యల్లో పాల్గొనేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తికి అనుగుణంగా అన్ని ఓపెన్‌కాస్ట్ గనుల్లో లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని, 500 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాన్ని చేరుకునేందుకు కొత్త గనులకు అవసరమైన వివిధ అనుమతుల సాధన ప్రక్రియను ఇప్పటి నుంచే వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు శ్రీ ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), డైరెక్టర్ శ్రీ కె. వెంకటేశ్వర్లు (పీ అండ్ పీ) , డైరెక్టర్ శ్రీ గౌతమ్ పోట్రు (పర్సనల్, ఫైనాన్స్), డైరెక్టర్ (ఈఎం) ఎం. తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) శ్రీ బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) శ్రీ టి. శ్రీనివాస్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ విభాగాల జనరల్ మేనేజర్లు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

## నకిలీ నంబర్ ప్లేట్లపై ఉక్కుపాదం

### విస్తృతంగా తనిఖీలు చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు



హైదరాబాద్, జూలై31 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలో వాహనాల నకిలీ నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజులుగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ నంబర్ ప్లేట్లు వినియోగిస్తున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సుల్తాన్‌బజార్, మెహదీపట్నం, బహదూర్‌పురాతోపాటు పెద్దపల్లి, మేడిపల్లి, కట్టంగూర్ ప్రాంతాల్లో ఈ కేసులు నమోదు చేశారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ప్రభుత్వం ఆమోదించిన హెచ్ఎస్ఆర్పీ నంబర్ ప్లేట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు. ఇతర నంబర్ ప్లేట్లు వాడితే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు, డిజైన్లతోపాటు అంకెల మార్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లు వాడితే వాహనం సీజ్‌తో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. చలానాల నుంచి తప్పించుకునేందుకు కొంతమంది వాహనదారులు నంబర్ ప్లేట్లు మారుస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు తనిఖీల్లో గుర్తించారు. ఈ నేపథ్యంలో 'జీరో టాలరెన్స్' విధానంతో ముందుకు వెళ్తున్నట్లు ఈ సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

## నకిలీ డీఏపీ ఎరువుల ముఠా గుట్టురట్టు



హుజూర్‌నగర్, జూలై 31 (జనంసాక్షి) : రాష్ట్రంలో డీఏపీ ఎరువుల కొరతను ఆసరాగా చేసుకుని నకిలీ ఎరువులు తయారు చేసి రైతులను మోసం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రైతులు ప్రభుత్వం సూచించిన లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ ఎరువులు కొని ఆర్థికంగా, పంటపరంగా నష్టపోవద్దని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా నకిలీ ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులను మోసం చేసే అక్రమ వ్యాపారులను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈనెల 15న హుజూర్ నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండల వ్యవసాయ అధికారి బొలిశెట్టి శ్రీనివాస్ అందించిన సమాచారంతో మఠంపల్లి పోలీసులు రఘునాథపాలెం గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారి కొండేటి పిచ్చిరెడ్డి వద్ద నకిలీ డిఏపి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో మఠంపల్లి ఎస్సై ప్రవీణ్, మేళ్లచెరువు ఎస్సై నవీన్, ఏఎస్సై లు బలరాం రెడ్డి, శంభయ్య, నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన విచారణలో సంచల న విషయాలు వెలుగు లోకి వచ్చాయి. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 8 మంది కలిసి ముఠాగా ఏర్పడి ఈ దందా చేస్తున్నట్లు తేలింది. హైదరాబాద్ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని పెద్ద అంబర్‌పేట పరిధిలో గోడౌన్ ఏర్పాటు చేసి కోట్ల రూపాయల విలువైన నకిలీ డిఏపి, అడుగు మందు బస్తాలను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఈ ముఠాకు చెందిన 8 మందిలో 6 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 1 డీసీఎం వాహనం, 1 మారుతి ఎర్టిగా కారు, 5 సెల్‌ఫోన్లు, వివిధ కంపెనీల లేబుళ్లతో ఉన్న నకిలీ డి ఏ పి బస్తాలు, నకిలీ ఎరువులు తయారు చేసే మిషన్, నకిలీ పాస్‌వర్డ్‌లతో కలిపి దాదాపు 2 కోట్ల రూపాయల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు.

## బాధ్యతాయుత మీడియాతోనే సమాజాభివృద్ధి

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





హైదరాబాద్, జులై 31 (జనంసాక్షి) : ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా ప్రజలను చైతన్యపరుస్తూ, సమాజంలో సానుకూల మార్పులు, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో మరింత కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ-నోవోటెల్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఎకనామిక్ టైమ్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్-తెలంగాణ 2026' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్, వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన సంస్థలు, పారిశ్రామికవేత్తలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక చైతన్యం, పారదర్శక వ్యాపార పోటీని ప్రోత్సహించడంలో ఎకనామిక్ టైమ్స్ వంటి మీడియా సంస్థలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. తెలంగాణ ఐటీ, ఆరోగ్యం, విద్య, పరిశ్రమల రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధితో పాటు పారదర్శకత, సామాజిక బాధ్యత, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ పాపోలు, ది టైమ్స్ ఆఫ్ ఇండియా సౌత్ హెడ్ ప్రశాంత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370